అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 26-12-2023
సమగ్ర తెలుగు దినపత్రిక

పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధం

- క్రిస్మస్ సందేశంలో గాజాపై ఇజ్రాయిల్ దాడులను విమర్శించిన పోప్
- మా హృదయాలు బెత్లహేంలో ఉన్నాయని ఆవేదన 13లో..
- మృతి చెందిన చిన్నారులను బాల ఏసులుగా వర్ణన



సంపుటి : 9 సంచిక : 355 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



పార్లమెంటుపై గులాబీ గురి..

ఎంపీ అభ్యర్థులతో కేటీఆర్ వరుస భేటీలు

- టికెట్ కోసం ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన నేతల విశ్వ ప్రయత్నాలు
- మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాసగౌడ్, పెద్దపల్లి నుంచి బాల్క సుమన్
- భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభ ఎన్నికల ఓటమి నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. రాబోయే పార్లమెంటు ఎలక్షన్లపై దృష్టి సారించింది. అందులో భాగంగా సిట్టింగ్ ఎంపీలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఆది, సోమవారాల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన పార్లమెంటు సభ్యులతో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి బయటపడి...లోక్‌సభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవ్వాలని ...3లో



నిధులొచ్చేనా..?

- నేడు ఢిల్లీకి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి
ప్రధానితో భేటీపై గంపెడాశలు
- కేంద్రం నుంచి రాష్ట్రానికి భారీగా రావాల్సిన బకాయిలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల నుంచి రాష్ట్రానికి మొండి చేయి చూపిస్తున్న మోడీ సర్కార్... తెలంగాణకు రావాల్సిన గ్రాంట్లు, ఆర్థిక సాయాలకు గండికొట్టింది. వాటిని పోరాడి సాధించాల్సిన గత బీఆర్ఎస్ సర్కార్ పేపర్ ప్రకటనలకే పరిమితమైంది. ఇప్పుడు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్... రాష్ట్రానికి రావాల్సిన నిధులు, బకాయిలు, పెండింగ్ బిల్లులను సాధిస్తుందనే ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాని మోడీతో మంగళవారం ఢిల్లీలో భేటీ కానున్న నేపథ్యంలో ఈ ఆశలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా పద్నాలుగు, పదిహేనో ఆర్థిక సంఘాల సిఫారసుల మేరకు కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే ఆర్థిక సాయాలు, మిషన్ భగీరథ నిర్వహణ కోసం పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసులు, చెరువుల పునరుద్ధరణ కోసం నిటి అయోగ్ చేసిన సూచనలు, స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు తదితరాంశాలను కేంద్రం పెడచెవిన పెట్టింది. ఇప్పుడు వీటిని సాధించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది.

కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు...

-పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం స్థానిక సంస్థలకు రూ.817.61 కోట్లు (ఇందులో గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.315.32 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.502.29 కోట్లు)

-రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం వెనుకబడిన జిల్లాలకు ...3లో



కరెంటుపై జీఎస్టీ

వినియోగదారులపై పెనుభారం

- కేంద్రం ఆదేశాలతో డెలాయిట్ అధ్యయనం
- ఎలక్ట్రిసిటీ డ్యూటీ స్థానంలో జీఎస్టీ విధించాలని సిఫార్సు

ప్రజల చేతిగోళ్లు ఊడగొట్టి పన్నులు వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం వెనకాడట్లేదు. అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ ఆదాయవనరుగా మార్చుకొనేందుకు తహతహ లాడుతుంది. తాజాగా నిత్యవసర వస్తువుగా మారిన కరెంటును జీఎస్టీ పరిధిలోకి తెచ్చి, జనం జేబుల్ని మరింత లూటీ చేసేందుకు సిద్ధమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్న ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఈడీ) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెట్టి, దానిలో కేంద్రం వాటాను రాబట్టుకోవాలని ప్రయత్నిస్తున్నది. కేంద్రం ఆదేశాలతో దీనిపై అధ్యయనం చేసిన 'డెలాయిట్ ఆడిట్ అండ్ కన్సల్టెంట్స్' సంస్థ జీఎస్టీ వసూలు చేస్తే ఆదాయం పెరుగుతుందనీ, ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో వ్యతిరేకత ఉండకపోవచ్చని అంచనా వేసి, నివేదిక ఇచ్చింది. నేడో రేపో ఈ కరెంటు బాంబు విద్యుత్ వినియోగదారుల నెత్తిన పడటం ఖాయంగా కనిపిస్తుంది.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు స్విచ్ వేస్తే 'జీఎస్టీ' షాక్ కొట్టడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే పెరిగిన కరెంటు చార్జీలతో విద్యుత్ వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పుడు వారిపై మరింత ఆర్థిక భారాన్ని మోపేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నది. దానికోసం ఓ ప్రయివేటు సంస్థతో అధ్యయనం చేయించింది. సదరు సంస్థ ఆ నివేదికను ఇటీవలే కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు అందచేసింది. వివరాల్లోకి వెళ్తే... ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ) లేదు. అయితే విద్యుత్ ఉపకరణాలు, బొగ్గు, గ్యాస్, సోలార్, విండ్ పవర్ ఉత్పత్తికి అవసరమైన వస్తువులపై జీఎస్టీ విధిస్తున్నారు. దాన్ని ఆయా విద్యుదుత్పత్తి సంస్థలు చెల్లిస్తున్నాయి. తాజాగా జీఎస్టీ పరిధిలోకి విద్యుత్ వినియోగదారుల్ని తెస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన కేంద్రప్రభుత్వానికి వచ్చింది. నిత్యవసర వస్తువల్లో విద్యుత్ కూడా చేరడంతో పన్ను ఎందుకు వేయకూడదో అధ్యయనం చేసి చెప్పండంటూ 'డెలాయిట్ ఆడిట్ అండ్ కన్సల్టెంట్స్' సంస్థను ఆదేశించింది. విద్యుత్ వినియోగదారులపై జీఎస్టీ విధిస్తే వచ్చే లాభనష్టాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ కోరింది. దీనిపై ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన 'డెలాయిట్' సంస్థ ఇటీవలే తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. దేశంలోని రాష్ట్రాలన్నీ వేర్వేరుగా ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఈడీ) వసూలు చేస్తున్నాయనీ, ఇది కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా, మరికొన్ని రాష్ట్రాల్లో తక్కువగా ఉన్నదని గుర్తించారు. ఈడీ స్థానంలో జీఎస్టీని తీసుకొస్తే, రాబడి అధికంగా ఉంటుందని నివేదికలో సిఫార్సు చేసినట్టు సమాచారం. కరెంటు వినియోగదారుల్ని జీఎస్టీ పరిధిలోకి తెస్తే దాని ప్రభావం ఆయా రాష్ట్రాల ఆదాయం పైనేగాక పరిశ్రమలు, గృహ వినియోగదారులపై ఎలా ఉంటుందనే విషయాలను కూడా 'డెలాయిట్' సంస్థ అధ్యయనం చేసింది.

పెట్రోల్, డీజిల్, సహజ వాయువు (గ్యాస్) వంటి అనేక వస్తువుల్లో విద్యుత్ ఒకటి. ఇప్పటివరకు ఇది జీఎస్టీ పరిధిలో లేదు. అయితే ఈ ప్రతిపాదనపై గతంలో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల విద్యుత్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశాల్లో చర్చించింది. కొన్ని రాష్ట్రాలు ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రం స్వాగతించినట్టు సమాచారం.

తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఈడీ)ని యూనిట్‌కు ఆరు పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు వంద యూనిట్ల కరెంటు కాలితే, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.6 చెల్లించాల్సి ఉంటుంది. కరెంటు బిల్లులో ఎలక్ట్రిసిటీ డ్యూటీ కాలమ్ సపరేట్‌గా ఉంటుంది. బిల్లు మొత్తంలో ...3లో

డిసెంబర్ వస్తే... దడ



కోవిడ్-19 కొత్త వేరియంట్‌తో భయం

- పెరుగుతున్న కొత్త కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

న్యూఢిల్లీ : కోవిడ్-19 కొత్త వేరియంట్ జేఎన్.1 కొత్త ఆందోళనను కలిగిస్తున్నది. దేశంలో కొత్త కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కరోనా మహమ్మారి ఇక దూరమైందని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలోనే మళ్లీ కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో కరోనా మహమ్మారి ప్రజల్లో మళ్లీ భయాన్ని పుట్టిస్తున్నది. మరీ ముఖ్యంగా చూస్తే, 2019 నుంచి ఇప్పటి వరకు పలు దశల్లో ఉగ్రరూపం చూపించిన కరోనా తీరును పరిశీలిస్తే.. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచే కేసులు మొదలవటం, పెద్ద ఎత్తున కేసులు నమోదవటం కనిపించింది. 2019లో ప్రపంచమంతా నూతన సంవత్సరాన్ని జరుపుకోవటానికి సిద్ధమవుతున్నది. అయితే, డిసెంబర్‌లోనే మొదటి కరోనా కేసు చైనాలో నమోదైంది. ఆ తర్వాత దీనికి కోవిడ్-19గా నామకరణం చేశారు. అనంతరం ప్రపంచ దేశాలను కరోనా మహమ్మారి వణికించింది. లక్షలాది మంది ప్రాణాలను తీసుకున్నది. అభివృద్ధి చెందిన దేశాలు సైతం రాకాసి కరోనాకు అతలాకుతలం అయ్యాయి. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బ తిన్నాయి. అభివృద్ధి క్షీణించింది. లక్షలాది మంది ఉద్యోగాలు ఊడిపోయాయి. ఎట్టకేలకు కరోనా మహమ్మారి తగ్గుముఖం పట్టిందని (కొన్ని కేసులు నమోదును మినహాయిస్తే) 2022, 2023 ఏడాదుల్లో ప్రజలు ...13లో

హైదరాబాద్‌లో 30కి పైగా కరోనా కేసులు

అనుమానితులకు పరీక్షలు

- జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో ఐదుగురికి కరోనా పాజిటివ్

వివరాలు 6లో

గ్రూప్-2 నిర్వహణపై సందిగ్ధం

జనవరి 6,7 తేదీల్లో రాతపరీక్షలు

- ఏర్పాట్లు చేయని టీఎస్‌పీఎస్సీ
- చైర్మెన్ సహా సభ్యుల రాజీనామా
- ఆందోళనలో అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇంకా కొన్ని రోజులే ఉన్నా రాతపరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చేయడం లేదు. ఇంకోవైపు గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా వేస్తున్నట్టు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష నిర్వహిస్తారా? లేక వాయిదా వేస్తారా? అన్నది ప్రకటించాలని వారు కోరుతున్నారు. ఈనెల 11న టీఎస్‌పీఎస్సీ సమీక్షా ...13లో

సింగరేణి ప్రయివేటుపరం కానివ్వం

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

- మహిళా కార్మికులకు ఉపరితలంపైనే పని
- ఇంటి స్థలం, వడ్డీ లేని రుణం ఇస్తాం : రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3లో..



నిరంకుశత్వం, దురహంకారాన్ని సమర్థిస్తోంది

రాజ్యసభచైర్మెన్ లేఖ పై ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ : రాజ్యసభ చైర్మెన్ లేఖ నిరంకుశత్వాన్ని, దురహంకారాన్ని సమర్థిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు. రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్‌కి రాసిన లేఖకు ఖర్గే సోమవారం ప్రత్యుత్తరమిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు, పార్లమెంట్ నిబంధనలను విధ్వంసం చేయడానికి, రాజ్యాంగం గొంతు నొక్కేందుకు అధికార పార్టీ ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ 'ఆయుధాన్ని' అనువైన సాధనంగా ఎంచుకుందని ...13లో

బతుకులను కమ్మేసిన పొగమంచు




రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- కొడుకు మృతి తెలిసి బయలుదేరిన కుటుంబీకులకూ ప్రమాదం
- క్రిస్మస్ పండుగ నాడు నిడమనూరులో మృత్యుఘోష
- అంతా ఒకే కుటుంబీకులు

నవతెలంగాణ- నిడమనూరు

తెల్లవారితే క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆశపడిన బతుకుల్లో చీకటి కమ్మేసింది. రాత్రివేళ పొగమంచు దారులను మూసేయడంతో ...13లో





ప్రశ్నార్థకంగా పార్లమెంట్?

- కమిటీకి ఒక్క బిల్లూ పంపలేదు
- సభ్యులను మూకుమ్మడిగా గెంటేశారు
- డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రస్తావనే లేదు
- ఇదీ పార్లమెంట్ శీతాకాల సమావేశాల తీరు

17వ లోక్‌సభ పదవీకాలం ముగియబోతోంది. మరో సమావేశం మాత్రమే జరగాల్సి ఉంది. లోక్‌సభ చరిత్రలోనే తొలిసారిగా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరపకుండానే ఇప్పటి వరకూ కార్యకలాపాలు నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా లోక్‌సభ ఉప సభాపతిని ఎన్నుకోవాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ పాలక పక్షం దానిని పట్టించుకోలేదు. పైగా పాత పార్లమెంట్ సభ్యులకు సరిపోవటం లేదని, భద్రతాపరంగా ఉపయోగపడదని మోడీ సర్కార్ చెప్పుకొచ్చింది. కొత్త పార్లమెంట్ కడితే సభ్యులకు సౌకర్యంగా, భద్రతగా ఉంటుందని కోట్లు ఖర్చుపెట్టారు. ఇటీవల బయటపడ్డ భద్రత డొల్లతనాన్ని ప్రశ్నించినందుకు...ఏకంగా ఉభయసభల నుంచి 146 మంది ఎంపీలను మూకుమ్మడిగా గెంటేశారు. ప్రతిపక్షం లేని సమయం చూసి వివాదాస్పద బిల్లులన్నిటినీ ఏకపక్షంగా ఆమోదించుకున్నారు. బిల్లులను కమిటీల పరిశీలనకు పంపడమనే నియమాన్నే మరిచారు. పార్లమెంట్ ప్రతిష్టను, దానిపై ప్రజలకున్న విశ్వాసాన్ని ప్రశ్నార్థకంగా మార్చారు.



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 4 నుంచి 21వ తేదీ వరకూ జరిగాయి. షెడ్యూల్ కంటే ఒక రోజు ముందే ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ తన నిర్ధారిత సమయంలో 74 శాతం, రాజ్యసభ 81శాతం పనిచేశాయి. ఈ సమావేశాలలో 10 బిల్లులను ప్రవేశపెట్టారు. 17 బిల్లులకు ఆమోదం లభించింది. ఈ నెల 13న పార్లమెంటులో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. దీంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. భద్రతా వైఫల్యం కారణంగా పార్లమెంట్ కార్యకలాపాలకు ఆంతరాయం ఏర్పడింది. ఘటనపై స్పందించాలంటూ ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో ఆ రోజు 20 శాతం మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. లోక్‌సభ నుండి ఒకే రోజు ఇంతమంది సభ్యులను సస్పెండ్ చేయడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ నెల 14 నుంచి 21వ తేదీ ...6లో

తల్లిదండ్రుల అనుమతి లేకుండా పిల్లలను శాంతా క్లాజ్ దుస్తులు ధరించనివ్వవద్దు

- మధ్యప్రదేశ్‌లో షాజాపూర్ జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాలు

భోపాల్ : తల్లిదండ్రులు అనుమతి లేకుండడా పిల్లలను శాంతా క్లాజ్ దుస్తులు ధరించనివ్వద్దని మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లాలో విద్యాశాఖాధికారి ఒకరు వివాదాస్పద ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రుల రాతపూర్వక అనుమతి లేకుండా విద్యార్థులు క్రిస్మస్ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీ దుస్తులు ధరించాలంటే తల్లిదండ్రులు లేదా పిల్లల సంరక్షకుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను సదరు అధికారి ఈ నెల 14న జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు ఈ ఆదేశాలు జారీ చేసినట్టు ఆ అధికారి తెలపటం గమనార్హం. అయితే పాఠశాలల్లో క్రిస్మస్‌కు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించకుండా ఉత్తర్వులు నిషేధించలేదని జిల్లా విద్యాశాఖ అధికారి వివేక్ దూబే తెలిపారు. గతేడాది విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) మధ్యప్రదేశ్‌లోని పాఠశాలలను వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండా శాంతాక్లాజ్ దుస్తులు ధరించాలని పిల్లలను అడగొద్దని హెచ్చరించింది. ప్రస్తుతం సదరు విద్యా శాఖాధికారి ఇలాంటి ఆదేశాలనే జారీ చేయటం గమనార్హం.

పట్టాలుతప్పిన అజ్మీర్-సిల్దా ఎక్స్‌ప్రెస్ రైలు..



- తృటిలో తప్పిన ముప్పు..

అజ్మీర్: రాజస్థాన్‌లోని అజ్మీర్ నగర సమీపంలో తృటిలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. సేఫ్టీ బ్రేకులు పట్టేయడంతో అజ్మీర్-సిల్దా ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి పక్కకు దూసుకెళ్లింది. మొత్తం నాలుగు బోగీలు పట్టాల పైనుంచి పక్కకు వెళ్లాయి. సోమవారం ఉదయం 8 గంటలకు మదర్ రైల్వే యార్డ్ దగ్గర ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన నాలుగు బోగీలు బోల్తాపడితే ఘోరం జరిగేదని, బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని నార్త్-వెస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శశికిరణ్ చెప్పారు. ప్రస్తుతం రైల్వే అధికారులు, డీఆర్‌ఎం ఘటనా స్థలంలో ఉన్నారని, పట్టాలు తప్పిన నాలుగు బోగీలను తిరిగి ట్రాక్ పైకి ఎక్కించే పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఎవరికీ ఎలాంటి గాయాలు గానీ కాలేదని తెలిపారు.

ఇది కేంద్రం వైఫల్యమే...

పార్లమెంటు ఘటనపై సామాజిక కార్యకర్తలు

న్యూఢిల్లీ : పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఇద్దరు వ్యక్తులు లోక్‌సభలోకి ప్రవేశించి అలజడి సృష్టించిన విషయం ఇప్పటికీ షాక్‌కు గురి చేస్తున్నది. కొత్త పార్లమెంటు భవనంలో సమావేశాల సందర్భంగా చోటు చేసుకున్న ఈ పరిణామం యావత్‌దేశాన్ని విస్మయానికి గురి చేసింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ చోటు చేసుకోకపోయినప్పటికీ.. జరిగిన తీరు మాత్రం ఆందోళన కలిగించేదేనని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇందులో కేంద్రం వైఫల్యం పూర్తిగా కనబడుతున్నదనీ, ఈ విషయంలో మోడీ సర్కారు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంటుపై దాడి ఘటనకు సంబంధించి మనోరంజన్, సాగర్ శర్మ నీలం, అమోల్ షిండే, మహేష్ కుమావత్, లలిత్ ఝా అనే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వారే కావటం గమనార్హం. కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలు, మణిపూర్ సంక్షోభం, నిరుద్యోగం సహా అనేక అంశాలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో వీరు పాల్గొన్నట్టు సమాచారం ఉన్నది.

ఈ అంశాలే వారి ప్రస్తుత చర్యకు పురిగొల్పిందని తెలుస్తున్నది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ సాగుతున్నది. నిందితులపై పోలీసులు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను పార్లమెంట్ భద్రతకు సంబంధించిన ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. అత్యంత పటిష్టమైన భద్రత ఉండాల్సిన పార్లమెంటులో ఈ వైఫల్యం కేంద్రం తప్పిదమేనని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఈ విషయంలో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏ రైతూ కరువు రావాలని కోరుకోడు

- కర్ణాటక మంత్రి వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏ రైతూ కరవు రావాలని కోరుకోడని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. రుణమాఫీ కోసం రైతులు ఏటా కరువు రావాలని కోరుకుంటున్నారంటూ కర్నాటక మంత్రి శివానంద పాటిల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. రైతుల గురించి హాస్యాస్పద ప్రకటనలు చేస్తున్న వీరు ఎలాంటి మంత్రులని ప్రశ్నించారు. అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో సైతం రైతులు ప్రభుత్వం నుంచి సానుభూతిని తప్ప మరేమీ కోరుకోరని పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలు చేయటమంటే రైతులను అవమానించడమేనని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

మధ్యప్రదేశ్ క్యాబినెట్ విస్తరణ..

- మంత్రులుగా 28 మంది ప్రమాణస్వీకారం

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన క్యాబినెట్‌ను సోమవారం విస్తరించారు. కొత్తగా 28 మందిని తన క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. వారి 18 మంది క్యాబినెట్ మంత్రులుగా, ఆరుగురు స్వతంత్రులుగా, మిగతా నలుగురు సహాయ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మధ్యప్రదేశ్ క్యాబినెట్‌లో ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 35 మందికి చోటు కల్పించే అవకాశం ఉంది. సీఎం మోహన్ యాదవ్ కొత్తగా క్యాబినెట్‌లోకి తీసుకున్న 28 మందితో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సీ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేసిన 18 మందిలో ప్రద్యుమన్ సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, కైలాస్ విజయవర్గీయ, విశ్వాస్ సారంగ్ ఉన్నారు. ఆరుగురు స్వతంత్ర హోదా మంత్రులుగా అవకాశం కల్పించారు. మరో నలుగురిని సహాయ మంత్రులుగా తీసుకున్నారు.

ఈ సారి ఆ తప్పు చేస్తే నియంతృత్వమే..

- ఉద్ధవ్ సంచలన వ్యాఖ్యలు..

ముంబయి: శివసేన(యుబిటి) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే 2024 ఎన్నికల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నియంతృత్వం ముందు ఉందని, మళ్లీ ఆ తప్పు (బిజెపిని ఎన్నుకోవడం) చేస్తే దేశంలో ఇక నియంతృత్వమే అని అన్నారు. భారతదేశ స్వేచ్ఛను రక్షించే సమయం ఆసన్నమైందని అన్నారు. తూర్పు ముంబైలోని కుర్లాలో సోమవారం జరిగిన ఒక సమావేశంలో జైన్ కమ్యూనిటీని ఉద్దేశించి మాట్లాడుతు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశం ప్రసుత్తం గడ్డుకాలం ఎదుర్కొంటోందని, ఈ సారి మనం తప్పు చేస్తే దేశం నియంతత్వంలోకి వెళ్తుందని, దేశాన్ని ఎవరు కాపాడుతారని ప్రశ్నించారు. పరోక్షంగా బిజెపిని ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని, ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం పోరాడామని, ఇప్పుడు స్వేచ్ఛ కోసం పోరాడుతున్నామని, దేశంలో గందరగోళ వాతావరణం ఉందని, నియంతత్వం మన దరిదాపుల్లో ఉందని, దాన్ని మనం ఆపాలంటూ వ్యాఖ్యానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి పొరబాట్లను చేయవద్దని ప్రజలను కోరారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇక్కడికి రాలేదని, దేశం కోసం వచ్చానని అన్నారు.

నుమాయిష్‌కు రెడీ

జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15వరకు నిర్వహణ ఏర్పాట్లలో సొసైటీ సభ్యులు దాదాపు 2400 స్టాల్స్ ఏర్పాటు :

- నగరానికి చేరుకుంటున్న వివిధ రాష్ట్రాల వ్యాపారులు
- వినియోగదారుల కోసం మొబైల్ యాప్ అందుబాటులోకి..
- సీఎం చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో అతిపెద్ద ఎగ్జిబిషన్ నుమాయిష్‌కు వేళైంది. నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 83వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన (నుమాయిష్) వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు కొనసాగనుంది. 46రోజులపాటు ఈ ప్రదర్శన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నుమాయిష్ ప్రదర్శనను ప్రారంభించేందుకు సొసైటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈసారి 2400 స్టాల్స్

గతేడాది నుమాయిష్‌లో దాదాపు 2300 స్టాళ్లను ఏర్పాటు చేయగా.. ఈసారి 2400 స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులను ఆహ్వానించే ప్రక్రియను పూర్తి చేసిన సొసైటీ.. స్టాల్స్ నిర్మాణాన్ని ప్రారంభించింది. దాదాపు 85-90 శాతంపైగా పనులు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ఏడాదికి భిన్నంగా స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు మైదానంలో లే-అవుట్ పనులు తీర్చిదిద్దుతున్నారు. ఎగ్జిబిషన్ ప్రవేశ ద్వారాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ఎంట్రీ ఫీజు రూ.40గా నిర్ణయించారు. సందర్శకుల వాహనాల పార్కింగ్‌కు నగర ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సహకారంతో ఖాళీ స్థలాన్ని ఉచితంగా కల్పిస్తున్నారు. నుమాయిష్ ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.20 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలుస్తోంది.

వృద్ధులు, నడవలేని వారికి ప్రత్యేక ఏర్పాట్లు

వృద్ధులు, నడవలేని వారి కోసం వాహనాల ద్వారా సందర్శన, అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నారు. వృద్ధులు, నడవలేని వారికి ఎగ్జిబిషన్ లోపల ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు వాహనాలతో సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఈసారి ఎగ్జిబిషన్‌లో ఫిష్ అక్వేరింగ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. 60 ఫీట్ల వెడల్పు, 40 ఫీట్ల ఎత్తులో ఈ అక్వేరింగ్ ఉంటుంది. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సొసైటీ సభ్యులు చెబుతున్నారు. నుమాయిష్‌ను దృష్టిలో పెట్టుకుని టీఎస్‌ఆర్టీసీ పలు డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడపనుంది. నాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌లు ఎగ్జిబిషన్ మైదానానికి సమీపంగా ఉంటాయి. మియాపూర్-ఎల్బీనగర్, నాగోల్, రాయదుర్గం మార్గాల్లో నడిచే మెట్రో రైళ్లను అర్ధరాత్రి 12 గంటల వరకు నడిపే అవకాశం ఉంది.

25లక్షలకు పైగా సందర్శన

ఈసారి నుమాయిష్‌ను 25 లక్షల మందికిపైగానే సందర్శించే అవకాశం ఉందని సొసైటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసే వ్యాపారులు ముందుగా దరఖాస్తు చేసుకుంటారు. ఈసారి 3500 దరఖాస్తులు వచ్చాయని సొసైటీ సభ్యులు తెలిపారు. ఇందులో సీనియార్టీని బట్టి స్టాల్స్ అప్పగించారు. ఫ్యాషన్, గార్మెంట్స్, టెక్స్‌టైల్స్, హాండ్లూమ్స్, హోమ్ నీడ్స్, జ్యూయెల్లరీ, బ్యూటీ, హెల్త్ కేర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆటోమూవీస్, ఫుడ్ కోర్టతోపాటు తదితర వాటికి సంబంధించి స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. పిల్లల కోసం జాయ్‌రైడ్స్ అందుబాటులో ఉండనున్నాయి. వినియోగదారుల కోసం నుమాయిష్ మొబైల్ యాప్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల్లో స్మార్ట్ ఫోన్‌లలో యాప్ స్టోర్‌ల నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. కాగా నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

నార్కొటిక్ బ్యూరోకు చిక్కిన కీలక నిందితుడు

- సుక్కా నర్సింహా గౌడ్ అరెస్టు
- 25 ఏండ్లుగా మత్తు పదార్థాల అక్రమ వ్యాపారం
- కోట్లాది రూపాయల ఆస్థుల సీజ్‌కు అధికారుల యత్నాలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

కోట్లాది రూపాయలు విలువ చేసే మత్తు పదార్థాల క్రయవిక్రయాలను సాగిస్తూ రాష్ట్రంలో డ్రగ్స్ స్మగ్లింగ్‌కు మూల కారకుడిగా మారిన సుక్కా నర్సింహ గౌడ్‌తో పాటు ఆయన అనుచరులను రాష్ట్ర నార్కొటిక్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. కోట్లాది రూపాయల విలువైన అల్‌ప్రాజోలమ్ మత్తుపదార్థాన్ని స్వాధీనపర్చుకున్న అధికారులు ప్రధాన నిందితుడి ఆస్తులను సీజ్ చేయటానికి చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపిన వివరాల ప్రకారం.. సుక్కా నర్సింహా గౌడ్ 25 ఏండ్ల నుంచి మత్తు పదార్థాల అక్రమ రవాణా చేస్తున్నాడు. ఢిల్లీలో ఉన్న అల్‌ప్రాజోలమ్(ఇది ఒక రకమైన మత్తు మందు) సప్లయర్‌లతో ఈయనకు సంబంధాలున్నాయి. 1995లో తొలుత ఈయన ఢిల్లీలోని భాటియా నుంచి, ఆయన మరణానంతరం ప్రమోద్ సింగ్ నుంచి మెట్రో కొరియర్ సర్వీసుల ద్వారా పొందేవాడు. హవాలా ద్వారా చెల్లింపులు చేసేవాడు. కేజీ అల్‌ప్రాజోలమ్‌ను రూ. 2.4 లక్షలకు కొనుగోలు చేసి కస్టమర్లకు దానిని రూ.3.5 లక్షలకు అమ్మేవాడు. ఆయన ఇలా నెలకు 30-40 కేజీల డ్రగ్‌ను విక్రయించేవాడు. విట్టల్‌గౌడ్, నరేందర్ గౌడ్ అనే వ్యక్తుల ద్వారా కూడా నర్సింహ గౌడ్ అల్‌ప్రాజోలమ్‌ను అందుకునేవాడు. కాగా, నిందితులు నర్సింహ గౌడ్, ఆయన కొడుకు రాజశేఖర్‌లను పట్టుకున్న తరుణంలో గుండుమల్ల వెంకటయ్య 17 కేజీలు, గొల్ల రమేశ్ 10 కేజీల మత్తుమందుతో పరారయ్యారు. కాగా, అరెస్టయిన ఇద్దరు నిందితులు తమ వద్ద ఉన్న మత్తుమందును నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ టౌన్, సింగోటమ్ గ్రామాల్లో కల్లు దుకాణాలకు సప్లరు చేయాలనుకున్నారు.

ఈ అక్రమ వ్యాపారం ద్వారా సుక్కా నర్సింహగౌడ్, ఆయన కుటుంబం పెద్ద ఎత్తున ఆస్తులను సంపాదించుకున్నారు. ఇందులో గచ్చిబౌలిలో రూ.3.5 కోట్ల విలువ చేసే మూడంతస్తుల భవనాన్ని 2015లో కొనుగోలు చేశాడు. అలాగే, 2017 నుంచి 2022 మధ్యలో శ్రీరామ్‌నగర్ కాలనీ, కొండాపూర్, గచ్చిబౌలిలలో రూ.1.8 కోట్ల చొప్పున మొత్తం రూ.5.4 కోట్లతో మూడు ఓపెన్ ప్లాట్లను, కొల్లాపూర్ గ్రామంలో 2019లో రూ.90 లక్షలు విలువ చేసే 9 ఎకరాల వ్యవసాయ భూమిని, అంకిరావ్‌పల్లిలో 2010లో రూ.14 లక్షలతో ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ ఏడాది నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని రూ.1.6 కోట్లు చెల్లించి సొంతం చేసుకున్నాడు. అలాగే, గతేడాది కొల్లాపూర్ టౌన్ శివారు ప్రాంతంలో రూ. 2 కోట్లు విలువ చేసే రెండెకరాల భూమిని సంపాదించాడు. అలాగే, షేర్లు, ఫైనాన్స్, వడ్డీ వ్యాపారాల్లోనూ పెట్టుబడులు పెట్టి లాభాలు గడించాడు. వీటితో పాటు సుక్కా నర్సింహ గౌడ్ పేరు మీద ఇతర స్థిర, చర ఆస్థులున్నాయి.

సీఎంను కలిసిన మంత్రి కోమటిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పైళ్ల మల్లారెడ్డి (యూఎస్‌ఏ), సాత్విక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం తినడంతో భక్తులకు అస్వస్థత..

- ఒకరు మతి, 70 మందికి సీరియస్



బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో విషాదం నెలకొంది. హొస్కోటేలోని ఓ ఆలయం వద్ద పంచి పెట్టిన ప్రసాదం తిని ఓ మహిళ మతి చెందగా, మరో 70 మందికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. హొస్కోటేలోని ఓ ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అయితే రోజు మాదిరిగానే అక్కడ శనివారం కూడా ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఇక భక్తులు ప్రసాదం సేవించి, తమ తమ నివాసాలకు చేరుకున్నారు. ఆదివారం నాడు 70 మంది దాకా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఓ మహిళ సోమవారం ఉదయం మతి చెందింది. పలువురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అయితే ప్రసాదం సేవించని ఇతర భక్తులకు ఎలాంటి వాంతులు, విరేచనాలు కాలేదని అధికారుల విచారణలో తేలింది.

కప్పేస్తున్న పొగ మంచు

- విమానయానానికి అంతరాయం
- యూపీలో 10 వాహనాలు ఢీ



న్యూఢిల్లీ : ఉత్తరభారతాన్ని చలి పులి వణికిస్తుంది. దేశ రాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దేశరాజధాని ప్రాంతంలో సోమవారం ఉష్ణోగ్రతలు 9.4 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. దీంతోపాటు దట్టంగా పొగ కమ్మేసింది. దట్టమైన పొగ మంచు కారణంగా విజిబిలిటీ సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరాదిలో అనేక ప్రాంతాల్లో విజిబిలిటీ జీరోకి పడిపోయింది. ఢిల్లీలోని పాలెం విమానాశ్రయం, అమృతసర్, ఆగ్రా, గ్వాలియర్, ప్రయాగ్‌రాజ్, జైసల్మేర్ విమానాశ్రయాల్లో విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితులు జాతీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర ప్రభావం పడింది. దట్టమైన పొగ మంచు కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా.. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే దట్టమైన పొగ మంచు కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఢిల్లీకి సుమారు 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాపూర్‌లోని హఫీజ్‌పూర్ కొత్వాలి ప్రాంతంలో సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాపూర్-బులంద్‌షహర్ హైవేపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పొగ మంచుకారణంగా సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదం నేపథ్యంలో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో దెబ్బతిన్న కార్లను క్రేన్ సాయంతో పోలీసులు అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

తమిళనాడులో ఈడీ అధికారులపై కేసు నమోదు

చెన్నై: తమిళనాడు పోలీసులు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడి) అధికారులపై కేసు నమోదు చేశారు. ఈడీ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ(డీవీఏసీ) అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకొన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని మదురైలో ఈడీ అధికారిగా పని చేస్తున్న అంకిత్ తివారీని లంచం కేసులో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా డీవీఏసీ అధికారులు తనిఖీల నిమిత్తం స్థానిక ఈడీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సోదాలు చేస్తున్న సమయంలో ఈడీ అధికారులు తమను అడ్డుకున్నారని డీవీఏసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారులపై మదురై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. నిందితుడైన ఈడీ అధికారి అంకిత్ తివారీ ఓ ప్రభుత్వ అధికారి ఆస్తులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తొలుత రూ.3 కోట్లు డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రూ.51 లక్షలైనా ఇవ్వాలన్నాడు. చివరికి ఒప్పందంలో భాగంగా రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా.. అంకిత్‌ను డీవీఏసీ అధికారులు పట్టుకున్నారు.

4 వేలు దాటిన యాక్టీవ్ కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుండి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో 312 కొత్త కేసులు వెలుగు చూసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742 నుంచి 4,054కు పెరిగింది. అలాగే సబ్‌వేరియంట్ జెఎన్1 కేసుల సంఖ్య 63కు చేరుకుందని తెలిపింది. గోవాలో ఈ సబ్‌వేరియంట్ కేసులు అత్యధికంగా 34 కేసులు వెలుగుచూశాయి. మహారాష్ట్రలో ఈ కేసులు 9 నమోదుకాగా, థానేలోనే 5 కేసులు నమోదయ్యాయి. ఈ వేరియంట్ సోకినవారిలో స్వల్ప లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయని, బాధితులు త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మొత్తం కేసుల్లో కేరళలో అత్యధికంగా 128 కేసులు నమోదు కాగా, ఒకరు మరణించినట్లు అధికారులు తెలిపారు. దేశంలో మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. గత 24 గంటల్లో 315 మంది కొవిడ్ నుంచి కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్న వారి సంఖ్య 4.44 కోట్లకు చేరుకుంది.

ఉల్లిపాయలు, ఇసుకతో అతి పెద్ద శాంటా

- శిల్పాన్ని రూపొందించిన సుదర్శన్



పూరీ: ఒడిశాకు చెందిన ప్రముఖ సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ మరోసారి తన నైపుణ్యాన్ని చాటారు. పూరీలోని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ఉల్లిపాయలు, ఇసుక ఉపయోగించి ప్రపంచంలోనే అతి పెద్ద శాంటాక్లాజ్ సైకత శిల్పాన్ని రూపొందించారు. క్రిస్మస్ సందర్భంగా 'గిఫ్ట్ ఏ ప్లాంట్, గ్రీన్ ద ఎర్త్' అన్న సందేశంతో 100 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల వెడల్పు ఉన్న భారీ శాంటాక్లాజ్‌ను తీర్చదిద్దినట్లు తెలిపారు. దీని కోసం రెండు టన్నుల ఉల్లిపాయలు వినియోగించినట్లు చెప్పారు. 'ఒక మొక్కను బహుమతిగా ఇవ్వండి, భూమిని పచ్చగా చేయండి' అన్న సందేశంతో ఈ సైకత శిల్పాన్ని తయారు చేసినట్లు వెల్లడించారు. కాగా, ప్రస్తుత కాలంలో ఎక్కువ చెట్లను నాటాల్సిన అవసరం ఉందని సుదర్శన్ పట్నాయక్ తెలిపారు. అందుకే ప్రపంచంలోనే అతి పెద్ద శాంటాక్లాజ్ సైకత శిల్పంలో ఉల్లిపాయలను కూడా టన్నుల్లో వినియోగించినట్లు చెప్పారు. 'వాతావరణ మార్పుల ప్రభావం గురించి మనందరికీ తెలుసు. కాబట్టి ఇది మనందరికీ ఒక సందేశం. మరిన్ని చెట్లను నాటడం ఆవశ్యకత. ఈ సైకత శిల్పాన్ని పూర్తి చేయడానికి 8 గంటలు పట్టింది. ఇసుక, ఉల్లిపాయలతో కూడిన అతిపెద్ద శాంతాక్లాజ్ సైకత శిల్పం ఉన్న భారతదేశాన్ని క్రిస్మస్ జరుపుకుంటున్న ప్రపంచం చూస్తుంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను అందులో పోస్ట్ చేశారు.

పార్లమెంటరీ సంస్థలు నిర్వీర్యం

• మోడీ పాలనలో దిగజారిన ప్రజావ్యవస్థ • రాష్ట్రాలే నయమంటున్న పరిశీలకులు

ఏ ప్రజాస్వామ్య దేశంలో అయినా కీలక అంశాలపై విధానపరమైన మార్పులు చేసే ముందు ప్రజాభిప్రాయాన్ని స్వీకరిస్తారు. దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరుపుతారు. ఇవేమీ చేయకపోగా కనీసం చట్టసభలో నిస్పాక్షికంగా ఓటింగ్ కూడా జరపలేదు. పైగా ప్రతిపక్ష సభ్యులు సభలో లేకుండా చేసి మరీ కేంద్రం బిల్లులను ఆమోదించుకోవడాన్ని చూస్తుంటే ఫీల్డర్లను క్రికెట్ మైదానం నుండి బయటికి పోవాలని ఆదేశించి, ఆ తర్వాత బ్యాటర్ సెంచరీ చేసినట్టు ఉంది.


న్యూఢిల్లీ : గత వారం పార్లమెంట్ నుంచి ప్రతిపక్ష సభ్యులను బయటికి గెంటేసిన తర్వాత కొన్ని కీలక బిల్లులకు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. వీటిలో ఐపీసీ, ఇండియన్ ఎవిడెన్స్ చట్టం, సీఆర్‌పీసీ, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, ఇండియన్ వైరెలెస్ టెలిగ్రఫీ చట్టం ఉన్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు కట్టబెట్టే కొత్త బిల్లును కూడా పార్లమెంట్ ఆమోదించింది. దేశంలో క్రిమినల్ చట్టాల నిర్మాణం, ఇంటర్నెట్ సేవలపై నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంది.

దేశంలో ప్రజాస్వామ్యం కూనారిల్లిపోతోందని చెప్పడానికి పార్లమెంటులో ప్రతిపక్షం లేకుండా చేయడానికి చేసిన ప్రయత్నమే ఉదాహరణ. గడచిన దశాబ్ద కాలంలో పేలవమైన పనితీరును కనబరుస్తూ, ప్రజల్లో అప్రదిష్ట మూటకట్టుకుంటున్న కేంద్ర సంస్థల్లో ఇప్పుడు పార్లమెంట్ కూడా చేరింది. ఇప్పటికే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పనితీరుపై పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. రాజకీయ నాయకులు దుందుడుకుగా, అతిగా ప్రవర్తిస్తే వారికి కళ్లెం వేయడానికి సుప్రీంకోర్టుకు అధికారం ఉంది. అయితే నరేంద్ర మోడీ హయాంలో ఆ పని జరగడం లేదు. పెద్ద నోట్ల రద్దు, కాశ్మీర్ హోదాను కేంద్ర పాలిత ప్రాంతానికి కుదించడం, ఎన్నికల బాండ్లు, పౌరసత్వ సవరణ చట్టం...

పెరిగిన రాష్ట్రాల ప్రాధాన్యత

అనేక రాష్ట్రాలలో కూడా ప్రభుత్వ సంస్థల పనితీరు ఇలాగే ఉన్నప్పటికీ ఇంతలా దిగజారలేదు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో కేంద్ర సంస్థలే బలంగా ఉన్నాయి. అయితే రాష్ట్రాలలోనే తొలుత ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రారంభమయ్యాయి. బ్రిటీష్ వారు 1937లో ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీలు రాజ్యాంగ అసెంబ్లీని ఎన్నుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రాలపై పెత్తనం చెలాయించింది. 1980వ దశకం చివరలో కాంగ్రెస్ ప్రాభవం తగ్గిపోవడం మొదలైంది. దీంతో దేశంలో సమాఖ్యతత్వం, రాష్ట్ర రాజకీయాలు బలపడ్డాయి. ఆర్థిక రంగంలో కూడా రాష్ట్రాల ప్రాధాన్యత పెరిగింది. కేంద్ర వ్యయంతో పోలిస్తే రాష్ట్రాలు పెట్టే ఖర్చే ఆర్థిక ప్రభావం చూపింది. 1990వ దశకం నుంచి కేంద్రంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకే ప్రజలు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభమైంది. ముస్లింలు, దళితులు, పేదలు రాష్ట్ర ప్రభుత్వాలనే ఎక్కువగా విశ్వసించారు.

జాతీయ స్థాయి ఎన్నికలతో పోలిస్తే రాష్ట్ర స్థాయిలో జరిగే ఎన్నికల పైనే ప్రజలకు ఆసక్తి అధికంగా ఉంటోంది. దీనికి ఉదాహరణ లోక్‌సభ ఎన్నికల కంటే శాసనసభ ఎన్నికలలోనే ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండడమే. అర్థ శతాబ్దం క్రితం పార్లమెంటే అత్యుత్తమమైన చట్టసభగా పేరు గాంచింది. కానీ ఈ రోజు పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. పార్లమెంట్‌లో కంటే రాష్ట్ర శాసనసభలలోనే కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. పరిశీలకులూ అదే చెబుతున్నారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో మూకుమ్మడిగా ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. రాష్ట్ర శాసనసభలలో ఇలాంటి వాతావరణం ఎన్నడూ కన్పించలేదు.



ఇలాంటి వివాదాస్పద విధానాలన్నింటికీ సుప్రీంకోర్టు రబ్బరు స్టాంపు వేయడమో లేదా దాటవేయడమో జరిగింది తప్ప వాటిని తోసిపుచ్చింది లేదు.

ఎన్నికల కమిషన్ నిర్వహణ విషయంలో కూడా ఇలాంటి స్వతంత్రతే కొరవడింది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదులు, నిపుణులు వ్యక్తం చేసిన ఆందోళనలు అరణ్యరోదనే అయ్యాయి. ఇప్పుడు తీసుకొచ్చిన నూతన చట్టం ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రానికే అధికారాలు దఖలు పరిచింది. ఇదెలా ఉందంటే తనకు ఇష్టం వచ్చిన వారిని క్రికెట్ అంపైర్లుగా బ్యాటర్ నియమించినట్లుంది. న్యాయస్థానాలు పట్టించుకోకపోవడం, ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు పాలకుల రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం దేనికి సంకేతం? అధికార పక్ష నేతలు ఎన్ని తప్పులు చేసినా కిమ్మనని దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రత్యర్థులపై మాత్రం ఒంటికాలుపై లేస్తున్నాయి.

ఇదంతా బహిరంగంగా జరుగుతున్న తంతే. మోడీ పాలనలో ప్రజాస్వామ్యం పరిస్థితి నానాటికి తీసికట్టు...నాగం భొట్టు మాదిరిగా తయారైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు పాలకుల జేబు సంస్థలుగా మారిపోయాయి.

కరెంటుపై జీఎస్టీ



(మొదటిపేజి తరువాయి)

ఈ సొమ్ము కలిసే ఉంటుంది. స్వల్ప మొత్తమే కాబట్టి వినియోగదారులు దీనిపై పెద్దగా దృష్టిపెట్టలేదు. ఇప్పుడు కేంద్రం చూపు దీనిపైగా పడింది. 'ఈడీ' ద్వారా వసూలైన సొమ్ము నేరుగా రాష్ట్రాల ఖజానాకే వెళ్తుంది.

'ఈడీ' ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉండటం వల్ల పన్ను వసూళ్లలో హేతుబద్ధత లేకుండా పోతున్నదనీ, దాన్ని స్థిరీకరిస్తూ 'జీఎస్టీ' పరిధిలోకి తెస్తే, రాష్ట్రాల వాటా ఆదాయం కూడా పెరుగుతుందని 'డెలాయిట్' విశ్లేషించింది. అయితే ఈ ప్రభావం గృహ విద్యుత్ వినియోగదారులపై భారీగా పడుతుంది. దానితో పాటు పరిశ్రమలకూ కరెంటు జీఎస్టీ భారం అధికమైతే, వాటి ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతుంది. అంతిమంగా ఆయా వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయి. కరెంటును జీఎస్టీ పరిధిలోకి తెస్తే ఏఏ రాష్ట్రాలు ఎంత ఆదాయాన్ని కోల్పోతాయనే అంచనాను కూడా 'డెలాయిట్' మదింపు చేసింది. ఆ ఆదాయాలను భర్తీ చేసేలా జీఎస్టీ శ్లాబు రేటు నిర్ణయం జరగాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయం దేశీయ పారిశ్రామిక రంగంపై ప్రభావాన్ని చూపుతుందని హెచ్చరించింది. అయితే ఇప్పటికే విద్యుదుత్పత్తి ఉపకరణాలపై జీఎస్టీ విధిస్తున్నందున, తిరిగి కరెంటు వినియోగదారులపై కూడా జీఎస్టీ విధిస్తే, పన్నుపై పన్ను వేసినట్టు అవుతుందని విద్యుత్‌రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల కరెంటు బిల్లులు భారీగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సంస్కరణల వల్ల రాష్ట్రాలు కోల్పోయే ఆదాయాన్ని జీఎస్టీ ద్వారా భర్తీ చేయవచ్చని 'డెలాయిట్' ప్రతిపాదించిట్టు సమాచారం. అయితే రాష్ట్రాల మధ్య 'ఈడీ' పన్ను ఒక శాతం నుంచి ఐదు శాతం వరకు ఉన్నదనీ, జీఎస్టీ పరిధిలోకి తెస్తే 0.5 శాతం నుంచి ఒక్క శాతానికి పరిమితం చేయవచ్చని ప్రతిపాదించారు. మరోవైపు ప్రస్తుతం విద్యుత్‌పై జీఎస్టీ లేనందున ఉత్పత్తిదారులు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లను ఉపయోగించుకోలేకపోతున్నారనీ, విద్యుత్‌పై జీఎస్టీ రేటును 5 శాతంగా నిర్ణయిస్తే, బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకునే వెసులుబాటు లభిస్తుందని 'డెలాయిట్' విశ్లేషించింది. త్వరలోనే కేంద్రప్రభుత్వం దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదనకు రాష్ట్రాలను ఒప్పించేలా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.



సికింద్రాబాద్ చర్చిలో ..క్రిస్మస్ సంబురాలలో చిన్నారులు

నిధులొచ్చేనా

(మొదటిపేజి తరువాయి)

2019 నుంచి 2023 వరకు ఏటా రూ.450 కోట్ల చొప్పున రావాలి

- పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం 2020-21లో రూ.171 కోట్లు
- 2019-20తో పోల్చితే 2020-21లో తెలంగాణకు రావాల్సిన పన్నుల వాటాలో రూ.723 కోట్లు తగ్గాయి. దీన్ని కేంద్రమే భర్తీ చేయాలంటూ పదిహేనో ఆర్థిక సంఘం సూచించింది.
- రాష్ట్రంలోని వివిధ రంగాలకు పదిహేనో ఆర్థిక సంఘం కేటాయించిన మొత్తం రూ.3,204 కోట్లు
- మిషన్ భగీరథ నిర్వహణ కోసం రూ.2,350 కోట్లు ఇవ్వాలంటూ పదిహేనో ఆర్థిక సంఘం సూచించింది
- మిషన్ భగీరథ కోసం రూ.19,205 కోట్లు ఇవ్వాలంటూ నిటి అయోగ్ సిఫారసు
- నిటి అయోగ్ సిఫారసుల ప్రకారమే చెరువుల పునరుద్ధరణకు కేంద్రం రూ.5 వేల కోట్లివ్వాలి
- 2014-15 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి రావాల్సిన సీఎస్ఎస్ బకాయిలు రూ.495.20 కోట్లు (వీటిని ఏపీకి బదలాయించారు, ఇప్పటి వరకూ రాలేదు)
- 2021-22కి సంబంధించి రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.1,013 కోట్లు ఇవ్వాలంటూ పదిహేనో ఆర్థిక సంఘం కేంద్రానికి ప్రత్యేకంగా సూచించింది (ఇందులో గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.682 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.331 కోట్లు రావాల్సి ఉంది)



ముహూర్తం నేటి సాయంత్రం నాలుగు గంటలు

కాగా హస్తిన పర్యటన కోసం సీఎం రేవంత్ మంగళవారం హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లనున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కూడా వెళుతున్నారు. ఇందుకోసం ఆయన తన ఖమ్మం జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు మోడీతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా సీఎం... ప్రధానిని కలవనుండటంతో ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. రాష్ట్ర విభజన అంశాలతోపాటు పెండింగ్ ప్రాజెక్టులు, వాటి అనుమతులు, తెలంగాణకు రావాల్సిన బకాయిలపై ప్రధానితో రేవంత్ ప్రధానంగా చర్చించనున్నట్టు సమాచారం. ఈ భేటీ అనంతరం ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం సమావేశం కానున్నారు. అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం ప్రారంభించిన నూతన కార్యక్రమాలను ఆయన పార్టీ పెద్దలకు వివరించనున్నారు. నామినెటెడ్ పోస్టుల భర్తీ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన వారితో చర్చించనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

రేవంత్‌కు జ్వరం..

సీఎంను కలిసిన కేఏ పాల్, చిరంజీవి

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్వరంతో బాధపడుతున్నట్టు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో సోమవారం ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో సీఎం బాధపడుతున్నట్టు సమాచారం. ఆయన్ను పరీక్షించిన ఫ్యామిలీ డాక్టర్ రేవంత్‌ను పరీక్షించి, మందులు సూచించారు. ఆదివారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ సీఎం కొంత నీరసంగా కనిపించారు. ఒక రోజు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు ఆయన సూచించారు. దీంతో సోమవారం పూర్తిగా ఇంటికే పరిమితమైన ముఖ్యమంత్రి మంగళవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. క్రైస్తవ మతబోధకుడు కేఏ పాల్, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి... రేవంత్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.



సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముస్తాబైన హైదరాబాద్‌లోని మగ్దూం భవన్...

సింగరేణి ప్రయివేటుపరం కానివ్వం

- కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..
- మహిళా కార్మికులకు ఉపరితలంపైనే పని
- ఇంటి స్థలం, వడ్డీ లేని రుణం ఇస్తాం
- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ- మణుగూరు

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని, 200 గజాల ఇంటి స్థలం, రూ.20లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇల్లందు, టేకులపల్లి, కొత్తగూడెం, మణుగూరు సింగరేణి ఏరియాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మణుగూరు పీకే ఓసీ వద్ద మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ.. సింగరేణి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ నంబర్ గుర్తు గడియారంపై ఓటు వేసి ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మళ్లీ కార్మికులను మోసం చేసేందుకు కొత్త హామీలు ఇస్తున్నారన్నారు. సింగరేణిలో పది సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించకుండా నిరంకుశంగా పాలించారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. టీబీజీకేఎస్ హామీలు నమ్మొద్దన్నారు.వడ్డించే వాడు మనవాడైతే అన్ని సౌకర్యాలు సమకూర్తాయన్నారు. కారుణ్య నియమాకాల్లో జరిగిన అవినీతిని బయటపెడతామన్నారు. ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే.. ఖర్చు లేకుండా కారుణ్య నియామకాలు ఇస్తామన్నారు. సింగరేణి అన్ని ఏరియాలలో సూపర్ స్పెషాలిటీ



ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. ప్రయివేటు ప్రస్తావన లేకుండా ప్రభుత్వ రంగంలోనే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్త గనులను ప్రారంభిస్తామన్నారు. తిరిగి రెండు లక్షల ఉద్యోగాలు తీసుకొస్తామన్నారు. సింగరేణికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని చెప్పారు. సింగరేణి దినోత్సవం రోజున సెలవుగా ప్రకటిస్తామని, మహిళా కార్మికులు గని లోపల కాకుండా ఉపరితలంలో పని చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఇతర సంఘాలకు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, నాయకులు డాక్టర్ శంకర్ నాయక్, ఏరియా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ పాల్గొన్నారు.

కొత్త సంవత్సర వేడుకలకు అనుమతులు తప్పనిసరి

- బుక్ మై షోపై మాదాపూర్ పీఎస్‌లో కేసు : అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి



నవతెలంగాణ-మియాపూర్

కొత్త సంవత్సరం వేడుకలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి ఉండాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'సన్ బర్గ్' అనే సంస్థ ఎలాంటి అనుమతులూ లేకుండా బుక్ మై షో ద్వారా కొత్త సంవత్సరం కార్యక్రమానికి టికెట్లను విక్రయిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. సదరు సంస్థపై కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీస్ అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టొద్దని వివిధ సంస్థలకు, నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, మాదాపూర్ సీఐ తిరుపతి తదితరులు ఉన్నారు.



హైదరాబాద్ అబిడ్స్‌లోని సెంటినరీ మెథడిస్ట్ చర్చిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంటుపై గులాబీ గురి..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వారికి సూచించారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. శాసనసభ ఎన్నికల్లో ఒక్కో పార్లమెంటు స్థానం పరిధిలో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్ల వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. గత ఎంపీ ఎన్నికల్లో ఆయా స్థానాల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని పరిశీలించారు. అప్పటికీ, ఇప్పటికీ ఉన్న వ్యత్యాసంపై లెక్కలు తీశారు. ఎంపీలతో కలిసి వాటిపై సమీక్షలు నిర్వహించారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాలను గెలుచుకుంది. అంతకుముందు (2018) నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి విదితమే. అయితే ఎంపీ ఎలక్షన్లకు వచ్చేసరికి మొత్తం 17 స్థానాల్లో బీజేపీ నాలుగు (సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్), కాంగ్రెస్ (నల్లగొండ, భువనగిరి, మల్కాజ్‌గిరి) మూడింటిని గెలుచుకున్నాయి. కారు పార్టీకి 9 స్థానాలే దక్కాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ మినహా మిగతా అన్ని స్థానాల్లోనూ గెలిచేందుకు సర్వశక్తులూ ఒడ్డాలని గులాబీ పార్టీ భావిస్తోంది. శాసనసభ ఎన్నికల అనుభవం దృష్ట్యా ప్రస్తుతమున్న కొంతమంది సిట్టింగ్ ఎంపీలను మార్చి కొత్తవారికి అవకాశమివ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

మెదక్ నుంచి ఆయనే బరిలోకి దిగనున్నారు. నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి పోటీ చేయనున్నారు. కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌కే మరో ఛాన్స్ దక్కనుందని తెలిసింది. ఇక మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, మహబూబాబాద్, జహీరాబాద్, చేవెళ్ల, ఖమ్మం, వరంగల్ స్థానాల్లో బీఆర్ఎస్‌కు సిట్టింగ్ ఎంపీలున్నారు.

వీటిలో దాదాపు పాత వారికే టిక్కెట్లు కేటాయించాలని కేసీఆర్ భావిస్తున్నారు. కానీ ఎమ్మెల్యేగా ఓడిపోయిన మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ మహబూబ్‌నగర్ టిక్కెట్టు కోసం, పెద్దపల్లి టిక్కెట్టు కోస మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు వినికిడి.

భువనగిరి నుంచి గతంలో బూర నర్సయ్య గౌడ్ బీఆర్ఎస్ తరపున ఎంపీగా ఎన్నికయ్యారు. పలు సామాజిక సమీకరణాలే ఇందుకు కారణం. ఆ రీత్యా ఇప్పుడు ఆ టిక్కెట్టును దక్కించుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

ఆ రెండింటిలో బలమైన అభ్యర్థులు...

గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి, సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు ఈ రెండు స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా నియోజకవర్గాల్లో 'అన్ని రకాలుగా' బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని కేసీఆర్ భావిస్తున్నారు.

చేవెళ్లలో మరోసారి గులాబీ జెండా ఎగరాలి

కేటీఆర్ దిశా నిర్దేశం

చేవెళ్ల పార్లమెంటు స్థానంలో మరోసారి గులాబీ జెండా ఎగరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు.

సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ పూర్తి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారు.

భేటీలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాకు లైన్ క్లియర్ : ఎంపీ రంజిత్‌రెడ్డి



సమావేశానంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తనను మరోసారి చేవెళ్ల నుంచి పోటీ చేయాలంటూ కేటీఆర్ సూచించారని అన్నారు. గెలుపే లక్ష్యంగా పని చేయలంటూ ఆయన ఆదేశించారని తెలిపారు.

బీఆర్ఎస్ ఖాళీ అవుతుందంటూ కాంగ్రెస్, బీజేపీ అసత్య ప్రచారాలు చేస్తున్నాయంటూ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిన స్థానాలపై దృష్టి సారించటం ద్వారా ఎంపీ సీట్లలో గెలుపుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు.

మనుస్మృతి నిండా ద్వేషమే..

- రాజ్యాంగ రక్షణకోసం ఉద్యమాలు
- మనుస్మృతి ప్రతుల దహన కార్యక్రమంలో స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మనుస్మృతి నిండా ద్వేషభావమే నిండి ఉందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు తెలిపారు. మనుషుల మధ్య ద్వేషాన్ని నింపి, వైషమ్యాలు సృష్టంచటమే దాని పనని ఆయన విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్ తో పనిచేస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ రాజ్యాంగం రద్దుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. సామాజిక అసమానతలకు, వివక్షతలకు మను 'అధర్మ' శాస్త్రమే మూలమని తెలిపారు. దీన్ని నిషేధించాల్సిన అవసరముందన్నారు. నూటికి 90శాతం మందికి అది చదువును, సంపదలను దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనువాదానికి పాతరేస్తేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుం దని తెలిపారు. బ్రాహ్మణాధిపత్యాన్ని కాపాడటానికి, దోపిడివ్యవస్థ రక్షణ కోసం పుట్టిందే మనువాదమని చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ , కేవీపీఎస్ నాయకులు ఎన్ బాలపీరు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర వ్యాప్తంగా

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మనుధర్మ శాస్త్ర పత్రులను దహనం చేశారు. ఓయూ ఏఎస్ఏ ఆధ్వర్యంలో, అలాగే బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట వేర్వేరుగా మనుస్మృతి ప్రతులను కాల్చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో మనుస్మృతి ప్రతులను తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో దహనం చేశారు.కరీంనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతులను కేవీపీఎస్, బహుజన సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ, దళిత లిబరేషన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దహనం చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు.ఖమ్మం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాలమహానాడు ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని చర్మకారుల అడ్డా వద్ద, పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్ర ప్రతులను కాల్చేశారు

కాంగ్రెస్ డీఎన్ఏలో హిందూ వ్యతిరేక ధోరణి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేక ధోరణి ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇండియా కూటమిలోని డీఎంకే నేతలు హిందువులను కించపరిచేలా, సనాతన ధర్మాన్ని అవమానించేలా, హిందీ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలని మాట్లాడుతున్నా రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. తెలంగాణలో హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మరికొంత సమయమిస్తామనీ, అప్పటికీ చేయకపోతే పోరాటం చేస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. కొందరు నాయకులు విద్వేషపూరిత, దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస కార్మికులను అవమానిస్తున్నా పట్టదా? అని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. దేశాన్ని ఐక్యం చేయడానికి కాదు..తన సొంత ప్రచారం కోసమే ఆయన జోడో యాత్ర చేస్తున్నారని విమర్శించారు. వలస కార్మికులంటే ప్రగతిలో భాగస్వాములని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అన్నారనీ, కార్మికుల పట్ల తమ పార్టీకి అపారమైన గౌరవం ఉందని చెప్పారు.

మనం ఎలా ఉండాలో ఏకాంతం నేర్పుతుంది.
ఎలా వున్నామో సమాజం చెపుతుంది - సెసిల్


సంపాదకీయం

ప్రజాస్వామ్యమా..పారాహుషార్

"ప్రజల బాగుకోసం ప్రభుత్వమూ విపక్షం కలిసి నడుస్తూ చట్టసభల గౌరవప్రతిష్ఠలను కాపాడుకోవాలి. లేకపోతే అవి కుప్పకూలిపోతాయి"అని తొలి ప్రధాని నెహ్రూ హెచ్చరించారు. కానీ, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో జరుగుతున్నదేమిటి? విపక్షాలను కలుపుకుని పోవాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. పార్లమెంటు చరిత్రలోనే ఒకే సెషన్‌లో146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి.. మోడీ సర్కార్ 'మహాభారతం'లో ఒక చీకటి పర్వాన్ని లిఖించింది. నూతన పార్లమెంటు భవనం గాండ్రించే సింహతలాటం, రాజదండాలతో నిరంకుశ రాచరికానికి ప్రతిబింబమన్న విమర్శలను నిజం చేస్తూ నిరంకుశ చర్యలతో ప్రజాస్వామ్య విలువలకు కాషాయ పార్టీ సమాధి కట్టేసింది. పార్లమెంట్ భద్రతపై హోంమంత్రి ప్రకటన కోరిన పాపానికి ప్రతిపక్షసభ్యుల్లో 70శాతం మందిని బయటకు నెట్టి అత్యంత కీలకమైన మూడు క్రిమినల్ బిల్లులను ఎలాంటి చర్చలేకుండానే ఉభయ సభల్లో మూజువాణి ఓటుతో ఆమోదింపజేసుకున్నారు. తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటుతో మొదలైన బీజేపీ అప్రజాస్వామిక ఎత్తుగడలు శీతాకాల సమావేశాల చివరి రోజు వరకు కొనసాగాయి.

ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోనే ప్రతిపక్షాల సభ్యులు నిరసన తెలియజేస్తే దానికి కూడా వక్రభాష్యాలు అల్లేసి, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు అన్యాయం జరిగిపోయిందహో అంటూ పార్లమెంటులో బీజేపీ నేతలు చేసిన చేష్టలు విరక్తి పుట్టించాయి. ప్రతిపక్షమంటే ప్రజల గొంతుక. ప్రజల సమస్యలను ప్రస్తావించేలా చట్ట సభల అధిపతులు ప్రతిపక్షాల హక్కులను కాపాడి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ పార్లమెంటు ఉభయసభల అధిపతులూ ఈ బాధ్యతను నిర్వహించకపోవడమే గాకుండా ప్రభుత్వానికి వంత పాడి సభాసాంప్రదాయాలను సైతం మంటగల్పారన్న విమర్శలకు శీతాకాల సమావేశాలే తార్కాణం.

బ్రిటిష్ చట్టాలు కాస్తా ఫాసిస్టు చట్టాలుగా రూపాంతరం చెందాయి. ఆంగ్ల పేర్లతో వున్న చట్టాలకు హిందీ పేర్లు పెట్టి కొత్తసీసాలో పాతసారా పోసి, మరింత కుళ్లబెట్టినట్టు బ్రిటీష్ హయాం నుంచి అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)ని భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)గా, నేర శిక్షాస్మృతి (సీఆర్పీసీ) భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎన్)గా, సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్) స్థానంలో భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లులను చట్టాలుగా మార్చుకునేందుకు 'లోక్‌సభ' మెడలువంచి మరి ఆమోదింపజేసుకుంది. ఇవన్నీ భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు.




పేర్లను రాజభాషలోకి మార్చినంతమాత్రాన రాళ్లు రాళ్లే అవుతాయి తప్ప రత్నాలు కావు కదా! ప్రతిపాదిత కొత్త చట్టాల్లో లొసుగులు అన్నీ ఇన్నీ కావని, ఇప్పటికే ఎందరో న్యాయనిపుణులు ఎండగడుతున్నారు. స్వతంత్ర, ప్రజాస్వామ్య దేశంలో అసలు అవసరమే లేదనుకుంటున్న 124 (ఏ) సెక్షన్ రాజద్రోహాన్ని తొలగించి, 121 సెక్షన్‌తో దేశద్రోహ చట్టంగా మార్చింది. హక్కుల కోసం రోడ్డెక్కితే నేరమట! అభాగ్యులను పోలీసురాజ్యం లాఠీలు, బాష్పవాయువులతో కబళిస్తే అది దేశరక్షణ. ఇది అరాచకమంటే అది దేశద్రోహం. భారతదేశ ప్రతిష్టను దిగజార్చేలా ఎవరు మాట్లాడినా సహించే పరిస్థితి ఉండదని చెపుతున్న హోంమంత్రి దేశ ప్రతిష్ఠకు, ప్రభుత్వ ప్రతిష్ఠకు మధ్య అంతరాన్ని చెప్పలేకపోయారు. దేశం, జెండా, భద్రత, ఆస్తులతో ఎవరు చెలగాటమాడినా జైలు కెళ్లాల్సిందేనని కూడా చెప్పుకొచ్చారు. అసలు గడిచిన తొమ్మిదిన్నరేండ్లుగా వాటికి వ్యతిరేకంగా మాట్లాడింది ఎవరు ?

అసలు ఈ చట్టాలలో 'ఉగ్రవాదం' అనే పదానికి ఇచ్చిన నిర్వచనం ఎవరికి చెందుతుంది? పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న వారినీ, గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన రైతులనూ, కనీసవేతనాల్లేక కాలే కడుపులతోనున్న అసంఘటిత కార్మికులనూ, ఉపాధి హామీకి దిక్కేలేని వ్యవసాయకూలీలనూ, దేశ జనాభాలో 18 శాతమున్న ముస్లిములు, ఇతర మైనారిటీలను, వీరందరి బాధలనూ తమ బాధలుగా మలచుకొని కలం పట్టి, గళం విప్పే పాత్రికేయులనూ ఉగ్రవాదులుగా పరిగణిస్తారా? గత దశాబ్దకాలంగా ఫాసిస్టు విధానాలతో మానవహక్కులను కాలరాస్తున్నదెవరు? లోక్‌సభలో గుండెలు బాదుకున్న అమిత్‌షా వాదనలో ఈ ప్రశ్నలకు సమాధానమే లేదు. ఎంతో ప్రమాదకరమైన ఈ బిల్లులను 'చరిత్రాత్మకం' అని భావించినప్పుడు సమగ్రమైన చర్చ లేకుండా, ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి మరీ చట్టాలుగా మార్చుకోవడం వెనుక పరమోద్దేశం ఏమిటో అర్థం చేసుకోలునంత అమాయకులు కాదు ఈ దేశ ప్రజలు.

ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోనే ప్రతిపక్షాల సభ్యులు నిరసన తెలియజేస్తే దానికి కూడా వక్రభాష్యాలు అల్లేసి, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు అన్యాయం జరిగిపోయిందహో అంటూ పార్లమెంటులో బీజేపీ నేతలు చేసిన చేష్టలు విరక్తి పుట్టించాయి. ప్రతిపక్షమంటే ప్రజల గొంతుక. ప్రజల సమస్యలను ప్రస్తావించేలా చట్ట సభల అధిపతులు ప్రతిపక్షాల హక్కులను కాపాడి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ పార్లమెంటు ఉభయసభల అధిపతులూ ఈ బాధ్యతను నిర్వహించకపోవడమే గాకుండా ప్రభుత్వానికి వంతపాడి సభాసాంప్రదాయాలను సైతం మంటగల్పారన్న విమర్శలకు శీతాకాల సమావేశాలే తార్కాణం. ఈ నిరంకుశ చర్యల పట్ల ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం.

మన్నించు



చెల్లెలా!
మన్నించు
బరిలో సివంగివైన నిన్ను
బయట లేడికూనని చేశారు!
పతకాలు తెచ్చినపుడు
దేశగౌరవం నిలిపిన
బేటీవంటూ అక్కున చేర్చుకున్నారు!
నీ ఆత్మగౌరవం కోసం గొంతెత్తినపుడు
నీవు బహువయ్యావు, బలి అవుతున్నావు!


అపుడెపుడో అగ్నిప్రవేశం ముందు
మూగబోయిన సీత గొంతూ
ఆనాడు నిండు సభలో
ఆక్రోశించిన ద్రౌపది గొంతూ
ఇపుడు మైకుల ముందు
పూడుకుపోయిన నీ గొంతూ
అన్నీ ఒక్కటే!

కాలాలు మారినా,
తరాలు మారినా,
మారనిది మగువల గొంతే,
బేటీల గొంతు నొక్కుతూనే ఉన్నారు.
నీ కంట కన్నీరు ఒలుకుతుంటే
మాడరన్ కీచకుడు కేరింతలు కొట్టే ఉంటాడు.
బేటీ బచావో అన్న పెద్ద మనిషి
మౌనంగానే ఆనంద భాష్పాలు రాల్చే ఉంటాడు.
కానీ మా గుండెలు బద్దలవుతున్నాయి.
అయినా మేము ఏమీ చేయము?
మహా అయితే ఫేస్‌బుక్‌లో ఒక కామెంట్,
కుదరకపోతే ఒక ఏమోజీతో సరిపెట్టుకుంటాం!

బూట్లు పక్కన పెట్టి అస్త్ర సన్యాసం చేస్తుంటే
మేమంతా బూట్లు ఏ కంపెనీవని చూస్తున్నాం!
ఏ శర్మో కోహ్లీనో బ్యాటు పక్కన పెట్టి ఉంటే ...
దేశం ఈ పాటికి అగ్నిగుండం కాకపోవునా?
నీవు మా చెల్లివే
కానీ నీ కోసం ఏమీ చెయ్యలేము.
అందుకే మన్నించు చెల్లెలా!
మన్నించు.

- వీరాంజనేయులు, 9490909780

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందపు డొల్లతనం



ప్రభాత్ పట్నాయక్

ఎటువంటి నియంత్రణలూ లేని విధంగా ఒక దేశపు వాణిజ్యం ఇతర దేశాలతో సాగుతోందనుకుందాం. ఆ విధానం వలన ఆ దేశం రెండు రకాల సమస్యలను ఎదుర్కోవచ్చు. మొదటిది : విదేశీ మారకం చెల్లింపులో లోటు. దిగుమతులద్వారా పొందగలుగుతున్న విదేశీ మారకం కన్నా ఎగుమతులకోసం చెల్లించవలసినదే ఎక్కువగా ఉండడం వలన ఈ సమస్య వస్తుంది. రెండవది: దిగుమతులతో దేశీయ ఉత్పత్తులు పోటీ పడలేని స్థితి రావడం వలన దేశీయ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం మేరకు జరగకుండా తగ్గిపోతుంది. దాని వలన దేశీయ వనరులు నిరుపయోగంగా ఉండిపోతాయి. ముఖ్యంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఈ రెండు సమస్యలూ ఒకే మాదిరివి కావు. నిరుద్యోగం కేవలం దిగుమతులు ఎక్కువైపోయినందువలన మాత్రమే ఏర్పడదు. దిగుమతులకన్నా ఎగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఏర్పడవచ్చు. ఉదాహరణకు : మన దేశం వలసపాలనలో ఉన్న కాలంలో విదేశీ ఉత్పత్తులు మన స్వదేశీ పరిశ్రమలను వృత్తులను దెబ్బ తీశాయి. దాని కారణంగా చేతివృత్తిదారులు, నైపుణ్యం కల పనివారు భారీస్థాయిలో తమ ఉపాధి కోల్పోయారు. ఐతే ఆ కాలంలో దిగుమతులకన్నా మన దేశం చేసిన ఎగుమతులే ఎక్కువ. (ఆ విధంగా ఏర్పడిన మిగులును బ్రిటిష్ పాలకులు స్వాహా చేశారు) ప్రస్తుతం నేను విదేశీ మారక ద్రవ్యం చెల్లింపుల్లో లోటు గురించి చర్చించబోవడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య గురించి, స్వేచ్ఛా వాణిజ్యంతో దానికి ఉన్న సంబంధం గురించి చర్చిస్తాను.

విదేశీ వాణిజ్యం మీద ఏ విధమైన నియంత్రణా గనుక లేకపోతే దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నది మూడవ ప్రపంచ దేశాలు వలసలుగా ఉండిన కాలంలో చవిచూసిన అనుభవం. ఐనా ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తం ఔతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన. ప్రతీ దేశమూ తాను ఏ సరుకును బాగా ఉత్పత్తి చేయగలదో దానిమీదే కేంద్రీకరిస్తే అప్పుడు ప్రపంచం మొత్తంగా చూసుకున్నప్పుడు ఎక్కువ సరుకులు ఉత్పత్తి అవుతాయి, ప్రతీ దేశమూ ఆ క్రమంలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతుంది. - ఇదే స్వేచ్ఛామార్కెట్ వాదన సారాంశం. ఇంతకు మించి వేరే ఇతర వాదనలు దానివద్ద ఏమీ లేవు.

ప్రపంచ స్థూల డిమాండ్ ను ప్రాథమికంగా నిర్ణయించేది ప్రపంచం మొత్తం మీద అగ్రస్థానంలో ఉన్న పెట్టుబడిదారీ దేశం. ప్రస్తుతం అది అమెరికా. అమెరికా ఇప్పుడు డిమాండ్ ను సృష్టించడం విషయంలో చాలా ఎక్కువ స్వయం నిర్ణయాధికార శక్తి కలిగివుంది. అలా పెంచిన డిమాండ్‌లో కొంత భాగాన్ని ఇతర దేశాల ఉత్పత్తులు కాజేయవచ్చుగాక. అయినా అమెరికాకి ఏమీ బెంగ లేదు. ఎందుకంటే విదేశీ వాణిజ్య లోటు పెరిగిపోతుందనే భయం దానికి లేదు. డాలర్ ను బంగారంతో సమానంగా ప్రపంచం పరిగణిస్తూ తమ తమ డాలర్ నిల్వలను ఆ యా దేశాలు పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నంతకాలమూ అమెరికా కావలసినన్ని డాలర్లను ముద్రించుకోవచ్చు. అందుచేత అమెరికాలోని వినిమయం + పెట్టుబడులు + ప్రభుత్వ వ్యయం కలిస్తే ప్రపంచ స్థూల డిమాండ్ ను నిర్ణయించే ప్రాథమికాంశంగా ఉంటుంది. అమెరికన్ ప్రభుత్వం చేసే వ్యయం మీద నియంత్రణ వేరే ఏమీ ఉండదు. కొళాయి ఇప్పినట్టు ఇప్పుకోవచ్చు. వర్తమాన పెట్టుబడిదారీ ప్రపంచంలో తక్కిన పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలపై సూపర్ ప్రభుత్వం మాదిరిగా ఒకమేరకు అమెరికా వ్యవహరించగలుగుతోంది. అంటే ఒక విధమైన ప్రపంచ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తోంది.

ఇది పూర్తిగా చెత్త. ప్రతీ దేశమూ పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పిస్తున్నది అని, అందుచేత ప్రపంచం మొత్తం మీద పూర్తి స్థాయిలో ఉపాధికల్పన జరిగిందని ఈ వాదన ఊహిస్తుంది. అటువంటప్పుడు అంతకు ముందు చేసే పనులకు బదులుగా స్వేచ్ఛా వాణిజ్యం వచ్చాక వాళ్ళను ఇతర పనులకు మరలించడమే జరుగుతుంది తప్ప నిరుద్యోగం తలెత్తే సమస్యే ఉత్పన్నం కాదు అన్నది దాని తాత్పర్యం.

ఈ వాదన ప్రాతిపదికకు వాస్తవంలో గాని, సిద్ధాంతరీత్యా గాని ఎటువంటి ఆధారమూ లేదు. 1930 దశకంలోనే మైకేల్ కాలెక్కీ, జాన్‌మేనార్డ్ కీన్స్ ఈ స్వేచ్ఛావాణిజ్య సిద్ధాంతపు డొల్లతనాన్ని సైద్ధాంతికంగా ఎండగట్టారు. నిజానికి అంతకు 75 సంవత్సరాలకు మునుపే మార్క్స్ అటువంటి స్థితి వస్తుందని అంచనాకు వచ్చాడు. స్వేచ్ఛావాణిజ్యం ఒక దేశానికి ఎటువంటి హాని కలిగిస్తుందో ముందే స్పష్టంగా తేలిపోయింది.

దీనిని తేలికగా వివరించడానికి ఒక ఉదాహరణను తీసుకుందాం. మొత్తం ప్రపంచం ఉత్పత్తి సామర్థ్యం 100 యూనిట్లు అనుకుందాం. ప్రపంచ మార్కెట్ మొత్తం డిమాండ్ 80 యూనిట్లు అనుకుంటే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 20 యూనిట్లు చెల్లకుండా మిగిలిపోతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో డిమాండ్‌ను బట్టే ఉత్పత్తి జరుగుతుంది గనుక 20 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం మేరకు పని జరగకుండా ఆగిపోతుంది. అలా మిగిలిపోయిన వనరులు ఆ యా దేశాలలో ఉండిపోతాయి.

ఇక్కడ ఒక ప్రశ్న రావచ్చు. నిరుద్యోగాన్ని పెంచే పెట్టుబడిదారీ విధానంతో విసుగెత్తిపోతే కార్మికులు సోషలిజంవైపు మొగ్గ చూపుతారు కనుక పెట్టుబడిదారీ ప్రభుత్వమే జోక్యం కల్పించుకుని మార్కెట్ లో జోక్యం కల్పించుకుని డిమాండ్ పెరిగేలా, తద్వారా కార్మికులందరికీ ఉపాధి లభించేలా చూడాలని కీన్స్ సూచించాడు. ఒక దేశంలో ఆ విధంగా చేయగలిగేటప్పుడు యావత్తు ప్రపంచస్థాయిలోనే అటువంటి ప్రయత్నం చేసి పూర్తి 100 యూనిట్ల ఉత్పత్తి మేరకు డిమాండ్ ను పెంచి తద్వారా పూర్తిస్థాయి ఉపాధికల్పన జరిగేట్టు చూడవచ్చుకదా ? అప్పుడు ఏ దేశంలోనూ ఉత్పత్తి వనరులు మిగిలిపోవు కదా ?

ఈ ప్రశ్నకు ఒకే ఒక, సూటి అయిన సమాధానం ఉంది. ఆ విధంగా జరగాలంటే ప్రపంచం మొత్తం ఒక రాజ్యంగా ఉండాలి. ప్రపంచం మొత్తం మీద ఒక ప్రభుత్వం ఉండాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా అటువంటిది జరగదు. అటువంటప్పుడు ఏ యే దేశాలలో ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి రాకుండా ఉండిపోతుందో, ఆ యా దేశాల ప్రభుత్వాలు తమ మార్కెట్ డిమాండ్‌ను పెంచడానికి, తద్వారా ఎక్కువగా ఉపాధి కల్పించడానికి పూనుకోవచ్చు. ఐతే స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నందువలన, మార్కెట్ లో పెరిగిన డిమాండ్ ను కేవలం దేశీయంగా ఉత్పత్తి అయే సరుకులే అందుకుంటాయని చెప్పలేం. విదేశీ సరుకుల దిగుమతులు పెరిగి ఆ డిమాండ్‌ను తామే అందుకోవచ్చు. దానివలన ఆ దేశానికి దిగుమతులు పెరిగి వాణిజ్య లోటు భారం పెరుగుతుందే తప్ప తన ఉత్పత్తి సామర్థ్యం పెరగడం మాత్రం జరగదు. ఆ దేశాలు గనుక స్వేచ్ఛా వాణిజ్యం పరిధిలోకి లేకుండా ఉండివుంటే విచ్చలవిడి దిగుమతులను నిరోధించి దేశీయ సరుకుల డిమాండ్‌ను, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చు. కాని, ఇప్పుడు స్వేచ్ఛావాణిజ్యం ఆ దేశాలను కట్టిపడేసింది.

ఇలా స్వేచ్ఛావాణిజ్యం కారణంగా ఆ యా దేశాలు తమ తమ మార్కెట్ డిమాండ్ ను, తద్వారా తమ దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేలా జోక్యం చేసుకోలేని అశక్తతలోకి పడిపోయాయంటే దానర్థం స్వేచ్ఛావాణిజ్యం వచ్చాక కలిగిన ఉపాధి అవకాశాలకన్నా, స్వేచ్ఛావాణిజ్యం లేకుండా వుండివుంటే రక్షణ చర్యలద్వారా ఎక్కువ ఉపాధిఅవకాశాలను కల్పించుకోగలిగి వుండేవి అన్నమాట.

స్వేచ్ఛావాణిజ్య సమర్థకులు ముందుకు తెచ్చిన వాదన ప్రకారం ప్రతీ దేశమూ తనకు ప్రత్యేక సామర్థ్యం కల సరుకులను ఉత్పత్తి చేయడం మీద కేంద్రీకరిస్తే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అప్పుడు అన్ని దేశాలకూ లాభం ఒనగూరుతుంది. కాని మన పరిశీలనలో స్వేచ్ఛావాణిజ్యం అమలులోకి వచ్చాక అంతకు మునుపటి ప్రపంచ డిమాండ్ కన్నా తక్కువ స్థాయికి డిమాండ్ పడిపోతుందని తేలింది.



అసలు స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నప్పుడు ప్రపంచ స్థూల డిమాండ్ అనేది దేనిమీద ఆధారపడివుంటుంది? ప్రపంచ స్థూల డిమాండ్‌ను ప్రాథమికంగా నిర్ణయించేది ప్రపంచం మొత్తం మీద అగ్రస్థానంలో ఉన్న పెట్టుబడిదారీ దేశం. ప్రస్తుతం అది అమెరికా. అమెరికా ఇప్పుడు డిమాండ్ ను సృష్టించడం విషయంలో చాలా ఎక్కువ స్వయంనిర్ణయాధికార శక్తి కలిగివుంది. అలా పెంచిన డిమాండ్‌లో కొంత భాగాన్ని ఇతర దేశాల ఉత్పత్తులు కాజేయవచ్చుగాక. అయినా అమెరికాకి ఏమీ బెంగలేదు. ఎందుకంటే విదేశీ వాణిజ్యలోటు పెరిగిపోతుందనే భయం దానికి లేదు. డాలర్‌ను బంగారంతో సమానంగా ప్రపంచం పరిగణిస్తూ తమ తమ డాలర్ నిల్వలను ఆ యా దేశాలు పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నంతకాలమూ అమెరికా కావలసినన్ని డాలర్లను ముద్రించుకోవచ్చు.

అందుచేత అమెరికాలోని వినిమయం + పెట్టుబడులు + ప్రభుత్వ వ్యయం కలిస్తే ప్రపంచ స్థూల డిమాండ్ ను నిర్ణయించే ప్రాథమికాంశంగా ఉంటుంది. అమెరికన్ ప్రభుత్వం చేసే వ్యయం మీద నియంత్రణ వేరే ఏమీ ఉండదు. కొళాయి ఇప్పినట్టు ఇప్పుకోవచ్చు. వర్తమాన పెట్టుబడిదారీ ప్రపంచంలో తక్కిన పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలపై సూపర్ ప్రభుత్వం మాదిరిగా ఒకమేరకు అమెరికా వ్యవహరించగలుగుతోంది. అంటే ఒక విధమైన ప్రపంచ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తోంది.

ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తం ఔతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన. ప్రతీ దేశమూ తాను ఏ సరుకును బాగా ఉత్పత్తి చేయగలదో దానిమీదే కేంద్రీకరిస్తే అప్పుడు ప్రపంచం మొత్తంగా చూసుకున్నప్పుడు ఎక్కువ సరుకులు ఉత్పత్తి అవుతాయి, ప్రతీ దేశమూ ఆ క్రమంలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతుంది. - ఇదే స్వేచ్ఛామార్కెట్ వాదన సారాంశం. ఇంతకు మించి వేరే ఇతర వాదనలు దానివద్ద ఏమీ లేవు.

ఐతే, ఈ విషయంలో ఇప్పుడు ఒక వైరుధ్యం తన ప్రభావాన్ని చూపడం మొదలుపెడుతోంది. ఎంతగా తక్కిన దేశాలమీద పెత్తనం చెలాయించగలుగుతున్నా, మౌలికంగా అమెరికా కూడా ఒక జాతిరాజ్యంగానే ఉంది. అందుచేత అమెరికన్ ప్రభుత్వం దేశీయ డిమాండ్‌ను పెంచుకుంటూ పోతే, ఆ డిమాండ్ లో కొంత భాగం విదేశీ దిగుమతుల ద్వారా భర్తీ అవుతుంది. అప్పుడు అమెరికా వాణిజ్యలోటు పెరుగుతుంది. ఆలోటును అమెరికన్ ప్రభుత్వం భర్తీ చేయవచ్చు. కాని ఆ క్రమంలో అమెరికా ప్రభుత్వం అప్పుల పాలవుతుంది. ఐనా ఆ దేశానికేమీ ధోకా లేకపోవచ్చు. కాని అప్పులపాలౌతూ తన ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతూవుంటే దాని ఫలితంగా కలిగే ఉపాధిలో కొంత భాగం విదేశాలకు చెందుతోంది. ఇలా ఇతరదేశాలలో ఉపాధి కల్పన కోసం మనం ఎందుకు అప్పులపాలవ్వాలి? అన్న ప్రశ్న అమెరికాలో ఒక జాతీయ దృక్పథం నుంచి చూసినప్పుడు తలెత్తుతోంది. ఒక జాతి రాజ్యంగా తనకున్న బాధ్యతకు, అంతర్జాతీయంగా సూపర్ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నదానికి మధ్య వైరుధ్యం తలెత్తుతోంది.

ఈ వైరుధ్యం ఇటీవల కొంత తీవ్ర రూపం ధరిస్తోంది. కరోనా కాలంలో తక్కిన సంపన్న దేశాల మాదిరిగానే అమెరికా కూడా తమ ప్రజానీకానికి సహాయం అందించడం కోసం భారీగా ద్రవ్య లోటు పెంచి వ్యయం చేసింది. కరానా నెమ్మదించిన తర్వాత కాలంలో కూడా దేశీయ స్థూల డిమాండ్‌ను పెంచడం కోసం ఆ భారీ ద్రవ్యలోటును కొనసాగించాలని చూసింది. కాని ఈ మధ్య తీవ్రంగా ద్రవ్యోల్బణం తలెత్తడంతో కొంత వెనక్కు తగ్గింది. ఐతే, ఈ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టగానే మళ్ళీ ద్రవ్యలోటును పెంచ డానికి పూనుకుంటుంది. ఐతే, ఈ మారు తమ దేశీయ డిమాండ్ పెరగడం ఇతర దేశాలలో ఉపాధిఅవకాశాల పెరుగుదలకు కాకుండా తమ దేశంలోనే పెరిగేవిధంగా కొన్ని రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే ఈ రక్షణ విషయంలో చైనా పట్ల కొన్ని చర్యలు తీసుకుంది. ఇప్పుడు తక్కిన మూడవ ప్రపంచదేశాల విషయంలో కూడా అదేమాదిరిగా వ్యవహరించనుంది.

ఈ ధోరణిని కొందరు ప్రపంచీకరణ-వ్యతిరేక క్రమం అంటూ అభివర్ణిస్తున్నారు. కాని అది సరైనది కాదు. సరుకుల దిగుమతి విషయంలో రక్షణ చర్యలకు అమెరికా పూనుకుంటోందే తప్ప ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా సంచరించే విషయంలో ఏ ఆంక్షలనూ విధించడం లేదు. పైగా మరేదైనా దేశం గనుక ద్రవ్య పెట్టుబడి కదలికలపై ఆంక్షలకు పూనుకుంటే అమెరికా ఆ దేశాన్ని శిక్షిస్తోంది. ఈ మాదిరి వైరుధ్యాలను అమెరికా పెద్దగా పట్టించుకోదు. తక్కిన అన్ని దేశాలకూ స్వేచ్ఛావాణిజ్యం గురించి గొప్పగా చెప్పుందే తప్ప తనవద్దకు వచ్చేసరికి మాత్రం అది రక్షణ విధానాన్నే పాటిస్తోంది కదా.

(స్వేచ్ఛానుసరణ)

కేరళ 'సంఘీ గవర్నర్' వికృతాలపై విద్యార్థుల పోరు

దేశంలో ఆరెస్సెస్ ఎజెండాను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోంది. ఇప్పటికే బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాలలో విద్యారంగంలో చొరబడి పాఠ్యాంశాలను పూర్తిగా కాషాయమయంగా మార్చింది. రాష్ట్రాల్లోనే కాదు దేశంలోను సిబిఎస్ఈ సిలబస్ రుపొందించే ఎన్సీఈఆర్టీని ఉపయోగించుకుని చరిత్ర, సైన్స్‌ను మార్పు చేస్తోంది. జాతీయోద్యమ వీరుల చరిత్రల స్థానాలలో ఆరెస్సెస్ సిద్ధాంతకర్తల జీవిత చరిత్రలను ప్రవేశపెడుతోంది. యూనివర్శిటీ పాఠ్యాంశాలలో పురాణాలను చేర్చడం, నూతన విద్యావిధానం పేరుతో ఏకంగా దేశ విద్యారంగాన్నే మార్చే కుట్రలను చేస్తోంది. అందులో భాగమే అశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించడం, పాఠ్యంశాల వక్రీకరణ. కేవలం పాఠ్యంశాలు మార్చడమే కాకుండా, ఆరెస్సెస్ కార్యకర్తలను విద్యారంగంలో ప్రధానంగా యూనివర్శిటీలలో నియమిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. యూజీసీ చైర్మన్ మొదలు, జెఎన్‌యూ, హెచ్‌సీయూ, పాండిచ్చేరి వంటి కేంద్ర యూనివర్సిటీల వీసీలుగా,విద్యారంగంలో కీలకమైన పదవుల్లో వారి ఏజెంట్లను చేర్చి విద్యను కాషాయికరిస్తోంది.



టి.నాగరాజు
9490098292

ఈ ఫార్ములాను ఉపయోగించే ఆరెస్సెస్, దాని భావజాలాన్ని ఎదిరించి నిలబడిన, నిలుస్తున్న కేరళపై ప్రయోగించాలనుకుంటోంది. ఇప్పటికే అక్కడి వామపక్ష ఎల్‌డీఎఫ్‌పై అనేక కుతంత్రాలు చేసి విఫలమైంది. నిజాయితీ, నిస్వార్థానికి మారుపేరైన ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అవినీతి కేసులో ఇరికించాలని చూసి, నిరూపించలేక బదానం అయింది. అక్కడి శబరిమలై గుడి విషయంలో వివాదాస్పద రాజకీయాలకు తెరలేపింది. అయితే వీటన్నింటి దేశంలోనే అత్యధిక అక్షరాస్యత కలిగిన ప్రజలు తిప్పికొట్టారు. ఎప్పటినుంచో అక్కడ తిష్ట వేయాలని చూస్తున్న బీజేపీకి ఎలాంటి సాకు దొరకడం లేదు. దీనికి వారు కనుసన్నల్లో పనిచేసే గవర్నర్‌ను ఉపయోగించుకొని కేరళ రాష్ట్ర యూనివర్సిటీలో ఆరెస్సెస్ ఏజెంట్లను నియమించాలని ప్రయత్నం చేస్తోంది. సాధరణంగా రాష్ట్రాల్లో గవర్నర్ ఎక్స్-అఫిషియో ఛాన్సలర్‌గా ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయాల పని తీరులో వారు జోక్యం చేసుకోరు. కానీ కేరళలో బీజేపీ నియమించిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ చర్యలతో అది పూర్తిగా మారిపోయింది. ఇప్పటికే బీజేపీ - ఆరెస్సెస్ చర్యలు భారతదేశంలో ఉన్నత విద్యలో లౌకిక ,వైజ్ఞానిక లక్షణాన్ని నాశనం చేశాయి. వేలాది మంది ఆరెస్సెస్, బీజేపీ, ఏబీవీపీ సభ్యలను కళాశాలలు, యూనివర్సిటీలలో అధ్యాపకులుగా, ప్రొఫెసర్స్‌గా, ఇతర సిబ్బందిని నియమించడం ద్వారా మత భావజాలాన్ని పెంపొందించే ప్రయత్నాల్ని ముమ్మరం చేస్తోంది.

అయితే యూనివర్శిటీల అడ్మినిస్ట్రేషన్‌లో ఆరెస్సెస్ వ్యక్తులను నింపి వారి భావాలను విస్తృత పర్చడానికి చేసిన ప్రయత్నాలను కేరళలో బెడిసికొట్టింది. కేరళలో అన్ని క్యాంపస్‌సలో ఏబీవీపీ ఆధిపత్యం సాధించలేకపోతోంది. మొదటి నుండి కేరళలో క్యాంపస్‌లో విద్యార్థుల తరుపున పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ వెనకాలే విద్యార్థులు ఉన్నారు. గత ఆగస్టు నుండి కేరళలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర, సెంట్రల్ యూనివర్శిటీలలో మతోన్మాద ఏబీవీపీని ఎస్ఎఫ్ఐ మట్టికరిపిస్తూ వస్తోంది. దీనిని నియంత్రించాలనే కుట్ర కూడా ఆరెస్సెస్ చేస్తోంది. ఆరెస్సెస్ ఎజెండాను కేరళలో తమ ప్రజలు విశ్వవి ద్యాలయాలలో, వారి ప్రజాస్వామిక పద్ధతులను అనుసరి స్తున్నంత వరకు రాష్ట్ర పరిపాలన సంస్థలను ఆరెస్సెస్ కైవసం చేసుకోవడం, బోధన స్థానాలను మత ఛాందసవాదులతో నింప డం సాధ్యం కాదు. అందుకే ఆరెస్సెస్ గవర్నర్‌తో కేరళ రాష్ట్ర యూనివర్శిటీలలో పాలక మండళ్లలో వారిని నియమించాలనే విశ్వ ప్రయత్నం జరుగుతోంది.

యూనివర్శిటీల్లో సంఘీయులను నింపే కుట్ర!

కేరళ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ కేరళ కాలికట్ యూనివర్శిటీల పాలక మండళ్లలో సంఘీయులను నింపాలని కుట్రలో సెనేట్‌లో సభ్యులుగా నియమించారు. పైగా ప్రశ్నించిన ప్రభుత్వం యూనివర్శిటీలలో గవర్నర్ జోక్యం ఏమిటని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐపై తన అక్కసును వెళ్లగక్కి క్రిమినల్స్ అంటూ దూషించారు. తను చేసిన నియామకాల గురించి అడిగే హక్కు ఎవరికి లేదని అతని నిరంకుశత్వాన్ని,ప్రజాస్వామ్యం పట్ల ధిక్కరాన్ని వెల్లడించారు. కేరళలోని కాలికట్, కేరళ యూనివర్శిటీల సెనేట్ సభ్యులను నియమించడమే కాదు, గతంలో కేరళ ప్రభుత్వం యూనివర్శిటీలకు వైస్-ఛాన్సలర్స్ నియమించే సందర్భంగా కూడా ప్రభుత్వం పంపిన సిఫార్సులను ఆమోదించకుండా ఆరెస్సెస్ వ్యక్తులను నియమించే ప్రయత్నం చేశారు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలతో పాలన చేస్తున్న కేరళ దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేసింది. తమ రాష్ట్ర యూనివర్శిటీలను ఆరెస్సెస్ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని, గవర్నర్ విశ్వవిద్యాలయాలలో రాజకీయ జోక్యం చేసుకునేందుకు వీలు లేకుండా, తమ ప్రజలెన్నుకున్న ప్రభుత్వం,ప్రజల అభీష్టం గౌరవించాలని కేరళలో రాష్ట్ర యూనివర్శిటీల ఛాన్సలర్‌గా గవర్నర్ తొలగించాలని 2022 డిసెంబర్‌లో కేరళ అసెంబ్లీ ఒక చట్టాన్ని ఆమోదించింది. బిల్లుపై సంతకం పెట్టకుండా ఏడాది పాటు గవర్నర్ నిరాకరించారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యంతో 2023 లో రాష్ట్రపతికి పంపారు. నిరంతరం యూనివర్శిటీ లలో రాజకీయ జోక్యం చేసుకోవడం, ఇప్పుడు కేరళ, కాలికాట్ యూనివర్శిటీ సెనేట్ సభ్యులను తనకు ఇష్టం వచ్చిన వారిని నియమించడం వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపస్‌లలో 'సంఘీ ఛాన్సలర్ గోబ్యాక్', 'మిస్టర్ ఛాన్సలర్, ఇది కేరళ' అనే బ్యానర్లను అన్ని క్యాంపస్‌ల ముందు ప్రదర్శిస్తున్నారు. గవర్నర్ కాలికాట్ యూనివర్శిటీ పర్యటన సందర్భంగా యూనివర్శిటీ ముందు ఎస్ఎఫ్ఐ కట్టిన బ్యానర్లను తొలగించాలని గవర్నర్ చిందులు వేస్తూ అధికారులను ఆదేశించి, విద్యార్థులను క్రిమినల్స్‌గా అభివర్ణించారు. ఒక్క పక్క గవర్నర్ అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆరెస్సెస్ గవర్నర్‌కు అనుకూలంగా క్యాంపస్‌లలో బ్యానర్లు కట్టారు. ఇలాంటి చర్యలతో గవర్నర్ కేరళ క్యాంపస్‌లలో ఆరెస్సెస్ శ్రేణులను నింపాలనే కుట్రలు వ్యతిరేకంగా తమకంటే అర్హత తక్కువ ఉన్నవారిని నియమించారని కొంతమంది కేరళ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నియమకాలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది.విద్యార్థులు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా 'సంఘీ గోబ్యాక్' అంటూ రాష్ట్రమంతటా ఆందోళనలు కొనసాగుతున్నాయి.



కేరళ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ కేరళ కాలికట్ యూనివర్శిటీల పాలక మండళ్లలో సంఘీయులను నింపాలని కుట్రలో సెనేట్‌లో సభ్యులుగా నియమించారు. పైగా ప్రశ్నించిన ప్రభుత్వం యూనివర్శిటీలలో గవర్నర్ జోక్యం ఏమిటని ప్రశ్నించిన ఎస్ఎఫ్ ఐ పై తన అక్కసును వెళ్లగక్కి క్రిమినల్స్ అంటూ దూషించారు. తను చేసిన నియామకాల గురించి అడిగే హక్కు ఎవరికి లేదని అతని నిరంకుశత్వాన్ని,ప్రజాస్వామ్యం పట్ల ధిక్కరాన్ని వెల్లడించారు. కేరళలోని కాలికట్, కేరళ యూనివర్శిటీల సెనేట్ సభ్యులను నియమించడమే కాదు, గతంలో కేరళ ప్రభుత్వం యూనివర్శిటీలకు వైస్-ఛాన్సలర్స్ నియమించే సందర్భంగా కూడా ప్రభుత్వం పంపిన సిఫార్సులను ఆమోదించకుండా ఆరెస్సెస్ వ్యక్తులను నియమించే ప్రయత్నం చేశారు.

విద్యార్థుల పోరాటం- ప్రజాస్వామ్యానికి స్ఫూర్తిదాయకం

విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించడం, మతోన్మాద ప్రయత్నాలు ప్రతిఘటించడం,కేరళలో ఉన్నత విద్య, లౌకిక,శాస్త్రీయ విద్యను పరిరక్షించుకోవడం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం. పైగా దేశంలో నేడు బీజేపీ రాష్ట్రాల సమైక్య హక్కులపై చేస్తున్న దాడి, వారి ఫాసిస్టు హిందూత్వ ఎజెండాకు వ్యతిరేకంగా రాష్ట్రాలను అస్థిరపరిచే గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు వారి ప్రయత్నా లకు బలమైన ప్రతిఘటనగా భావించాలి. తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ ఇతర రాష్ట్రాల్లో గవర్నర్ల ప్రవర్తన ప్రజాస్వామ్యానికి, కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు పూర్తి విరుద్ధమైవిగా చర్యలున్నాయి. ఈ రాష్ట్రాల్లో పనిచేసే గవర్నర్లంతా బీజేపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారే విమర్శలు వస్తున్నాయి. కేరళ, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలలో నేడు నెలల తరబడి అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించడం లేదు. కేరళలో జరుగుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ, మతోన్మాద చర్యలకు వ్యతిరేక పోరాటంలో అక్కడి ప్రతిపక్ష కాంగ్రెస్‌లోని యూడీఎఫ్ పాత్ర కూడా అవమానకరంగా ఉంది. అక్కడ నుండి ఎన్నికైన 18 మంది ఎంపీలు మౌనంగానే ఉన్నా రు. బీజేపీ, కాంగ్రెస్ సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వంపై నిరస నలు కూడా జరుపుతున్నారు. గవర్నర్ నిర్ణయాలు, రాజకీయ జోక్యానికి వ్యతిరేకంగా విద్యార్థులు వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, బీజేపీ నియంతృత్వంపై చేస్తున్న ఈ పోరాటానికి దేశంలోని విద్యావంతులు, మేధావులు, లౌకిక, ప్రజాతంత్ర వాదులు మద్దతు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

కొత్త క్రిమినల్ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ (ఈఏ)ల స్థానంలో పార్లమెంటులో కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య సంహిత-2023 బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ బిల్లులు చట్టరూపం దాల్చాయి. బ్రిటిష్ కాలంనాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన మూడు బిల్లులు ఇటీవల జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో మూజువాణి ఓటుతో ఉభయసభలు ఆమోదం పొందిన విషయం తెలిసిందే.

మధ్యప్రదేశ్‌లో విద్యాశాఖ ఆదేశాలపై విమర్శల వెల్లువ





భోపాల్ : మధ్యప్రదేశ్‌లో విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలపై విమర్శలు వెల్లువెత్తాయి. క్రిస్మస్ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని అన్ని పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉజ్జయిని, గ్వాలియర్ జిల్లాలు కూడా ఇదే తరహా నోటీసులిచ్చాయి. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ డిసెంబర్ 13న ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు ఈ ఆదేశాలు వెలువడటం గమనార్హం.

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు శాంతాక్లాజ్ లేదా మరే ఇతర పాత్రల దుస్తులు ధరించాలని కోరుకుంటే తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకోవాలని ఈ నెల 14న షాజపూర్ జిల్లా విద్యాశాఖ (డీఈఓ) వివేక్ దూబే ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు లేదా ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు అందితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిస్మస్ వేడుకలకు ముందు విద్యాసంస్థలు తమ అనుమతి తీసుకోలేదని గతంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఆరోపించారు. దీంతో ఇతర మతాల విద్యార్థులు ఈవెంట్‌లలో పాల్గొంటే తల్లిదండ్రుల నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని పాఠశాలలను ఆదేశించామని చెప్పారు. ఈ ఆదేశాలపై సోషల్‌మీడియా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల వేదికగా ప్రభుత్వాలు చిన్నారుల్లో మతపరమైన విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోదరభావంతో మెలగాల్సిన విద్యార్థుల మనసులను కలుషితం చేస్తున్నాయని విమర్శిస్తున్నారు.

ముఫ్తీ గృహనిర్బంధం ఖండించిన పీడీపీ



శ్రీనగర్ : మెహబూబా ముఫ్తీపై జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ విధించిన గృహనిర్బంధాన్ని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) సోమవారం ఖండించింది. పూంచ్ జిల్లాలోని సూరన్‌కోట్‌లో పర్యటించనున్నట్టు ముఫ్తీ ప్రకటించడంతో ప్రభుత్వం ఆమెపై నిర్బంధం విధించినట్టు పార్టీ తెలిపింది. ప్రభుత్వ అనైతిక చర్యను ఖండిస్తున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వ చర్యలు అసంబద్ధమైనవనీ, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపింది. 'ఆర్మీ కస్టడీలో మరణించిన బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు, అక్కడి పరిస్థితిని తెలుసుకునేందుకు ముఫ్తీ సూరన్ కోట్‌లో పర్యటించాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వం బలవంతంగా గృహనిర్బంధం విధించింది' అని పీడీపీ ఎక్స్‌లో పేర్కొంది. ఆకస్మిక దాడిపై విచారణ పేరుతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా భద్రతాదళాలు పలువురు యువకులను అదుపులోకి తీసుకోవడాన్ని ఆదివారం ముఫ్తీ ఖండించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కోరారు. 'డీకేజీ సైనిక శిబిరం బాంఫియా పంచాయితీ పరిధిలోని థానమండి ప్రాంత పౌరులను బలవంతంగా తీసుకువెళ్లింది. వారి సమాచారంపై కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. వారు కస్టడీలో మరణించడంతోనే కుటుంబసభ్యులను చూసేందుకు అనుమతించలేదు " అని ముఫ్తీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

గత గురువారం సైనికుల వాహనాలపై ఉగ్రవాదులు మెరుపు దాడి జరిపిన ఘటనలో నలుగురు సైనికులు మరణించిన సంగతి తెలిసిందే. దాడి అనంతరం 27 మరియు 42 ఏండ్ల వయస్సు మధ్యగల ముగ్గురు పౌరులను విచారణ పేరిట ఆర్మీ అదుపులోకి తీసుకుంది. అయితే డిసెంబర్ 22న వారి మృతదేహాలు లభ్యమయ్యాయి.

నేమ్‌ప్లేట్‌లపై కన్నడ తప్పనిసరి..

- బెంగళూరులో భాషా వివాదం

బెంగళూరు: బెంగళూరులో హిందీ వర్సెస్ కన్నడ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. నగరంలో వాణిజ్య దుకాణాలకు ఉండే బోర్డులను కన్నడలోనే ఉంచాలని బెంగళూరు నగర మహాపాలిక సంస్థ ఆదేశాలు జారీ చేసింది. సైన్‌బోర్డులపై 60 శాతం కన్నడ పదాలని ఉపయోగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని బృహత్ బెంగళూరు మహానగర పాలిక చీఫ్ కమిషనర్ తుషార్ గిరి నాథ్ తెలిపారు. కర్ణాటక రక్షణ వేదిక (కెఆర్‌వి) సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. 'నగరంలో 1400 కి.మీ మేర ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లపై ఉన్న అన్ని వాణిజ్య దుకాణాలను మండలాల వారీగా సర్వే చేసి.. అనంతరం 60 శాతం కన్నడ వాడని దుకాణాలకు నోటీసులు ఇస్తాం. నోటీసు జారీ చేసిన తర్వాత కన్నడ భాషా నేమ్‌ప్లేట్‌లను అమలు చేయడానికి ఫిబ్రవరి 28 లోగా సమయం ఇస్తాం' అని గిరి నాథ్ చెప్పారు. కొత్త ఆదేశాల తర్వాత కేఆర్‌వి మద్దతుదారుడు దుకాణదారులను హెచ్చరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఇది కర్ణాటక. కన్నడ మాట్లాడే ప్రజలు ఈ రాష్ట్రానికి గర్వకారణం. మీ రాష్ట్రంలో ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. మార్వాడీలందరికీ కన్నడ రావాల్సిందే' అని ఓ మహిళ బెదిరిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది. కర్ణాటకలో నివసించే ప్రజలందరికీ కన్నడ రావాల్సిందేనని సీఎం సిద్ధరామయ్య గత అక్టోబర్‌లో ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో అప్పట్లోనే కన్నడ వర్సెస్ హిందీ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. సిద్ధరామయ్య గతంలోనూ కన్నడ భాషపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకుల్లో ఉద్యోగులకు కన్నడ తప్పకుండా రావాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి చెప్పారు. సోమవారం తపస్ రాష్ట్ర కార్యనిర్వాహకవర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. తపస్ డైరీ, క్యాలెండర్‌ను ఏవీఎన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 317 జీవోకు సంబంధించి జిల్లాల వారీగా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి వారికి న్యాయం జరిగేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పాఠశాలలకు స్కావెంజర్లను నియమించేలా ప్రయత్నిస్తానని అన్నారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020ని అమలు చేయాలని తీర్మానం చేశామని తపస్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ చెప్పారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షులు పాపిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వెతలు వర్ణనాతీతం

ఇతర శాఖల్లోకి బదిలీ అయినా ఐదు నెలలుగా జీతాల్లేవ్..

- ఎన్నికలకు ముందు ఆగమైన పూర్వపు గ్రామ రెవెన్యూ సహాయకులు
- ప్రమోషన్ల పేరుతో 200కి.మీ. దూరంలో ఉద్యోగాలు
- ఐడీ నెంబర్లు లేవ్.. ఆపై అదనపు బాధ్యతలతో వెట్టిచాకిరీ
- అసలు జీతమే అరకొర.. అదీ రాక అప్పులపాలు
- కొత్త సర్కారు అయినా కొలిక్కి తేవాలని డిమాండ్


(ఫైల్)

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

వీఆర్‌ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి ఏండ్లుగా వారిని ఆగం చేసిన గత సర్కారు సరిగ్గా ఎన్నికలకు ముందు ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి మరీ ఆగస్టు 10న జీవో నెంబర్ 81, 85 ద్వారా ప్రమోషన్ ఇచ్చినా ప్రభుత్వం గుర్తింపు నెంబర్ ఇవ్వలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం కొత్తగా కాంగ్రెస్ సర్కారు కొలువుదీరడం వంటి పరిణామాల మధ్య ఐదు నెలల కాలం గడిచింది. ఇచ్చిన ప్రమోషన్ ఉమ్మడి జిల్లా పరిధిలోగాకుండా ఇతర జిల్లాలో రావడం, అక్కడికి వెళ్లి కొలువులో చేరినా ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబం గడవక అప్పులపాలవుతున్నారు.

రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు తొలి రోజుల్లోనే వీఆర్ఏల గౌరవవేతనాన్ని రూ.6వేల నుంచి రూ.10500కు పెంచింది. ఏండ్లుగా అదే కొలువులో ఉన్న వారికి ప్రమోషన్లు కల్పిస్తామని స్వయంగా గత సీఎం కేసీఆర్ 2016, 2020లో హామీలూ ఇచ్చారు. అయితే, రెవెన్యూశాఖను సమగ్ర ప్రక్షాళన చేసి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'ధరణి' పోర్టల్‌ను తీసుకొచ్చిన గత సర్కారు 2020లో కొత్త రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. భూ రికార్డుల విషయంలో వీఆర్వో, వీఆర్ఏల అవసరం లేదని ఆ పోస్టులను రద్దు చేసింది. వీఆర్‌ఓలను ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. ఆ సమయంలో తమ కొలువుల సంగతి తేల్చాలని వీఆర్ఏలు సుమారు మూన్నెళ్లపాటు ఆందోళన చేయగా, పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్న కేటీఆర్ స్పందించి వీఆర్ఏల ప్రతి నిధులతో చర్చించి పరిష్కారం చూపారు. ఇతర శాఖల్లో సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి ఆగస్టు 10న జీవో నెంబర్ 81, 85 ద్వారా పూర్వపు వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించారు. కొందరిని రెవెన్యూలోనే ఉంచి, మిగిలిన వారిని ఎడ్యుకేషన్, వైద్యం, నీటిపారుదల, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, మున్సిపల్, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో వారి విద్యార్హతలం, వయసును బట్టి ఆఫీసు సబార్డినేటర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెం ట్లుగా బదిలీ చేశారు.

ఐడీ నెంబర్ లేదు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో సుమారు 3200 మందికిపైగానే వీఆర్ఏలు ఉండేవారు. జిల్లాల పునర్విభజనతో కొందరు ఉమ్మడి జిల్లా పరిధి దాటి ఇతర జిల్లాల్లోకి వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లాలో 565, సిరిసిల్లలోని 465, జగిత్యాలలో 470, పెద్దపల్లి జిల్లాలోని 460 మంది మిగిలిపోయారు. అయితే వీరందరికీ ప్రమోషన్ ఇచ్చి ఇతర శాఖల్లోకి బదిలీ చేసిన గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధి దాటి ఇతర జిల్లాలకు పంపించింది. అందులోనూ కరీంనగర్ జిల్లా వారికి నిర్మల్, హన్మకొండ, వరంగల్, సిరిసిల్ల జిల్లా వారికి కామా రెడ్డి, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. కొందరికైతే భద్రాద్రి కొత్త గూడెంకూ వెళ్లాల్సి వచ్చింది. ప్రమోషన్ దూర జిల్లాల్లో వచ్చినా వెళ్లేందుకు సిద్ధమైన పూర్వపు వీఆర్ఏలకు ప్రభుత్వం గుర్తింపు నెంబర్లు ఇవ్వలేదు. దీంతో ఐడి నెంబర్లు లేక జీతాలు రాని పరిస్థితి నెలకొంది. గతంలో నెలానెలా వచ్చే రూ.10500 అరకొర జీతంలో కుటుంబాన్ని నెట్టుకొస్తే.. కొత్తగా వచ్చిన ప్రమోషన్‌లో ఐదు నెలలుగా జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. ఉద్యోగం వచ్చిన జిల్లాలకు మారి కొందరు, రోజువారీగా కొలువు కోసం ప్రయాణం చేస్తూ మరికొందరు కుటుంబాన్ని పోషించలేక అప్పులపాలవుతున్నారు. ఇక 60ఏండ్లు పైబడిన వారి కుటుంబాల్లో వారసులకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీ అటెకెక్కడంతో సుమారు 500మందికిపైగా అటు ప్రమోషనూ, ఇటు ఉద్యోగమూ లేక వీధినపడ్డారు.

200 కిలో.మీ. దూరంలో ఉద్యోగం...

కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన జయశ్రీ అదే గ్రామంలో వీఆర్ఏగా పని చేసేవారు. ప్రస్తుతం ప్రమోషన్ మీద ప్రభుత్వం వార్డు ఆఫీసర్‌గా 200కిలోమీటర్ల దూరంలోని నిర్మల్ మున్సిపాలిటీకి బదిలీ చేసింది. నుస్తులాపూర్‌కు చెందిన మరో వీఆర్ఏ వనిత సైతం అదే మున్సిపాలిటీలో వార్డ్ ఆఫీసర్‌గా చేరారు. కరీంనగర్‌కు చెందిన అవినాశ్, మానకొండూర్‌కు చెందిన జెట్టి శ్రీనివాస్ సైతం నిర్మల్, హన్మకొండ జిల్లాలోని రెవెన్యూశాఖలో రికార్డు అసిస్టెంట్లుగా వెళ్లారు. ఊరుగాని ఊరు.. అందులోనూ వంద నుంచి 200కిలోమీటర్ల దూరంలో ప్రమోషన్ మీద ఉద్యోగమిచ్చినా.. ఐడి నెంబర్ లేక వచ్చే అరకొర జీతమూ ఐదు నెలలుగా రాక అప్పులపాలవుతున్నామని వారు 'నవతెలంగాణ'తో వాపోయారు.

వెంటనే గుర్తింపు సంఖ్య కేటాయించాలి



తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, విద్యార్హతలను బట్టి వివిధ శాఖలకు బదిలీ జరిగి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా. నేటికీ గుర్తింపు సంఖ్య కేటాయించ లేదు. దీనికితోడు జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైనా ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని తమ సమస్యకు పరిష్కారం చూపాలి.

కిన్నెర కొమురయ్య, వీఆర్ఏల జేఏసీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జీతాలు రాక అప్పులపాలవుతున్నం



ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎంప్లాయి ఐడి ఇచ్చి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం లేదు. గతంలో వచ్చిన జీతంతోనైనా కొంత పూటగడిచేది. ఇప్పుడు ప్రమోషన్లు ఇచ్చినా.. కొత్త జీతమెంతో చెప్పకుండా ఐదు నెలలుగా వేతనాలు అందక అప్పులపాలవుతున్నాం.

సంపత్ (పూర్వపు వీఆర్ఏ), తిమ్మాపూర్ ఎంఆర్ఓ ఆఫీసు

లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పార్లమెంటరీ కమిటీ



న్యూఢిల్లీ : 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న అంతర్జాతీయ సమాజ లక్ష్యాన్ని చేరుకోవడం మన దేశానికి ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తేల్చేసింది. కార్మికులు, జౌళి, నైపుణ్యాభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ తన 52వ నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న బాల కార్మికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ధారణకు వచ్చింది. కమిటీ తన నివేదికను ఇటీవలే పార్లమెంటుకు సమర్పించింది. అంతర్జాతీయ సమాజం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే కార్యాచరణ ఆధారిత విధానాన్ని రూపొందించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు సూచించింది.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి భర్తృహరి మహతాబ్ నేతృత్వం వహించారు. చిన్నారులను బలవంతంగా పనిలో దింపడాన్ని, బాలల అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వాలతో, ఈ అంశానికి సంబంధించిన వారితో విస్తృత చర్చలు జరిపిన కమిటీ తన నివేదికలో పలు విషయాలను ప్రస్తావించింది. చిన్నారులను కార్మికులుగా పెట్టుకుంటున్న యజమానులపై ఎన్నిసార్లు జరిమానాలు విధించినప్పటికీ వారు ఆ పిల్లలను మరోసారి అదే పనిలో పెట్టుకుంటున్నారని తెలిపింది.

యజమానులపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా మరిన్ని కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. జరిమానాలను మూడు నాలుగు రెట్లు పెంచడంతో పాటు లైసెన్సుల రద్దు, ఆస్తుల జప్తు వంటి కఠిన శిక్షలు విధించాలని సిఫారసు చేసింది.2011 జనాభా లెక్కల ఆధారంగా మంత్రిత్వ శాఖ నుంచి సేకరించిన సమాచారాన్ని కమిటీ తన నివేదికలో ఉటంకించింది. వివిధ రంగాలలో 1.01 కోట్ల మంది పిల్లలు పని చేస్తున్నారని తెలిపింది. ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన బాల కార్మికుల సంఖ్య 2011 జనాభా లెక్కల ప్రకారం 57,54,201గా ఉంది. వీరంతా 5-14 సంవత్సరాల మధ్య వయసున్న వారే. వీరు వ్యవసాయం, మైనింగ్‌తో పాటు ఎనిమిది రకాల పరిశ్రమలలో పని చేస్తున్నారు.

కుక్కలదాడిలో 5 నెలల బాలుడు మృతి

నవతెలంగాణ-మెహిదీపట్నం



హైదరాబాద్‌లో కుక్కల దాడిలో మరో బాలుడు మృతిచెందాడు. ఈ నెల 8న శునకాల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 5 నెలల బాలుడు సోమవారం చనిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

అంజి- అనుష దంపతులు షేక్‌పేట వినోబానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 8న వారి ఐదు నెలల బాలుడిని గుడిసెలో ఉంచి కూలి పనికి వెళ్లారు. గుడిసె వద్దకు వచ్చిన వీధి కుక్కలు ఆ చిన్నారిని గాయపరిచాయి. తల్లిదండ్రులు వచ్చేసరికి బాలుడు రక్తపు మడుగులో ఏడుస్తూ కనిపించాడు.

వెంటనే వారు బాలుడిని ఓ ప్రయివేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి నీలోఫర్ ఆస్పత్రికి, ఆపై ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. తాము గతంలో వీధి కుక్కలపై ఎన్నోసార్లు పోలీసులకు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని, కానీ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

వికారాబాద్ జిల్లాలో ఘటన

నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి



పొగమంచు అలుముకుని దారి కనిపించక కారు చెరువులోకి దూసుకెళ్లింది.. దీంతో కారులో ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా వికారాబాద్ మున్సిపల్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వికారాబాద్‌లోని అనంతగిరి హిల్స్‌ను హైదరాబాద్ మాదాపూర్ నుంచి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చూసేందుకు కారులో ఐదుగురు స్నేహితులు బయలుదేరారు. రఘు, మోహన్, సాగర్, గుణశేఖర్(24)తో పాటు పూజిత కారులో ఉన్నారు. శివారెడ్డిపేట దగ్గరికి రాగానే పొగమంచుతో రోడ్డు కనబడకపోవడంతో కారు చెరువులోకి దూసుకెళ్లింది. అందులో రఘుకి ఈత రావడంతో సాగర్, మోహన్, పూజితను రక్షించాడు. గుణశేఖర్ కారుతోపాటు మునిగిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రెస్క్యూ చేపట్టారు. ముందుగా కారును బయటకు తీశారు. అనంతరం గుణశేఖర్ మృతదేహం లభ్యమైంది. కారుకి ఇరువైపులా డ్యామేజ్‌లు ఉండటంతో వేరే ఏదైనా వాహనాన్ని ఢీకొట్టారా అనే విషయం తెలియాల్సి ఉంది. పూజిత ఇటీవల అమెరికా నుంచి వచ్చింది. వీరంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో పాటు బిజినెస్‌లు చేస్తున్నారు. అయితే బస్సు తమ కారును ఢీకొట్టడంతో పొగమంచులో కనిపించక చెరువులోకి దూసుకెళ్లినట్టు పూజిత తెలిపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మీ ఆదుపులో ముగ్గురు మృతి

- హత్యకేసు నమోదు చేసిన జమ్ముకాశ్మీర్ పోలీసులు

శ్రీనగర్ : ఆర్మీ ఆదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన ఘటనపై జమ్ముకాశ్మీర్ పోలీసులు హత్యకేసు నమోదు చేశారు. పూంచ్ జిల్లాలోని సూరంకోట్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 302 కింద గుర్తుతెలియని వ్యక్తులపై హత్య కేసు నమోదు చేసినట్టు అధికారులు సోమవారం తెలిపారు. పూంచ్ జిల్లాలో ఈ నెల 21న ఉగ్రదాడిలో ఐదుగురు సైనికులు మరణించిన ఘటన జరిగిన తరువాత రోజు సమీప గ్రామం నుంచి విచారణ కోసం ఎనిమిది మందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. వీరంతా గుజ్జార్ సామాజిక వర్గానికి చెందిన వారు. వీరిలో ముగ్గురు తీవ్రగాయాలతో శుక్రవారం మరణించగా, మిగిలిన ఐదుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు

- కొలరాడోలో ఒకరు మృతి

డెన్వర్ : కొలరాడో మాల్‌లో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒకరు మరణించగా, ముగ్గురికి తీవ్ర గాయాలైనట్టు పోలీసులు సోమవారం తెలిపారు. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. కొలరాడో స్ప్రింగ్స్‌లోని సిటాడెల్ మాల్‌లో ఆదివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు కాల్పులకు దిగడంతో ఒకరు మరణించారని అన్నారు. పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు.

గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ గురుకులం రాష్ట్ర కమిటీ డిమాండ్
- నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన గురుకుల సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ గురుకులం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీఎస్‌యూటీఎఫ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (గురుకులం) ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో హరీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 160 గురుకులాలు, 23 ఏకలవ్య ఆదర్శ గురుకులాలను గురుకులం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ విద్యాసంస్థల్లో 2018, 2019లో నియామకమైన ఉపాధ్యాయులకు ఆరేండ్లైనా రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు విడుదల చేయలేదని చెప్పారు. దీంతోపాటు బదిలీలు, పదోన్నతులు నిర్వహించకపోవటం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరారు. శ్రమకు తగిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 317 జీవో, పీఆర్సీలో కరస్పాండింగ్ స్కేలు వర్తింపు, 2008లో రెగ్యులరైజ్ అయిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు వంటి అంశాలపై హైకోర్టు తీర్పులను తక్షణమే అమలు చేయాలని కోరారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేందర్, హరీందర్‌రెడ్డి

సమావేశానంతరం టీఎస్‌యూటీఎఫ్‌నకు అనుబంధంగా గురుకులం ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా డాక్టర్ బి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా వి హరీందర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్ రవి కుమార్, మరో 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నాయకులు ఎ గణేష్, బి ఈశ్వర్, ఎస్ ఉపేందర్, డి వెంకన్న, ఎం పావని, కె నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీపీపీలో డ్రైవర్ మృతి..

- కుటుంబ సభ్యుల ధర్నా

నవతెలంగాణ-గణపురం

కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు టిప్పర్ అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు దాని కిందపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. జయశంకర్-భూపాలపల్లి జిల్లా జంగేడు ఫకీర్‌గడ్డ గ్రామానికి చెందిన బుర్ర కొమురయ్య(38) ఆదివారం సాయంత్రం గణపురం మండలంలోని విద్యుత్ కేంద్రంలో టిప్పర్‌తో బొగ్గు లారీని లోపలికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో బొగ్గును అన్‌లోడ్ చేస్తుండగా జాకీ విరిగి ఆయన మీద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు కొమురయ్య కోసం వెతకగా మృతదేహం కనిపించింది. దాంతో వారు జెన్‌కో గేటు ముందు మృతదేహాన్ని పెట్టి ధర్నా చేశారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 63,490	▲ 380
22 క్యారెట్లు	- 58,200	▲ 350
కిలో వెండి	- 80,700	▲ 700




చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	85
రిటైల్ (లైవ్)	రూ.	107
స్కిన్‌తో	రూ.	155
స్కిన్‌లెస్	రూ.	177

హైదరాబాద్‌లో 30కిపైగా కరోనా కేసులు

వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం
అనుమానితులకు పరీక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వాక్సినేషన్ తర్వాత పూర్తిగా కనుమరుగైపోయిందని భావించిన కరోనా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. దాదాపు ఏడాది తర్వాత వైద్య, ఆరోగ్యశాఖ కరోనా బులిటెన్ విడుదల చేసింది. దీంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోషల్ డిస్టెన్స్ పాటించడం, ఫేస్ మాస్కులు ధరించడం అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే సర్కార్‌తోపాటు ప్రయివేటు ఆస్పత్రులకు పలు సూచనలు చేసింది. కరోనా కట్టడికి తగిన చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల్లో సగం హైదరాబాద్ జిల్లా నుంచే ఉంటున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే జిల్లాలో దాదాపు 30కిపైగా కేసులు నమోదయ్యాయి.

ముందస్తు అప్రమత్తం

గాంధీ, ఉస్మానియా, ఫీవర్, చెస్ట్ ఆస్పత్రులతో మరో రెండు ప్రధాన ఆస్పత్రుల్లో కోవిడ్ నివారణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మందులు, పీపీఈ కిట్లు, డిస్పోసబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు అన్ని అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది భద్రత, శ్రేయస్సు దృష్టా నిజాం వైద్య విధాన సంస్థ (నిమ్స్) ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఆస్పత్రిలో మాస్క్ వినియోగం తప్పనిసరి చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్ని రకాల సౌకర్యాలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. తగినన్ని ఆర్టీపీసీఆర్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కొవిడ్ టెస్టుల్లో అనుమానిత కేసులు వస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీ కోవిడ్ ఐసోలేషన్ వార్డులో 50 ఆక్సిజన్, వెంటిలేటర్ పడకలను సిద్ధం చేశారు. నిలోఫర్ సహా ఇతర అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అనుమానితులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఇన్‌పేషెంట్ చికిత్స కోసం పడకలు సిద్ధం చేశారు. అవసరమైతే కొంతకాలంగా సర్వీసుకు దూరంగా ఉన్న టిమ్స్‌ను సైతం పునరుద్ధరించాలని త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

2020లో హైదరాబాద్‌లో తొలి కేసు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ 2020 మార్చి 2వ తేదీన హైదరాబాద్ నగరంలో రెడ్ హిల్స్‌లో తొలి కోవిడ్ కేసుగా నమోదైంది. మొదటి వేవ్‌లో కోవిడ్ ఆల్ఫా వేరియంట్ విజృంభించగా, రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్, మూడో వేవ్‌లో ఓమిక్రాన్ వేరియంట్ వెలుగు చూసింది. కొత్తగా ఒమిక్రాన్ జేఎన్1 వేరియంట్ రూపంలో మళ్లీ విజృంభిస్తోంది. క్రమంగా వైరస్ తగ్గుముఖం పట్టిందనుకుని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో చాపకింద నీరులా మళ్లీ విస్తరిస్తోంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లా, ఏరియా హాస్పిటల్స్‌తోపాటు బస్తీ దవాఖాన, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలను అప్రమత్తం చేసింది. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. హైదరాబాద్ జిల్లాలో దాదాపు 120కి పైగా ప్రయివేటు ఆస్పత్రులకు మందస్తు సమాచారం ఇచ్చారు. కరోనా విజృంభిస్తే బెడ్లు, మందులు, వెంటిలేటర్లు, ఐసోలేషన్ వార్డులు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వాస్పత్రుల్లో మాక్ డ్రీల్ నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి.. ఆందోళన అవసరం లేదు

డాక్టర్ రఘునాథస్వామి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

కరోనా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేసులు పెరుగుతున్న దృష్టా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. పూర్తి స్థాయిలో వైద్య బృందం అందుబాటులో ఉంటుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

డిసెంబర్-2023లో హైదరాబాద్ జిల్లాలో నమోదైన కరోనా కేసులు ఇలా..

తేదీ	కేసులు(హైదరాబాద్)
16	1
17	0
18	1
19	4
20	6
21	4
22	8
23	9
24	5
25	9

బిజినెస్

వ్యవసాయ ఎగుమతుల్లో.. ఐదు ఉత్పత్తులదే సగంపైగా వాటా



న్యూఢిల్లీ: భారత వ్యవసాయ రంగ మొత్తం ఎగుమతుల్లో కేవలం ఐదు ఉత్పత్తులే 51.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) రిపోర్ట్ ప్రకారం.. బాస్మతి బియ్యం, బాస్మతీయేతర బియ్యం, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, వంట నూనెలు మెజారిటీ వాటాను కలిగి ఉన్నాయి. ఈ ఉత్పత్తులపైనే వ్యవసాయ రంగం ఎగుమతులు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఇవి ప్రపంచ స్థాయిలో ధరలు, డిమాండ్‌ను ప్రభావితం చేస్తాయి. కాగా.. ఈ రంగం మౌలిక సదుపాయాల లోపాలు, నాణ్యత నియంత్రణ సమస్యలు, టారిఫ్ అడ్డంకులు తదితర సవాళ్లను ఎదుర్కొంటుంది. ఇవి భారత వ్యవసాయ రంగ ఎగుమతుల్లో వృద్ధి, పోటీతత్వానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయి.

వాల్ డిస్నీలో రిలయన్స్‌కు మెజారిటీ వాటా

న్యూఢిల్లీ : వాల్ డిస్నీ ఇండియాలో మెజారిటా వాటా కొనుగోలుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. గత వారం లండన్‌లో వాల్ట్ డిస్నీ- రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య నాన్ బైండింగ్ ఒప్పందం జరిగింది. మెగా విలీనం తర్వాత రిలయన్స్ యాజమాన్యంలోని వయాకామ్18కు స్టార్ ఇండియా సబ్సిడరీ అవుతుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఈ విలీనం పూర్తి కానుందని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో వయాకామ్18కు 51 వాటా స్టార్ ఇండియాకు 49 శాతం వాటా చేరిపోతుంది. మెగా విలీనం తర్వాత రిలయన్స్ యాజమాన్యంలోని వయాకామ్18కు స్టార్ ఇండియా సబ్సిడరీగా మారనుంది.

మాన్యావర్ కొత్త కలెక్షన్‌తో రామ్ చరణ్



న్యూఢిల్లీ : వేదాంత్ ఫ్యాషన్ లిమిటెడ్‌కు చెందిన మాన్యావర్ బ్రాండ్ తన వెడ్డింగ్ కలెక్షన్‌లో ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడర్ నటుడు రామ్ చరణ్ కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించారు. తాజాగా వివాహ కలెక్షన్‌లో భాగంగా పంచకచం, వేష్టికి సంబంధించిన వస్త్రాలను దక్షిణాదిలోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇవి దక్షిణాది వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపింది. ఇందులో రామ్ చరణ్‌కు జోడీగా శోభిత దూళిపాళ్ల నటించారు.

కొత్త వ్యాపారాల్లోకి వివాంటా ఇండస్ట్రీస్

- టెక్, ఇవి చార్జింగ్ విభాగాల్లోకి ప్రవేశం

VIVANTA INDUSTRIES LIMITED

అహ్మదాబాద్ : వివాంటా ఇండస్ట్రీస్ ఆధునిక వ్యాపారాలపై దృష్టి పెడుతున్నట్టు ప్రకటించింది. డ్రోన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎఐ, రోబోటిక్స్, విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల తదితర కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెడుతున్నట్లు వెల్లడించింది. ఈ లిస్టెడ్ కంపెనీ ప్రస్తుతం కాన్సెప్ట్ నుంచి అమలు వరకు ప్రాజెక్టులకు కన్సల్టెన్సీ, టర్న్ కీ సొల్యూషన్స్ అందిస్తోంది. తమ కంపెనీ ఇప్పటికే డ్రోన్, ఇవి వ్యాపారంపై పనిని ప్రారంభించినట్లు పేర్కొంది. రాబోయే కాలంలో దీనిని పెద్దది చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొంది. 2023 సెప్టెంబర్‌లో వివాంటా డ్రోన్ రీసెర్చ్ సెంటర్ టాంజానియా లిమిటెడ్‌తో ప్రాథమిక ఎంఒయు కుదుర్చుకున్నట్లు పేర్కొంది. అసెంబ్లీ లైన్ ఏర్పాటుతో పాటు డ్రోన్ల ఆర్అండ్‌డీ కోసం విడిఆర్ సిటిఎల్‌లో 50 శాతం వాటాను వివాంటా ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొనుగోలు చేయనున్నట్టు వెల్లడించింది. ఆఫ్రికా ఖండం నుంచి గణనీయమైన వ్యాపార అవకాశాన్ని కంపెనీ ఆశిస్తోంది. ప్రాజెక్టును వేగవంతం చేయాలని చూస్తోన్నట్టు తెలిపింది.

సోచ్‌లో 50 శాతం డిస్కౌంట్లు

హైదరాబాద్ : సోచ్ తన రెడ్ డాట్ సేల్‌ను తిరిగి తెచ్చినట్టు ఆ సంస్థ తెలిపింది. వివిధ రకాల ఎత్నిక్ వేర్‌లపై 50 శాతం వరకు డిస్కౌంట్లను అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ రెడ్ డాట్ సేల్‌లో చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్‌లు, ట్యూనిక్స్, కఫ్తాన్‌లతో సహా అనేక వస్త్రాలున్నాయని తెలిపింది.

లోక్‌సభ ఎన్నికలపై గురి

- 28న విస్తృతస్థాయి సమావేశం
- అదే రోజు బీజేపీఎల్పీ నేత ఎన్నిక !

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గతం కంటే మెరుగైన సీట్లు...ఓట్ల శాతం సాధించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ స్థానాలు సాధించడంపై దృష్టిసారించింది. తెలంగాణపై అమిత్‌షా ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగానే ఈ నెల 28న తెలంగాణకు ఆయన రాబోతున్నారు. ఈ నేపథ్యంలోనే విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఆ సమావేశానికి తమ పార్టీ మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర పదాధికారులు 1200 మందికిపైగా హాజరవుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఉత్తర తెలంగాణలోని ఎంపీ సీట్లతో పాటు మహబూబ్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలపైనా ఈ సారి ప్రత్యేకంగా దృష్టి సారించనున్నది. వికారాబాద్ జిల్లా పరిగిలో తబ్లీక్ జమాత్ ఆధ్వర్యంలో వచ్చే నెలలో జరిగే మూడు రోజుల సమావేశాలకు రూ.2.75 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంపై బీజేపీ ఆగ్రహంతో ఉంది. లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న ఆ సమావేశాలను రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకోవడంపై కమలం పార్టీ పెట్టింది. దాన్నిచుట్టూ రాజకీయాన్ని తిప్పి లబ్దిపొందాలనే వ్యూహరచనతో ముందుకెళ్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ అభ్యర్థుల ప్రకటనలో స్పష్టత కొరవడింది. కొన్నిచోట్ల అభ్యర్థులను ప్రకటించి మరీ మార్చేసిన పరిస్థితి. దీంతో ఆ పార్టీలో పెద్ద గందరగోళమే నెలకొంది. నేతల రాజీనామాల పర్వం కూడా కొనసాగింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో అలాంటి పరిస్థితి ఉత్పన్నం కావొద్దనే ఆలోచనతో బీజేపీ ముందుకెళ్తున్నది. సీనియరా? జూనియరా? ఇతర పార్టీ నుంచి వచ్చిన వ్యక్తులా? అనే తేడా లేకుండా నెల, నెలన్నర ముందే ఎంపీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులను ప్రకటించాలనే ఆలోచన ఆ పార్టీ శ్రేణుల నుంచి బలంగా వినిపిస్తున్నది. కొందరు రాష్ట్ర నేతలు కూడా ఇదే అంశాన్ని జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జాతీయ నాయతకత్వం ఆశించినట్టుగా 15కుపైగా సీట్లు రాకపోయినప్పటికీ గతం కంటే మెరుగైన ఫలితాలు వచ్చిన విషయం విదితమే. మరో మూడు, నాలుగు స్థానాల్లో ద్వితీయ స్థానంలో కూడా ఆ పార్టీ అభ్యర్థులు నిలిచారు. దీంతో పార్లమెంట్ స్థానాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే ఈ నెల 28న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించబోతున్నది.

ఎల్పీనేత ఎన్నికపైనా అదే రోజు స్పష్టత

అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఆ సమావేశంలోనే బీజేపీ ఎల్పీ నేతను ఎన్నుకోనున్నట్టు తెలిసింది. అసెంబ్లీలో ఇప్పటికే అన్ని పక్షాలు తమ ఎల్పీ నేతలను ప్రకటించాయి. బీజేపీలో మాత్రం ఎవరిని ఎన్నిక చేయాలనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సీనియార్టీ దృష్ట్యా రాజాసింగ్ రేసులో ముందంజలో ఉన్నారు. తెలుగులో అనర్గళంగా మాట్లాడకపోవడం, అన్ని విషయాలపై పట్టులేకపోవడం ఆయనకు ప్రధాన ఆటంకాలుగా మారనున్నాయి. నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏ.మహేశ్వర్‌రెడ్డి కూడా ఎల్పీనేత రేసులో బలంగా ఉన్నారు. వీరిద్దరూ కాని పక్షంలో ప్రస్తుత, మాజీ సీఎంలపై విజయం సాధించిన వెంకటరమణారెడ్డిని నియమించి ముందుకెళ్లేందుకు బీజేపీ అధిష్టానం యోచిస్తున్నట్టు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో దూకుడుగా ముందుకెళ్లడానికి ఈ అంశం కూడా దోహదపడుతుందనే ఆలోచనలో ఆ పార్టీ నాయకత్వం ఉంది

ప్రశ్నార్థకంగా పార్లమెంటు?

(మొదటిపేజీ తరువాయి)

వరకూ లోక్‌సభ నుంచి 100 మంది, రాజ్యసభ నుంచి 46 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. లోక్‌సభ చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో సభ్యులపై సస్పెన్షన్ వేటు పడడం గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ సమావేశాలలోనే దుష్ప్రవర్తన కారణంగా తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహూవా మొయిత్రా బహిష్కరణకు గురయ్యారు. గతంలో పార్లమెంటులో మూడుసార్లు ఎంపీలపై బహిష్కరణ వేటు పడింది. 2005లో 11 మందిని బహిష్కరించారు. ప్రశ్నలు వేసినందుకు ప్రతిగా డబ్బు తీసుకున్నారంటూ వారిపై ఆరోపణలు వచ్చాయి. అంతకుముందు 1976, 1978 సంవత్సరాలలో ఒక్కో సభ్యుడు బహిష్కరణకు గురయ్యారు. ఈ సమావేశాలలో సభలో 10 బిల్లులను ప్రవేశపెట్టగా అవన్నీ ఆమోదం పొందాయి. గత సమావేశాలలో పెండింగులో ఉన్న మరో ఏడు బిల్లులకు కూడా ఆమోదం లభించింది. ప్రవేశపెట్టిన మూడు రోజులలోనే టెలికమ్యూనికేషన్ బిల్లును ఆమోదించారు. దీనిపై లోక్‌సభలో కేవలం గంటా నాలుగు నిమిషాలు, రాజ్యసభలో గంటా పదకొండు నిమిషాల పాటు మాత్రమే చర్చ జరిగింది. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టం స్థానంలో తీసుకొచ్చిన మూడు బిల్లులపై కూడా సభ చర్చించి ఆమోదించింది. ఈ మూడు బిల్లులపై లోక్‌సభలో 9.34 గంటలు, రాజ్యసభలో 6.08 గంటల చర్చ జరిగింది. లోక్‌సభలో 34 మంది చర్చలో పాల్గొనగా వారిలో 25 మంది బీజేపీ వారే. రాజ్యసభలో 40 మంది చర్చలో భాగస్వాములు కాగా వారిలో 30 మంది బీజేపీకి చెందిన సభ్యులే.

శీతాకాల సమావేశాలలో ఒక్క బిల్లును కూడా పరిశీలన నిమిత్తం కమిటీలకు నివేదించకపోవడం గమనార్హం. 15వ లోక్‌సభలో 71% బిల్లులను కమిటీల పరిశీలనకు పంపగా 16వ లోక్‌సభలో అది 16%కి పడిపోయింది.

ఇక ప్రశ్నోత్తరాల విషయానికి వస్తే సస్పెన్షన్‌కు గురైన సభ్యులు సభలో ఉన్నప్పుడు అడిగిన ప్రశ్నలన్నింటినీ జాబితా నుండి తొలగించారు. 14 మంది సభ్యులు సస్పెన్షకు గురైన 14వ తేదీ నుండి లోక్‌సభలో 12%, రాజ్యసభలో 13 శాతం ప్రశ్నలు రద్దయ్యాయి. రాజ్యసభలో రెండు రోజులు, లోక్‌సభలో మూడు రోజులు సభ్యుల ప్రశ్నలకు మౌఖిక సమాధానాలు ఇవ్వలేదు. మొత్తంమీద ప్రశ్నోత్తరాల సమయం లోక్‌సభలో 53 శాతం, రాజ్యసభలో 72 శాతం పనిచేసింది. ఆర్థిక పరిస్థితిపై రాజ్యసభలో 10 గంటల పాటు చర్చ జరిగింది. వార్షిక బడ్జెట్‌లో ఒక్క శాతం పెంపుదలతో ప్రవేశపెట్టిన అనుబంధ పద్దుకు కూడా ఉభయసభలు ఆమోదం తెలిపాయి.

సమన్వయంతో పనిచేయాలి

- ప్రభుత్వ కార్యక్రమాల్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి
- సజావుగా గ్రామసభలు జరపాలి
- అలసత్వం వద్దు: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ- మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు అందించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజాపాలన కార్యక్రమం.. జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లే బాధ్యత అధికారులదేనన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాలు, వాటి ఆచరణ, అమలు చేసే పాత్రలో అధికారులే కీలకమన్నారు. చట్టానికి లోబడి రెవెన్యూ, పోలీస్ శాఖలు ఆరు గ్యారంటీలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను తాను ప్రస్తుతం వెలికి తీసే ఆలోచన లేదన్నారు. అలాంటి తప్పిదాలను తమ ప్రభుత్వం చేయబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, పరిపాలనకు అధికారగణం గుండె లాంటిదన్నారు. ప్రజలకు జవాబుదారీగా సేవలందించే ప్రభుత్వ పరిపాలనకు అనుగుణంగా అధికారుల పనితీరు ఉండాలన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామసభలు సజావుగా జరిగేలా అందరూ బాధ్యత వహించాలన్నారు. గ్రామ సభల్లో దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలుగా ఏర్పాటు చేసి మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి రోజూ ఉయదం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల్ని స్వీకరించాలని చెప్పారు. గ్రామపంచాయతీ స్థాయిలో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలన్నారు. అతనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన లబ్దిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు.. ఆరు గ్యారంటీలు అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు.

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా ప్రజాపాలన కార్యక్రమం కొనసాగాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం గురించి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్, చంద్రశేఖర్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ సురేష్‌మోహన్, డీఆర్‌ఓ నగేష్, ఏఎస్పీ అశోక్ ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఐదుగురికి కరోనా పాజిటివ్

- జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని ఒకే కుటుంబంలో..

నవతెలంగాణ-గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామంలో కోవిడ్ కలకలం సృష్టిస్తోంది. ఒకే కుటుంబంలో ఐదుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. రెండ్రోజుల కిందట అనారోగ్యంతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి కోవిడ్ కొత్త వేరియంట్ పాజిటివ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ బాధితురాలి ఇంట్లోని కుటుంబ సభ్యులకు కరోనా టెస్టులు చేయగా నలుగురికి లక్షణాలు ఉన్నట్టు తేలింది. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు వెంటిలేషన్ మీద ఉన్నట్టు తెలిసింది. ఆ కుటుంబ సభ్యుల్లో ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలకు కరోనా రావడంతో ఐసోలేషన్‌లోనే ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు.

బీజేపీ ఆఫీస్‌లో వాజ్‌పేయ్ జయంతి

- నివాళి అర్పించిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రాజాసింగ్, తదితరులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా గుడ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విదేశాంగ మంత్రిగా, ప్రధానిగా వాజ్‌పేయి అందించిన సేవలు మరువలేనివన్నారు. వాజ్‌పేయి అడుగుజాడల్లో ప్రస్తుత ప్రధాని మోడీ నీతివంతమైన పాలన అందిస్తున్నారన్నారు. వాజ్‌పేయి కలలు కన్న రామమందిరం..మోడీ పాలనలో నెరవేరుతున్నదని చెప్పారు.

శ్వేత, స్వేద పత్రాలు రెండూ అవినీతి పత్రాలే : కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్ ప్రకటించిన స్వేదపత్రం, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం రెండు కూడా అవినీతి పత్రాలేనని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాయలంలో ఆయన చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి అవినీతి, ప్రజలను మోసం చేసే పత్రాలని ఆరోపించారు. ఈ నెల 28న రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం ఉందనీ, దానికి హోంమంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు.ఆ సమావేశంలో పార్లమెంట్

పేటియం ఉద్యోగులకు కొత్త ఏడాది షాక్

- 1000 మందిపై వేటు
- 15 శాతం వ్యయం తగ్గింపు..!
- నైక్‌లోనూ ఉద్వాసనలు..



ముంబయి : టెక్నాలజీ, స్టార్టప్ కంపెనీలపై ఆశలు పెట్టుకున్న, ఆధారపడిన ఉద్యోగుల బ్రతుకులకు భద్రత లేకుండా పోతోంది. తాజాగా ప్రముఖ ఫిన్ టెక్ కంపెనీ పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ భారీగా ఉద్యోగులను ఇంటికి పంపించింది. పేటియంలో పని చేస్తున్న దాదాపు 1,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 10-15 శాతం మందిపై ప్రభావితం చూపనుందని సమాచారం. వ్యయ నియంత్రణ చర్యలల్లో భాగంగా సిబ్బందిని ఇంటికి పంపించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. పేటియం తన వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరించాలనే ఉద్దేశ్యంతో కోతలు విధించినట్లు ఆ సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. భవిష్యత్‌లో మరిన్ని వ్యయ నియంత్రణ చర్యలూ ఉంటాయని సంకేతాలు ఇవ్వడంతో మిగిలిన ఉద్యోగుల్లోనూ తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. తాజా ఉద్వాసనలతో మొత్తంగా ఉద్యోగులపై చేస్తున్న వ్యయంలో 10-15 శాతం తగ్గించుకోవాలని సంస్థ లక్ష్యంగా చేసుకుంది. ఇటీవల రిటైల్ రుణాల జారీని తగ్గించుకోవడం, యుపిఐ ప్లాట్‌ఫామ్‌పై 'ఇప్పుడు కొనండి తర్వాత చెల్లించండి' రుణాలను నిలిపివేయడం వంటి చర్యల తర్వాత సిబ్బంది తొలగింపు నిర్ణయం వెలుపడింది. కాగా.. గతేడాది వ్యవధిలో భారీ వృద్ధి నమోదు చేసిన రుణ విభాగం నుంచే అత్యధిక తొలగింపులు ఉన్నట్లు సమాచారం. రూ.50 వేల లోపు రుణాల జారీని ఇటీవల నిలిపివేసింది. ఈ పరిణామంతో వన్ 97 కమ్యూనికేషన్ సూచీ ఇటీవల తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాల్లో వివిధ నూతన టెక్ కంపెనీలు దాదాపు 28,000 మంది ఉద్యోగులను తొలగించాయని లాంగౌజ్ కన్సల్టెంగ్ పరిశోదన సంస్థ అంచనా వేసింది. 2022లోనూ 20వేల పైగా ఉద్యోగులు పోయాయి. 2021లో 4,000 మంది సిబ్బంది రోడ్డున పడ్డారు. నోట్ల రద్దు సమయంలో పేటియంకు ప్రధాని నరేంద్ర మోడీ పరోక్షంగా బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. అలాంటి సంస్థలో ఇప్పుడు వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడుతుంటే కేంద్రం ఏమి పట్టనట్టు ఉండటం విశేషం. గడిచిన నెల రోజుల్లో పేటియం షేర్ విలువ 27.77 శాతం లేదా రూ.246.75 క్షీణించి.. శుక్రవారం సెషన్‌లో రూ.641 వద్ద ముగిసింది.

నైక్‌లోనూ పొదుపు చర్యలు..

గ్లోబల్ స్పోర్ట్స్‌వేర్ దిగ్గజం నైక్ తన వందలాది మంది ఉద్యోగులకు ఎసరు పెడుతోంది. 2020లోనూ 700 మందిని ఇంటికి పంపించింది. తాజాగా సిబ్బందిని తొలగించడం, కొన్ని సేవలలో ఆటోమేషన్‌ను పెంచడం ద్వారా దాదాపు రూ.16వేల కోట్ల పైగా వ్యయాలను ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రిపోర్టులు వస్తున్నాయి. సంస్థాగత క్రమబద్ధీకరణ అవసరానికి అనుగుణంగా ఈ తొలగింపులు చేపడుతున్నట్టు ఆ సంస్థ పేర్కొంది. తొలగిస్తున్న ఉద్యోగులకు చెల్లించే సీవరెన్స్ ప్యాకేజీల కోసం దాదాపు రూ.3,700 కోట్లను కేటాయించనుంది.

అక్రమ నిర్మాణం నిలిపివేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-సంతోష్ నగర్

శంకేశ్వర్ బజార్ నాలా మీద అక్రమంగా చేపట్టిన నిర్మాణ పనులు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలంలో వరద సరూర్ నగర్ చెరువు నుంచి శంకేశ్వర్ బజార్ నాలా మీదుగా మూసీ నదికి వెళ్తొందని, అక్రమ నిర్మాణం కారణంగా సమీప ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టరీత్యా చర్యలు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పాతబస్తీ జాహనుమ సెయింట్ బాయ్స్ టౌన్ స్కూల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో రెవరెండ్ బ్రోథర్ బాయ్స్ టౌన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ యేసు ప్రభరన్, రెవరెండ్ బ్రోథర్ ప్రిన్సిపల్ షౌరెడ్డి, బ్రోథర్ ఏంప, వైస్ ప్రిన్సిపాల్ ఆంథోనీ, మీడియా ఇన్‌చార్జ్ ఓం ప్రకాష్ దిల్లికర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ధూల్ పేట్



సీఎం రేవంత్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

నవతెలంగాణ-సంతోష్‌నగర్

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని పాదయాత్ర భాగంగా కాలనీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలు మాలలు వేసి ఘనంగా సన్మానించారు.భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యేకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

- లతమ ఫౌండేషన్ చైర్మెన్ కొంపాల మాధవిలత

నవతెలంగాణ - ధూల్‌పేట్

వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని లతమ ఫౌండేషన్ చైర్మెన్ కొంపాల మాధవిలత అన్నారు. భారత మాజీ ప్రధాని వికాస్ పురుష్ అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి సందర్భంగా రాష్ట్ర బీజేపీ మెడికల్ ఆధ్వర్యంలో, విరించి హాస్పిటల్ సౌజన్యంతో తెలంగాణ సీనియర్ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మైదాన్-ఇ-గదీర్, దారుల్షిఫా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మీర్ చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండు యాదవ్, టి. ఉమా మహేందర్, షఫత్ అలీ ఖాన్‌లతో కలిసి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించి ప్రారంభించారు. మెడికల్ క్యాంపులు పేదలకు ఎంత ఉపయోగపడతాయన్నారు. ఉచిత మెడికల్ చెకప్‌తో పాటు మందులను అందజేశారు.



అయ్యప్ప స్వామి రథయాత్రలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్

శ్రీ వాసవి ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి రథయాత్రలో రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ వైశ్య పేడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్తా పాల్గొని రథయాత్రను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ రథయాత్ర సికింద్రాబాద్ చిలకలగూడ మేడిబావి పోచమ్మ ముత్యాలమ్మ ఆలయంలో జరిగింది. ఈ రథయాత్రలో చాలామంది అయ్యప్ప స్వామి భక్తులు, రాము గుప్త, విజయ్ గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ గుప్తా పాల్గొన్నారు.



నూతన పట్టు వస్త్ర అలంకరణ వేడుకలో మేయర్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సీతా ఎంక్లేవ్ కాలనీలో బండారు యాదయ్య కుమార్తెల నూతన పట్టు వస్త్ర అలంకరణ వేడుకలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, 18వ డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్‌లు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్టమస్ వేడుకల్లో చార్మినార్ ఎమ్మెల్యే

నవతెలంగాణ - ధూల్ పేట్

కానాను ఫెలోషిప్ వర్షిప్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పురాణా ఫుల్ పార్టీ గార్డెన్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓల్డ్ సిటీ చార్జెస్ కన్వీనర్ బుర్ర గళ్ళ ఆనందం ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జూల్ఫికర్ అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ కానుకలను అందజేశారు. క్రీస్తు జననం గురించి పాస్టర్ ఆనందం వివరిస్తూ శాంతి, సమాధానం, సంతోషం ప్రేమను పంచటానికి ఏసుక్రీస్తు ప్రభువు ఈ భూలోకంలో జన్మించాడన్నారు. ప్రపంచం మొత్తం క్రీస్తు జననం క్రిస్మస్‌ను నిర్వహించుకుంటున్నారని తెలిపారు. చార్మినార్ నియోజకవర్గంలోని పురానాపూల్ డివిజన్ ప్రజలకు పెద్ద ఎత్తున క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల క్రిస్టఫర్, బాలరాజ్, ఇజ్రాయిల్, లలితమ్మ, బీఆర్ఎస్ నాయకుడు ఇలియాస్ ఖురేషీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'ఆమె'కు రక్షణగా షీ టీం

- పోకిరీలకు వణుకు పుట్టిస్తున్న షీ టీమ్స్..
- 'రాచకొండ' పరిధిలో ఈ ఏడాది 231 మంది ఆకతాయిలు జైలుకు..





నవతెలంగాణ-హాయత్ నగర్

మహిళల రక్షణ కోసం రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ షీ టీమ్స్ దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. మహిళలకు భద్రత కల్పించడానికి షీ టీమ్స్‌ను రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు మహిళల భద్రత కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయి షీ టీమ్స్.

మహిళల భద్రత పట్ల జీరో టాలరెన్స్ పాలసీ ఈవ్ టీజింగ్ ప్రముఖంగా ఉన్న ప్రదేశాలు, సమయాలను గుర్తించి, ప్లాన్ చేస్తారు. ఆయా ప్రదేశాలపై ఈ బృందాల నిఘా ఉంటుంది. స్టాకర్లను గుర్తించి, సీసీఎస్/ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్ చేస్తారు. అతని కార్యాచరణ షీట్ తయారు చేసి సెంట్రల్ డేటా బేస్‌లో ఉంచుతారు. అతని కార్యకలాపాలు ప్రతిరోజూ పర్యవేక్షించి చట్టంలోని నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తారు. పదేపదే ప్రతికూల నోటీసులు వస్తే కఠిన చర్యలు (నిర్భయ చట్టం) తీసుకుంటారు. అలాగే బాధితుల పేరు గుర్తింపు గోప్యంగా ఉంచుతారు. బాధితులు ఫిర్యాదులు చేసేందుకు 100 హెల్ప్ లైన్‌గా ఉంటుంది. ఇప్పటికే ఫీల్డ్‌లో ఉన్న షీ టీమ్‌లు వారి స్వంతంగా వ్యవహరించడంతో పాటు కాల్ అందుకున్న వెంటనే చర్యలు తీసుకుంటారు.

ఈ మేరకు రాచకొండ కమిషనరేట్‌లో షీ టీమ్ బృందాలు ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాయి. మహిళలపై లైంగిక వేధింపులు, లైంగిక వేధింపుల వల్ల ఎదురయ్యే పరిణామాలు, బహిరంగ ప్రదేశాల్లో, రాకపోకలు, పని ప్రదే శాల్లో మహిళల రక్షణకు ఉన్న కఠిన చట్టాల గురించి పురుషులకు కూడా తెలియజేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

షీ టీమ్స్ పనితీరు - క్రైమ్ అనాలిసిస్ ఫ్యూచర్ టాస్క్‌లు

ఈవిటీజింగ్‌ను అన్ని కోణాల్లో, అన్ని రకాలుగా అరికట్టడం, సమాజంలో మహిళలకు భద్రత కల్పించడం, మహిళా చైతన్యానికి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం, తద్వారా మహిళల్లో విశ్వాసాన్ని పెంపొందించడం వంటి లక్ష్యంతో రాచకొండ కమిషనరేట్‌లో షీ టీమ్‌ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. షీ టీమ్స్ ఇప్పుడు ప్రతీ చోట విస్తరించి ఉన్నది.విమెన్ సేఫ్టీ వింగ్ సహకారంతో ఆర్టీసీ బస్సుల్లో,బస్టాండ్ ల్లో,మెట్రో రైల్లో ఇలా ప్రతి చోట మహిళ కానిస్టేబుళ్లు ఉంటూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి కమిషనరేట్ పరిధిలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్న ఆకతాయిలను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో భూమిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇస్తుంటారు. గత ఏడాది రాచకొండ మొత్తం 208 కేసులు నమోద య్యాయి. పెట్టి కేసులు 223 కాగా కౌన్సెలింగ్ 167 మందికి ఇచ్చారు. అందులో మైనర్లు 370మంది ఉండడం గమనా ర్హం. 208 మంది జైలుకు వెళ్లారు. అదేవిధంగా ఈ ఏడాది 231 కేసులు నమోదవ్వగా 576 పెట్టి కేసులు, 643 మంది కౌన్సెలింగ్, మొత్తం 1450మంది ఉండగా అందులో ప్రధానంగా 1053మంది మైనర్లు ఉండడం గమనార్హం. అందులో 231 మంది జైలుకు వెళ్లారు. రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు నిరంతరం షీ టీమ్స్ సిబ్బంది సోషల్ మీడియాలో మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామంటున్నారు.

ధైర్యంగా షీ టీంకు ఫిర్యాదు చేయండి



ఎక్కడైనా సరే పోకిరీలు వేధిస్తే వెంటనే రాచకొండ వాట్సప్ మొబైల్ నెంబర్ 871266 2111కు లేదా,100కు బాధితులు పిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అందుకే బాధితులు ధైర్యంగా పిర్యాదు చేయడానికి జంకవద్దు. సమాజంలో మహిళలపై, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా కాపాడేందుకు షీ టీం ఉంది. షీ టీంతో ప్రతీ మహిళ స్వేచ్ఛగా బయట తిరగగలుగుతుంది.

- డీసీపీ ఉషా విశ్వనాథ్

పట్టా పొలంలో రోడ్డు వేయొద్దంటూ రైతుల ఆందోళన



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో తమ పట్టా పొలంలో నుంచి ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు వేయొద్దంటూ గ్రామ నక్ష ప్రకారమే రోడ్డు వేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఇంజాపూర్ నుంచి తొర్రుర్ వెళ్లే రోడ్డు కొంత మేర తన పట్టా పొలం నుండి వెళ్లిందంటూ రైతు బొక్క గోపాల్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయస్థానం ఇరు గ్రామాల మధ్య ఉన్న నక్ష మార్గంలోనే బీటీ రోడ్డు వేయాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చిందని గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్ అండ్ బి అధికారులు ఈఈ శ్రవణ్ ప్రకాష్, డీఈఈ వేణుగోపాల్ రోడ్డు పనులు చేయడానికి సిద్ధం కాగా రైతులు బొక్క గోపాల్ రెడ్డి, పిట్టా సుదర్శన్ రెడ్డిలు అడ్డుకున్నారు. నక్ష రోడ్డు తన పట్టా భూమిలో నుంచి వెళ్లిందని తన భూమిలో నుంచి రోడ్డు వేయరాదని మరో రైతు పిట్టా సుదర్శన్ రెడ్డి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఇరు గ్రామాల మధ్య నక్ష మార్గం పూర్తిగా సర్వే చేసి రోడ్డు వేయాలని వారు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఇరు వర్గాల రైతులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు కలుగ చేసుకొని ఎలాంటి వాదనలు తీవ్రం కాకుండా సముదాయించారు.దీంతో నక్ష మార్గం తేలిన తర్వాతే రోడ్డు పనులు చేపడుతామని అధికారులు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు





నవతెలంగాణ-సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీ పరిధిలోని గల బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ్ డాక్టర్ ఆర్. భీముడు నాయక్, పాస్టర్ అసోసియేట్ రేవ్ ఆర్. మంజుల నాయక్ ఆధ్వ ర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ముజాఫర్ హు స్సేన్ మేరాజ్,కార్పొరేటర్ ఎండీ ముజాఫర్ హుస్సేన్‌తో కలిసి పాస్టర్ క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. క్యాండిల్ లైటింగ్ ప్రోగ్రామ్, కేక్ కటింగ్ అత్యంత వైభవంగా నిర్వహించారు. పాస్టర్ ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డితోనే అభివృద్ధి సంక్షేమ పథకాలు సాధ్యమన్నారు. అన్ని పండుగలను ఆనందంగా జరుపుకోవాలని, రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలవాలని అన్నారు స్థానిక ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రేవ్ కే. వెంకటేష్ పాల్, అధ్యక్షులు వి. భాస్కర్, సెక్రెటరీ కె. ప్రకాష్, ట్రెజరర్ జె. ప్రవీణ్ రాజ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ వేడుకల్లో భాగంగా చర్చిలో ప్రార్థనలు ఘనంగా జరిగాయి. స్థానిక నాయకులు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



దాశరథి శతక పద్య పోటీల విజేతలకు బహుమతులు



నవతెలంగాణ-కల్చరల్

శ్రీరామ నామ ప్రచార సంస్థ నిర్వహణలో నారాయణ గూడలోని మాడపాటి హనుమంతరావు ప్రభుత్వ పాఠశాల, నల్లకుంటలోని వామాక్షి విద్య నికేతన్‌లో విద్యార్థీ విద్యార్థినులకు దాశరథి శతకం పద్యాల పోటీలు నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో అధ్యక్షుడు రెండు పాఠశాలల్లో విజేతలు అనూష, సుందూజ,హైమవతి, తన్మయి, మనస్విని, రేణు శ్రీలకు బహుమతులు అందజేశారు. అలాగే పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రాముని లక్షణాలు పట్ల అవగాహన కలిగిస్తే ఉత్తమ కుమారులుగా, పౌరులుగా, ప్రజా పాలనలో నిజాయితీ వంటి మంచి సుగుణాలు అలవడతాయని అన్నారు. పీ.వీ. సూర్యనారాయణ, లక్ష్మి అరుణ తదితరులు పాల్గొన్నారు

చేవెళ్ల పార్లమెంట్ టికెట్ రంజిత్ రెడ్డికే



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.

నవతెలంగాణ-బడంగ్ పేట్

చేవళ్ళ పార్లమెంట్ టికెట్ మళ్లీ జీ.రంజిత్ రెడ్డికే కేటాయించనున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పార్లమెంట్ ప్రజా ప్రతినిధులు, నాయకులను సమన్వయం చేసుకుంటూ మరోసారి భారీ మెజారిటీతో గెలవాలని బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్ సూచించినట్టు తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ సన్నాహాక సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, అరికేపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు కే. మహేష్ రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్‌కే సాధ్యమైద న్నారు.రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేసిన ఘనత ఆయన సొంతమన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుక రావటం జరిగిందన్నారు.

మనిషి జీవన ప్రమాణాలు పెంచేది వైద్యం, ఆరోగ్యమే

- కాంటినెంటల్ హాస్పిటల్‌లో ఆటా హెల్త్ సెమినార్‌లో వక్తలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మనిషి జీవన ప్రమాణాలు పెంచేది వైద్యం, ఆరోగ్యమేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా), కాంటినెంటల్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన ఆటా హెల్త్ సెమినార్‌కు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖ వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ గవర్నమెంట్ అంబాసిడర్ డాక్టర్ చింతపల్లి రాజశేఖర్ ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ.. అమెరికాలో తెలుగు వారి కోసం పోరాడుతున్న సంస్థగా ఆటా మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ఆటా ఆధ్వర్యంలో వైద్య పరంగా ఇలాంటి సెమినార్‌ను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అమెరికాలో స్థిరపడ్డాగానీ తమను పెంచి పెద్ద చేసిన తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలతో తమ వంతు పాత్ర పోషించడం మంచి విషయం అన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆటా పాలుపంచుకుని అమెరికాకు వెళ్ళే విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ.. పౌరుల ప్రాథమిక హక్కు వైద్యం, ఆరోగ్యమే అన్నారు. తమ ఆటా ప్రాధాన్యతల్లో వైద్యం, ఆరోగ్యమే ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఆటా సేవా కార్యక్రమాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న కార్యక్రమాల్లో వైద్యం, ఆరోగ్యానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం, దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం చేయడం తమకు గర్వంగా ఉందన్నారు. ఈ సెమినార్‌లో మానవుల్లో ప్రస్తుతం వస్తున్న గుండె వైద్య సమస్యలపై అమెరికా అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ట్రెజరర్ శ్రీనీ గంగాసాని, గ్యాస్ట్రో వైద్య సమస్యలపై డాక్టర్ గురు ఎన్.రెడ్డి, అంకాలజీ వైద్య సమస్యలపై డాక్టర్ ఏవీఎస్ సురేష్, క్యాన్సర్ వైద్య సమస్యలపై డాక్టర్ నోరి దత్తాత్రేయులు, షుగర్, బీపీ వైద్య సమస్యలపై డాక్టర్ సునీల్ ఏపురి, ఆర్థోపెడిక్ సమస్యలపై డాక్టర్ శ్రీనివాస్ గడ్డికొప్పుల, మానసిక వైద్య సమస్యలపై డాక్టర్ బి.ఆనంద్, ఆర్థరైటిస్ వైద్య సమస్యలపై డాక్టర్ సునీత కళ్యాణి తమ భావనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటా వేడుకల కో- చైర్మెన్ వేణు సంకినేని, ఆటా ట్రెజరర్ సతీష్ రెడ్డి, ఆటా సెక్రెటరీ రామకృష్ణారెడ్డి అల, ఆటా పాస్ట్ ప్రెసిడెంట్ పరమేష్ భీమ్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్ రవీందర్ గూడూరు, ఆటా కన్వెన్షన్ కన్వీనర్ కిరణ్ రెడ్డి పాశం, ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కో-ఆర్డినేటర్ సాయి సుదీని, మీడియా కో-ఆర్డినేటర్ ఈశ్వర్ బండా, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సబిత



నవతెలంగాణ-చైతన్యపురి

మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, ఆర్కే పురం డివిజ న్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి, సాజిద్, వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
మంగళవారం | డిసెంబర్ 26, 2023 | www.navatelangana.com

లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్న మేడ్చల్ మాజీ కలెక్టర్ ఎంవీ రెడ్డి దంపతులు



నవతెలంగాణ-కీసర

చీర్యాల గ్రామంలోని లక్ష్మీ నృసింహ స్వామి వారిని మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ఎంవీ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నా రు. వారికి ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, వేద పండితుల తో కలిసి పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ రెడ్డి నగర్ సంక్షేమ సంఘం సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-కాప్రా

కేఎల్ రెడ్డి నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పల్లా మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డిలను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం వార్డు ఆఫీస్‌లో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితురాలికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

ఏస్‌రావు నగర్ డివిజన్‌కు చెందిన ఆర్య వైశ్య సంఘం నాయకుడు వెంకట హరి వాళ్ల భార్య భవాని బైక్ మీద నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాధితురాలి ఇంటికి వెళ్లి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రహీం, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.10 వేల సాయం అందజేత



నవతెలంగాణ-కీసర

ఓ నిరుపేద ఇంటి నిర్మాణానికి నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. రాంపల్లి దాయరలో నివాసముంటున్న సీ.ఎల్లమ్మ ఇంటి నిర్మాణం చేస్తుండడంతో ఆమెకు తన వంతు సహకారంగా నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే గెలుపు తథ్యం

- కరాటే మాస్టర్ రవి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అన్నింటా విజయాలు సాధిస్తారని, కరాటే మానసిక, శారీరక ధృఢత్వానికి ఎంతో దోహదపడుతుందని కరాటే మాస్టర్ రవి అన్నారు. సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జవహర్ నగర్ కార్పొరేషన్‌కు చెందిన కళాశాల విద్యార్థిని కె. హరితయాదవ్ పాల్గొని తృతీయస్థానం సాధించి బ్రౌన్ మెడలు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా మాస్టర్ రవి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గెలిచిన హరితాయాదవ్‌కు జవహర్ నగర వాసులు అభినందనలు తెలిపారు.

న్యూయో లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో లెప్రసీ కాలనీ వాసులకు రగ్గుల పంపిణీ



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో న్యూయో లైఫ్ సంస్థ ద్వారా పేద ప్రజలకు శ్రీలక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ అధ్యక్షుడు కే.కే.చారి అధ్యక్షతన సోమవారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మెంబర్స్ మన్నే జ్యోతి మాట్లాడుతూ.. చాలా ఏండ్లుగా న్యూయో లైఫ్ సంస్థ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తుందన్నారు. దానిలో భాగంగానే లెప్రసీ కాలనీ వాసులకు చలికాలంలో ఇబ్బందులు పడుతారనే ఆలోచనతో రగ్గులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బట్టలు, రేషన్‌కు ఇతర అవసరాలు ఉంటే తమను సంప్రదించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీలక్ష్మీ నరసింహా కాలనీ అధ్యక్షుడు కే.కే.చారికి, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు కెకె చారి న్యూయో లైఫ్ సంస్థ ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ సభ్యులు మంద లక్ష్మీ నారాయణ, శంకర్, బ్రహ్మం, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

రాఘవేంద్ర నగర్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీకాంత్, హరీశ్, కట్ట బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిర్యాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వరకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర



నవతెలంగాణ-కాప్రా

సాయిమల అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శ్రీ సాయి అయ్యప్ప సేవా ట్రస్ట్, మకరజ్యోతి అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో కమలానగర్ అయ్యప్ప స్వామి టెంపుల్ మీదుగా చిర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వరకు లోక కల్యాణార్థం అయ్యప్ప స్వాములు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర వల్ల అయ్యప్ప స్వాములకు శబరిమల యాత్రలో పెద్ద పాదం అనుభూతి కలుగుతుందనీ, 16 ఏండ్లుగా ఈ పాదయాత్ర యాదగిరిగుట్ట, కీసరగుట్ట, ఘట్కేసర్, సాయి దామం, పలు దేవాలయాలకు నిర్వహిస్తున్నారు. ఈ పాదయాత్రలో గురు స్వాములు రేగళ్ల సతీష్ రెడ్డి, కూరెల్లి సంతోష్ గౌడ్, అయ్యప్ప స్వాములు శశిధర్ రెడ్డి, రాము గౌడ్, సాయి, అశిరెడ్డి, కిరణ్, శ్రీను, రమేష్ నాయక్, గోవిందరావు,వెంకట్ రెడ్డి, సతీష్, చంద్రశేఖర్, కుమార్, మురళి, రవి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కీసరలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి.



కాప్రాలో క్రిస్టియన్ మహిళలు, చిన్నారులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

- వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు
- కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

నవతెలంగాణ-కీసర

క్రీస్తు బోధనలు సమస్త ప్రపంచానికి సదా ఆచరణీయమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి నగర్‌లో తెలంగాణ ఉద్యమ కారుడు, పాస్టర్ దయాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడు కలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమ, దయ, శాంతి మార్గాలను కాపాడాలన్నారు. క్రీస్తు జన్మదినం సర్వ మానవాళికి పవిత్రదినం అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, దమ్మాయి గూడ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ దమ్మాయిగూడా మున్సిపాలిటీ అధ్యక్షుడు కౌకుంట్ల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు క్యాసారం అశోక్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కాప్రాలో..

క్రిస్మస్ సందర్భంగా టీచర్స్ కాలనీ బెథనియా చర్చిలో పాస్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, క్రైస్తవులు, పాస్టర్లు పాల్గొన్నారు.

వీఆర్ కాలనీలోని మినీస్ట్రీస్ చర్చిలో..

క్రిస్మస్ సందర్భంగా వీఆర్ కాలనీలో పవర్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు కార్పొరేటర‌ బొంతు శ్రీదేవియాదవ్ హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి మానవుడిలో ప్రేమ, క్షమాగుణం ఉండాలన్నారు. యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు.

క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. నాచారం, మల్లాపూర్ డివిజన్లలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడుతూ.. ప్రతి మానవుడిలో ప్రేమ, క్షమగుణం కలిగి ఉండాలనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణీయం అని ఆయన చెప్పారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణామయుడని పేర్కొన్నారు. శాంతియుత సమాజ స్థాపనకు తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లురి అంజయ్య, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చయ్య, ఫిరోజ్ పాల్గొన్నారు.

హనుమాన్ నగర్ చర్చిలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

హనుమాన్ నగర్‌లోని పవర్ ఆఫ్ హెవెన్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విలియం, ఎస్తేరు రాణి, గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభు ఆశీస్సులు ప్రజలపై ఉండాలి : కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

ఉప్పల్‌లో..

ఏసు ప్రభు ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఉప్పల్, చిల్కానగర్ డివిజన్లలోని ఏజీ, జేసీపీసీ మినిస్ట్రీస్ చర్చిలలో నిర్వహించిన వేడుకలకు కార్పొరేటర్ గీతాప్రవీణ్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ, క్రిస్టియన్లకు పెద్ద పీఠం వేసిందన్నారు. ప్రతి క్రిస్మస్‌కు పేద క్రిస్టియన్లకు గిఫ్ట్‌లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు జీకే బాబు, పాస్టర్ ప్రభాకర్, ఆనంద్ పాస్టర్, బీఆర్ఎస్ నాయకులు రత్నం, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, రామానుజన్, రవీందర్ గౌడ్, పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ మండల పరిధిలోని వివిధ చర్చిలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ యూత్ మాజీ అధ్యక్షుడు పీఆర్. లక్ష్మణ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఎల్లమ్మ తోటలోని మిరాకిల్ చర్చిలో టీఎస్ ట్యూషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ శేఖర్, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, నవీన్ యాదవ్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మేడ్చల్‌లో క్రిస్మస్ గిఫ్టులు అందజేస్తున్న నాయకులు



కాప్రాలో మాట్లాడుతున్న బొంతు శ్రీదేవియాదవ్



కేక్ కట్ చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

మనుస్మృతి ప్రతులు దహనం



నవతెలంగాణ-కాప్రా

1927 డిసెంబర్ 25వ తేదీన మహద్ పోరాటంలో భాగంగా నిచ్చెన మెట్ల సంస్కృతికి కారణమైన మనుస్మృతిని అంబేద్కర్ దహనం చేసిన రోజు సందర్భంగా సోమవారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతులను తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అనంతరం ప్రముఖ సామాజిక కార్యకర్త, భారత నాస్తిక సమాజం నాయకులు రషీద్ ద్రావిడ మాట్లాడుతూ.. మనుధర్మ శాస్త్రం అగ్రకులాలకు అనుకూలంగా ఉంటూ బ్రాహ్మణీయ భావజాలంతో ప్రజలను బానిసలుగా చేసిందన్నారు. ఇదంతా దేవుడే సృష్టించాడని నమ్మించి స్వయం బానిసత్వానికి పురికొల్పారని తెలిపారు. దీంతో శూద్రులు బానిసలుగా మారిపోయారని చెప్పారు. అతిశూద్రుల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలను అంటరాని వారిగా చాలా దుర్మార్గంగా అణిచివేశారని పేర్కొన్నారు. మహద్ పోరాటంలో ఆంగ్లేయులు అందరికీ నీటి మీద హక్కు కలిగి ఉందని చెప్పినా సనాతన వాదులు అడ్డుకొని చెరువు నీటిని తాకనీయకుండా చేశారని గుర్తు చేశారు. కానీ న్యాయపోరాటం కూడా చేసి చివరకు మనుస్మృతిని తగలబెట్టి ప్రజలకు సనాతన వాదుల దుర్మార్గాలను 97ఏండ్ల క్రితమే పోరాటం ద్వారా చూపించారని చెప్పారు. కోమటి రవి మాట్లాడుతూ సామాజిక చైతన్యం కలిగినప్పుడే దేశం పురోగమిస్తుందన్నారు. నేటి పాలకులు తిరిగి మనువాదాన్ని మన రాజ్యాంగం స్థానంలో తీసుకురాటానికి ప్రయత్నిస్తున్నారని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. ఏఆర్‌కెఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్ సోమయ్య మాట్లాడుతూ ప్రజా చైతన్యంతో ముందుకు సాగాలని, ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భారత నాస్తిక సమాజం నాయకులు సిద్ధార్థ, టీపీఎఫ్ నాయకులు రాంబాబు ప్రసంగించారు. సావిత్రి బాయిపూలే మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సావిత్రి మాట్లాడుతూ.. మహిళలను పూర్తిగా శూద్రులుగా ఉంచి మగవాడికి బానిసగా మార్చారని తెలిపారు. స్త్రీ స్వాతంత్ర మర్హతి అని చెప్పి చివరికి చదువు కూడా లేకుండా చేశారని, దానికి వ్యతిరేకంగా మనువాదాన్ని తగులు పెట్టాలని చెప్పారు. అనంతరం ఈసీఐఎల్ చౌరస్తాలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. మనువాదం నశించాలి, భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గొడుగు యాదగిరిరావు, రషీద్, రాంబాబు, సంపత్ సోమయ్య, సిద్ధార్థ, సావిత్రి, కోమటి రవి, ప్రసాద్ బాబు, గోవిందరావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఉప్పల్

భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలు రామంతాపూర్‌లో సోమవారం బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెన్సార్ బోర్డు మెంబర్ జగదీష్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సంకోరి కుమార స్వామి, నారాయణదాసు, పర్వవేద వెంకటేశ్వర్, వెంపటి శ్రీనివాస్, దయానందరెడ్డి, ఉపేందర్ యాదవ్, అంజయ్య, పటేల్ రవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

విజయ నేత్రాలయ కంటి ఆస్పత్రిని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి



నవతెలంగాణ- బోడుప్పల్

ఉప్పల్ డిపో కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ నేత్రాలయ కంటి ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సేవా దృకథంతో వైద్యసేవలు అందించాలన్నారు. అధునాతన వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో విజయ నేత్రలయ కంటి ఆస్పత్రిని నెలకొల్పడం హర్షణీయం అన్నారు. ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ సుష్మా రెడ్డి, డాక్టర్ మేకల మధుసూధన్ రెడ్డి లు మాట్లాడుతూ అధునాతన పరికరాలతో ఉప్పల్ డిపో పరిధిలో ఎక్కడా లేని విధంగా విజయ నేత్రలయ కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ అర్సీ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, పద్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మధుకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సాయి కిరణ్ రెడ్డి , ఆస్పత్రి డాక్టర్లు సుష్మా రెడ్డి, డాక్టర్ మధుసూధన్ రెడ్డి, , ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండల కేంద్రంలోని రాజీవ్ రహదారి ప్రక్కన ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు గుడి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడి అమ్మవారి ఆభరణాలు, సుమారు రూ.5 లక్షలు విలువచేసే వెండి, బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం తెలిపారు.

సాయి గీతా ఆశ్రమంలో రుద్రహెూమం



నవతెలంగాణ- శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ దేవరయంజాల్ పరిధిలోని సాయి గీతా ఆశ్రమంలో పరమ పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ సాయికుమార్‌జీ ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు 59వ సర్వదోష నివారణ మహాయజ్ఞం నిర్వహించబడుతుందని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా మొదటి రోజు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో రుద్ర హెూమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ హెూమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి

మంగళవారం | డిసెంబర్ 26, 2023 | www.navatelangana.com

హిందు, ముస్లింలు సోదర భావంతో మెలగాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్, అంబేద్కర్ నగర్ పరిధిలోని దర్గా వద్ద నిర్వహించిన గందోత్సవం వేడుకలకు హాజరై ముస్లింలతో కలిసి ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాబ్ భాయి, శ్రీనివాస్, బోనాల చిన్నగౌడ్ బిలాల్ చందు,ఇమ్రాన్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయ్ 99 వ జయంతిని సోమవారం మౌలాలి డివిజన్‌లోని ఓల్డ్ సఫిల్ గూడ దర్గా దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ మాట్లాడుతూ..వాజ్ పేయ్ విలువలతో కూడిన రాజకీయం ఎలా చేయాలో మాకు నేర్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్ర శేఖర్ యాదవ్, మౌలాలి డివిజన్ అధ్య క్షుడు సాయిబాబు, సీని యర్ నాయకులు వాసు దేవరావు, మల్లారెడ్డి, మహేష్, ఉపేందర్, ఫణి, శివ గౌడ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.626

ఆర్థిక సాయం అందజేసిన బండి రమేష్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న 8 సంవత్సరాల చిన్నారి గిరిధర్ కృష్ణ , తండ్రి మధుసూదన్ రావు కూకట్ పల్లి నియోజకవర్గంలోని తులసి నగర్‌లో నివాసం ఉంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారున్ని వైద్యం కోసం ఆసుపత్రిలో చూపించలేక తండ్రి మధుసూదన్ రావు ఇబ్బంది పడుతున్నాడు. కూలి పని చేసుకుని జీవనం సాగించేవాడు. తన కుమారుడికి ఒక్కసారిగా పెద్ద జబ్బు రావడంతో, దిక్కుతోచని స్థితిలో ఉన్న మధుసూదన రావు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆశ్రయించారు. తన కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయాన్ని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి బండి రమేష్ సేవా సంస్థ తన ట్రస్టు ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మియాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం మధుసూదన్ రావుకు చెక్కును అందజేశారు. సతీష్ రెడ్డి, ముక్తార్, అందే శ్రీరామ్మూర్తి, ముఖేందర్ రెడ్డి, లక్ష్మయ్య, జోగు కృష్ణ, మల్లేష్, సంతోష్, అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం



- కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన జగద్గిరిగుట్ట ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ప్రజాసేవకే నా జీవితం అంకితమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధి మగ్దూంనగర్‌లోని కార్పొరేటర్ నివాసం వద్ద కుటుంబ సభ్యులు, అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు, సన్నిహితుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి, శివపార్వతుల ఆశీస్సులతో జగద్గిరిగుట్ట ప్రాంత ప్రజల దీవెనలతో మూడుసార్లు హ్యాట్రిక్ కార్పొరేటర్‌గా గెలిచానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు, స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌లు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌ను కార్పొరేటర్ కొలుకుల జగన్ వారితో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్య నారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లగోపుల బాబు గౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా శ్రీహరి గౌడ్, యువజన విభాగ అధ్యక్షులు రాయి విగ్నేష్, కుటుంబ సభ్యులు కొలుకుల సత్యనారాయణ, కొలుకుల లక్ష్మి, కొలుకుల శశికళ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



వీరశైవ లింగాయత్ సమాజ సంక్షేమానికి కృషి



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వీరశైవ లింగాయత్ సమాజ సంక్షేమానికి కృషి చేస్తానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని వీర శైవ లింగాయత్ సమాజం కార్యాలయంలో సంఘ సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన నూతన సంవత్సర (కాలమాని)క్యాలెండర్ 2024 ను వారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాయత్ కులస్తుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. ఈ ప్రాంత లింగాయత్ కులస్తులకు అండగా ఉంటానని తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు కోనాపురం మల్లికార్జున్ ప్రధాన కార్యదర్శి ఇమ్మాడి వీరేశం, సలహాదారులు బోడపల్లి వీర్ శెట్టి,కోశాధికారి జి.విజయ్ కుమార్, సలహాదారులు బసవరాజ్, పటోళ్ల వీరన్న, మాటూరి మడప్ప, గ్యాస్ శంకర్, ఉల్లిగడ్డల సంగమేశ్వర్, చిప్ప రాములు, గంప సంగమేశ్వర్, లింగాయత్ సమాజం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దివంగత వాజ్‌పేయ్ సేవలు చిరస్మరణీయం



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం వాజ్ పాయ్ జయంతి వేడుకలు గాజులరామారం డివిజన్ పరిధి గాజుల రామారంలోని బీజేపీ క్యాంప్ కార్యాలయంలో బీజేపీ శ్రేణుల మధ్య నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాజ్ పాయ్ గొప్ప మానవతావాది అని పలు సంస్కరణలను రూపకల్పన చేసిన మహనీయుడని కొనియాడారు. దేశంలో రెండు సీట్లు ఉన్న పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత వాజ్ పేయ్ దేదని అన్నారు. అటల్ జీ అందించిన స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి సీటును గెలిచి, ప్రధాని మోడీ మళ్లీ ప్రధాని అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే. శేఖర్ యాదవ్, కొట్టే రాజా సదానందం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండి శ్రీనివాస్, సెన్సార్ బోర్డు సభ్యులు సరితా రావ్, పార్లమెంట్ కోకన్వీనర్ డా. రాజు, జిల్లా నాయకులు బావిగడ్డ రవి, అభిమానులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

క్రిస్మస్ పండుగ సందర్భంగా, పరిపూర్ణ ప్రార్ధన మందిరం వారు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ప్రక్కన క్రిస్మస్ వేడుకలు ఘనంగా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు,పెద్దలు శ్రీ కె.యం.ప్రతాప్ విచ్చేసి, క్రిస్మస్ కేకును కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ క్రిస్మస్ అని ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు లక్షల కోట్ల మంది పాల్గొని పండుగ సంబరాలు జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి క్రిస్మస్ పండుగ వచ్చిందని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆ యేసుక్రీస్తు ప్రార్థిస్తున్నట్లు ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపూర్ణ ప్రార్ధన మందిరం సభ్యులు, క్రిస్టియన్ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: 'స్ప్రింగ్ హిల్స్ మొంటెస్సోరీ ' పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో క్రిస్మస్ ట్రీ, జీసస్‌కు సంబంధించిన డెకరేషన్ చాలా అందంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.అరుణ మాట్లాడుతూ క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డైరెక్టర్ రామ్ దాస్ మాట్లాడుతూ ఈ పండుగ నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణాలను వివరిస్తూ మనకున్న దాంట్లో ఇతరులకు సహాయం చేయడం ప్రేమ, దయా, క్షమా గుణాన్ని నేర్చుకోవడం లక్ష్యంగా పెట్టుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, ఇంద్ర హిల్స్ కాలనీలోని జెరుసలేమ్ ప్రార్ధన మందిర్ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. ఏసుక్రీస్తు గొప్పతనం గురించి ప్రసంగించి, అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు అనిల్ రెడ్డి, పోశెట్టిగౌడ్, పాస్టర్ రెవ ఎమ్.రాజు, మమతరాజ్, చర్చ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట: ఐక్యతతోనే శాంతి సమాజం నెలకొల్పగలమని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గాజులరామారం డివిజన్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో గల "బేతస్త జీసస్ మినిస్ట్రీస్" చర్చిలో పాస్టర్లు కే.సామ్యూల్, కే.మరియమ్మ కే.పాల్ సుధాకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరై ప్రార్ధనలు చేశారు. చర్చి ప్రతినిధులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలతో ఎంతోమంది జీవన సరళిలో మార్పులు వచ్చాయన్నారు. ఈ ప్రాంత క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కే.సునీత, కే.సాయికృష్ణ, కె.విష్ణువర్ధన్ రెడ్డి, కే.నవీన్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నవాబ్ పాషా, సుంకరి చందు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్: ఏసు ప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని బీఆర్ఎస్ నేత, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ నందికంటి శ్రీధర్ సూచించారు. సోమవారం క్రిస్మస్ పండగ సందర్భంగా మౌలాలి డివిజన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఏసు చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో శాం తి, ప్రేమ,దయ మాత్రమే ఉంటాయన్నారు. అహింస, దోపిడీ, పాపం, అన్యా యం అనేవి ఉండబోవన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీ మణులకు క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.



కాన్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాన్పుల విషయంలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. రాష్ట్ర కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నిర్వహించిన సమావేశం అనంతరం డీఎంఅండ్‌హెచ్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ప్రోగ్రామ్ అధికారులకు జూమ్ మీటింగ్‌లో రివ్యూ సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ కేసుకు కాన్పు జరిగిన 14 రోజుల్లో తప్పని సరిగా రెండు పీహెచ్‌సీ చెకప్స్ చేయించాలన్నారు. మొదటి చెకప్‌ను గైనకాలజిస్ట్ అండ్ పెడిట్రీషియన్‌తో, రెండోది వైద్య అధికారులతో చేయించి ఎమ్సిపి కార్డ్, ఎమ్సిహెచ్ కిట్ పోర్టల్‌లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. కేసీఆర్ కిట్ పేరు ఇక నుంచి ఎమ్సిహెచ్ కిట్‌గా మార్చబడిందని తెలిపారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ఇక నుంచి ఎమ్సిహెచ్ న్యూట్రిషన్ కిట్‌గా మార్చినట్టు పేర్కొన్నారు. న్యూట్రిషన్ కిట్‌లో ఐటెమ్స్ పేర్లతో ఉన్న పాంప్లెంట్, కప్‌ను తొలగించాలని ఆదేశించారు. ఎమ్సిహెచ్ కిట్, ఎమ్సిహెచ్ న్యూట్రిషన్ కిట్లు ఇచ్చేటప్పుడు ఒక్క కిట్ తప్ప వేరే ఎలాంటి ఫోటోలు ఉండకూడదని, ఈ విషయంలో ఏమైనా రాజకీయ కాంట్రవర్సీలు ఉంటే వస్తే సంబంధిత ఆరోగ్య అధికారిది, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కోవిడ్ సోకిన గర్భిణీని కాన్పు చేయడానికి ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఒక ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

టీజీఎల్ఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గాదె వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా యార కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామచంద్రారెడ్డి, కోశాధికారిగా పిడమర్తి ఉపేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రజిని, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా యుగంధర్, శ్రీపతి సురేష్, చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా సతీష్, జాయింట్ సెక్రెటరీగా మోతె సమ్మయ్య, హరిబాబు, అనిల్‌రెడ్డి సెక్రెటరీగా నర్సిరెడ్డి, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు గాదె వెంకన్న, యారా కుమారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధిక సంఖ్యలో అడ్మిషన్లు, ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో తీవ్రంగా శ్రమిస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి, అధ్యాపకుల సమస్యలు పరిష్కారం కోసం తమ సంఘం పాటు పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మబ్బు పరశురాం, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబాబాద్ అధ్యక్షులు నరసింహ, విఠల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్‌కి ఘన నివాళులు



నవతెలంగాణ-మేడ్చల్

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ జయంతి సందర్భంగా సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రం రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సముద్రాల కృష్ణ గౌడ్, కౌన్సిలర్ హంసరాణి కృష్ణ గౌడ్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి అర్జున్ బాబు, మహేష్, తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ పట్టణంలోని అటల్ బిహారీ వాజ్ పాయ్ విగ్రహానికి మున్సిపల్ బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మైసరిరాజు, తదితరులు పాల్గొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్ పాయ్ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని వారి ఆశయాలను సాధనకు ప్రధాని మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామ మత్స్యకార సర్టిఫికెట్‌ను మేడ్చల్ జిల్లా డీ.ఎఫ్.సీ.ఎస్.చైర్మెన్ మన్నె రాజు, డీఎఫ్ఓ పూర్ణిమ అందజేశారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బండి



నవతెలంగాణ-బాలానగర్

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొనికూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని రాజుకాలనీ బాలానగర్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి ప్రకాష్ ఆహ్వాన మేరకు సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రేమ భావాన్ని, సేవా తత్పరతను బోధించిన "క్రీస్తు జన్మదినం నేడు యావత్ మానవ జాతికి సంతోషకరమైన రోజు క్రిస్మస్... క్రైస్తవ సోదర, సోదరీమణులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, రాష్ట ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరి గారి ప్రీతమ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పా రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, బి బ్లాక్ అధ్యక్షులు తుము వేణు పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు నర్సింగరావు ఆధ్వర్యంలో,అటల్ బిహారీ వాజ్పాయ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్ పాల్గొని వాజ్పాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ.. భారతదేశంలో సూపర్ పాలన అందించిన ఘనత వాజ్పాయ్‌కి దక్కుతుందన్నారు. నీతి నిజాయితీతో కూడిన పరిపాలన చేశారని తెలిపారు. దేశంలో మౌలిక సదుపాయాలు టెక్నాలజీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొసాకారని, పోఖ్రాన్ అణు బాంబుల తయారితో, భారతదేశం సత్తా ఏంటో ప్రపంచానికి తెలియజేశారని డాక్టర్ నరేష్ పేర్కొన్నారు. అసెంబ్లీ కో కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మనోజ్, బీజేపీ సీనియర్ నాయకులు కేశవరావు, మమత, పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట:
వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ నల్లకుంట డివిజన్ పరిధిలోని డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అమృత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వాజ్‌పేయి జీవితం ప్రతి ఒక్క రాజకీయ నాయకుడికి ఆదర్శమన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ యాదవ్, మహేందర్, లక్ష్మణ్, రామ్ చందర్ గుప్త, పెంటం రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

దేశం నిరంతరం గర్వించదగ్గ నేత వాజ్‌పేయి

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ-అంబర్‌పేట:
వాజ్ పేయి సేవలు ప్రతి ఒక్క భారతీయుడి హృదయాలలో నిలిచిపోయరని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వాజ్ పేయి జయంతి సందర్భంగా డీడీ కాలనీలోని ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో బండారు దత్తాత్రేయ దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాజ్ పేయి దేశ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని బండారు దత్తాత్రేయ అన్నారు. అదే విధంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు మాట్లాడుతూ దేశ సేవలో వాజ్ పేయి నిరంతరం ముందు వరుసలో ఉండేవారని గౌతమ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, అజయ్ కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం మానవాళికి ముక్తిమార్గం



- ఎమ్మెల్సీ కవిత
- సెంటినరీ మెథడిస్ట్ చర్చి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
భాగ్యనగరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవుల చర్చిలు సందడిగా మారాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం అబిడ్స్‌లోని సెంటినరీ మెథడిస్ట్ చర్చిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల సందర్భంగా పాస్టర్‌లు, క్రైస్తవ మతపెద్దలు, బిషప్‌లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. రంగురంగుల దీపాలతో చర్చిలను అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి పెద్దలు, చిన్నారులు చర్చిలకు వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభువు ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు మార్గం మానవాళికి ముక్తి మార్గం అన్నారు. ప్రపంచం మొత్తం ఎంతో ఘనంగా జరుపుకునే గొప్ప పండుగ క్రిస్మస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత రెడ్డి, గన్ ఫౌండ్రీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు మేడే రాజీవ్ సాగర్, శేఖర్ చారి, పెద్ద ఎత్తున పాస్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఇక సాఫీగా నడక..

- సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్
ఫుట్ పాత్ ఆక్రమించి వ్యాపారం నిర్వహించే వారిపై సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పాదచారులు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉస్మానియా దవాఖాన, భర్తన్ బజార్, సిద్ధం బజార్, ఓల్డ్ మోటార్ పార్ట్ దుకాణాల దారి, సుల్తాన్ బజార్, కోఠి బ్యాంక్ స్టేట్ నుంచి ఆంధ్ర బ్యాంక్, డిఎంహెచ్ఎస్ చౌరస్తా, బాటా చౌరస్తా, రాంకోఠి వెళ్లే ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు నేతృత్వంలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఫుట్ పాత్‌పై తమ వ్యాపారాన్ని చెందిన వస్తువులు ఏర్పాటు చేయకుండా చూసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు చిరు వ్యాపారులు పాటించాలని సూచించారు. దీంతో ఎప్పటికీ రద్దీగా ఉండే బాట చౌరస్తా, ఉస్మానియా భర్తన్ బజార్ వెళ్లేదారులు సాఫీగా ట్రాఫిక్ లేకుండా సాగుతుండడంతో వాహన దారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, వ్యాపారులు, చిరు వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తిగా నిలిచిన టీఎన్ సదాలక్ష్మీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-ముషీరాబాద్
తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తిగా నిలిచే టీఎన్ సదాలక్ష్మీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ తొలితరం ఉద్యమ నేత, వర్గీకరణ ఉద్యమ సిద్ధాంత కర్త, మాజీ మంత్రి టీఎన్ సదాలక్ష్మీ 95వ జయంతి వేడుకలు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కార్మిక శాఖ సెక్రటరీ రాణి కుముదిని, జాతీయ ఎస్సీ కమీషన్ మాజీ సభ్యులు కె. రాములు, జాతీయ సఫాయి కర్మచారి కమీషన్ మాజీ సభ్యులు చింత సాంబమూర్తి, మాదిగ మేధావుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, తెలంగాణ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు ఇటుక రాజు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగీతం రాజలింగం, ప్రముఖ రచయిత్రి గోగు శ్యామల, ప్రొ. ఏకు తిరుపతి, టీఎస్ సదాలక్ష్మ తనయుడు డాక్టర్ వంశీతిలక్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్ సదాలక్ష్మీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ టీఎస్ సదాలక్ష్మీ తెలంగాణ ఉద్యమనికి పునాది రాయి లాంటివారని అభివర్ణించారు. సంత్ రవిదాస్ బోధనలను ఆచరించిన మహనీయులు టీఎస్ సదా లక్ష్మీ, టీవీ నారాయణ దంపతులు అని కొనియాడారు. తెలంగాణలో ఉద్యమస్ఫూర్తిగా నిలిచే టీఎస్ సదాలక్ష్మీ విగ్రహాన్ని నెలకొల్పాలని, ప్రతి ఏడాది ప్రభుత్వమే వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని, మాదిగలు మరింత అభివృద్ధి చెందేందుకు మాదిగ భవన్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ మాదిగ ఉద్యమ నాయకులు సంగపాక భాస్కర్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతిని ఆకాంక్షించిన గొప్ప దైవ దూత జీసస్'



- ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్
మానవాళికి మేలుతో పాటు ప్రపంచ శాంతిని ఆకాంక్షించిన గొప్ప దైవ దూత జీసస్ అని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కొనియాడారు. సోమవారం హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్ నేతలు ఉత్సాహంగా ఏసు పుట్టిన రోజును పురస్కరించు కొని కేక్ కట్ చేశారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ క్రిస్మస్ జీవితంలో ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలని కోరుకుంటూ, క్రైస్తవ సోదరులకు పండగ శుభాకాంక్షలను తెలిపి, క్రిస్మస్ గొప్ప తనాన్ని అలాగే కరుణా మయుడైన యేసు ప్రభువు లోక రక్షకుడు, శాంతి మార్గాన్ని ప్రబోధించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. అన్సారీ, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, ఆర్థిక కార్యదర్శి శ్రీకాంత్, దివ్యంగా విభాగం అధ్య క్షులు దర్శనం రమేష్, యువజన విభాగం అధ్యక్షులు సర్దార్ రణధీర్ సింగ్, నేత లు శ్రీనివాస్ రెడ్డి, మౌనిక, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాల ద్వారా విద్యా రంగంలో రాణించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్
రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఇతర అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ విద్యా రంగంలో రాణించాలని పలువురు వక్తలు అన్నారు. శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శాలివాహన విద్యార్థులకు పురస్కారాల ప్రధానం, 2024 డైరీ ఆవిష్కరణ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి శంకర్ ప్రజాపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాణ రంగ నిపుణులు గుమ్మడిదల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావులు హజరై ప్రసంగించారు. శాలివాహనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలం టే అంతకంటే ముందు విద్యా రంగంలో రాణించాలన్నారు. విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారానే మిగతా రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరేందుకు ప్రధాన భూమిక అవుతోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి విజయ్, మాజీ అధ్యక్షులు దశరథ్, మాజీ ప్రధా న కార్యదర్శి క్షీరసాగర్, ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ రాం మోహన్, నరసింహరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'భారత సమాజాన్ని కులాలు, వర్ణాలుగా విభజించారు'

ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి పత్రుల దహనం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
భారత సమాజాన్ని కులాలు, వర్ణాలుగా విభజించి అగ్రవర్ణాలు మాత్రమే ఈ దేశంలో పాలకులుగా ఉండటానికి కుట్రపన్నారని వివిధ సంఘాల నేతలు ఆరోపించారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1927 డిసెంబర్ 25న మనుస్మృతిని తగలబెట్టిన సందర్భంగా సోమవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట మనుస్మృతి పత్రులను దహనం చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు ప్రగతిశీల మహిళా సంఘం నేత సంధ్య దళిత మహిళా సంఘం నేత బి.ఎన్.రత్న మాట్లాడుతూ సమాజంలో కొన్ని కులాలు మాత్రమే పాలకులుగా ఉండడానికి ఉపయోగపడుతున్న మనుస్మృతిని ప్రతిఒక్కరూ వారి మనసుల్లోనే దహనం చేయాలని సూచించారు. సమాజంలో సమానత్వం రావాలంటే మనువు భావ జాలాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. అప్పుడే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని, దీని కోసం దేశభక్తి కలిగిన ప్రతిఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు. మహిళల హక్కులను మను ధర్మ శాస్త్రం నిరాకరించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మెన్ బాలకృష్ణ, డీబీఎఫ్ నేత పి.శంకర్, వివిధ సంఘాల నాయకులు ఎం.నర్సింగరావు, వెంకటస్వామి, మాధవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

'గెమ్యా తండాను గ్రామ పంచాయతీగా చేయాలి'

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్
నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని గెమ్యా తండా'ను గ్రామ పంచాయతీగా చేసే విధంగా జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గెమ్యా తండా కనీసం త్రాగడానికి మంచినీరు, ప్రభుత్వ ఆస్పత్రికి నోచుకోలేదని, ఆ తండాలో జీవనాధారం లేక గత కేసిఆర్ ప్రభుత్వ పాలనలో తండా ను ఖాళీ చేసి హైదరాబాద్‌లోని బస్తీల్లోకి వలస వచ్చారని ఆరోపించారు. గత 40 ఏళ్లుగా సాగులో ఉన్న పట్టా భూములను గత ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అక్కడి రైతులు జీవనోపాధి లేక ఆకలికేకలతో ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెమ్యా తండాను గ్రామ పంచాయితీగా మార్చి ఆ గ్రామాన్ని రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి దత్తత తీసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణరావు నుండి తాండా భూములు కాపాడాలని కోరారు. ఆ గ్రామం నుండి కేవలం 1 కిలో మీటర్ దూరంలో ఉన్న కృష్ణ నది జలాలను త్రాగడానికి నీరు అందించాలని, వ్యవసాయ సాగు, వెనుకబడి ఉన్న గిరిజన తెగ నిరుద్యోగ యువతకు ఐటీడీఏ సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



నవ తెలంగాణ - ముషీరాబాద్
స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రోడ్డు పక్కన జీవిస్తున్న అనాధలు అభాగ్యులు చిన్నారులు క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలంతా సుఖ శాంతులతో జీవించాలన్నదే ఏసు ప్రభువు అభిమతం'

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి



నవతెలంగాణ-హిమాయత్ నగర్
లోకంలోని ప్రజలంతా సుఖ శాంతులతో జీవించాలన్నదే ఏసు ప్రభువు అభిమతమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయ రెడ్డి అన్నారు. సోమవారం నారాయణగూడ వైఎంసీఏలోని బాపిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పి.విజయరెడ్డి పాల్గొని, కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు, క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పి.విజయరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రజలందరూ అనుసరించి శాంతి, ప్రేమతత్వాన్ని అలవర్చుకుని సమాజంలో నడుచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ సామెల్, డేవిడ్ ప్రశాంత్, గోనె సాల్మన్ రాజ్, పలువురు పాస్టర్లు, రెవరెండ్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసోజు నాగభూషణం చారి, సీనియర్ నాయకులు, బిక్షపతి, పత్తి అనిల్ కుమార్, కృష్ణ, రామచంద్ర ముదిరాజ్, రామచంద్ర గుప్తా, శ్రవణ్ కుమార్, దయాకర్ యాదవ్, మనోజ్ యాదవ్, హారతి, ఎస్ఎస్సి రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

'ప్రేమ, శాంతి, ఐక్యతే క్రిస్మస్ సందేశం'



- నారాయణగూడ వైఎంసీఏ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రీస్టలీ గియూస్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్
ప్రేమ, శాంతి, ఐక్యతే క్రిస్మస్ సందేశమని నారాయణగూడ వైఎంసీఏ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రీస్టలీ గియూస్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం నారాయణగూడలోని వైఎంసీఏ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరూ కేక్ కట్ చేసి, ప్రార్థనలు చేశారు. అనంతరం రెవరెండ్ మిచ్చాల్ కోలా గావాతో కలిసి ప్రీస్టలీ గియూస్ మాట్లాడుతూ దేవుడు తన కుమారుడైన యేసు ప్రభువును భూమిపైకి పంపించిన రోజే క్రిస్మస్ అని, క్రీస్తును ఆరాధించడమే క్రిస్మస్ పండుగ అని చెప్పారు. క్రీస్తు రాక ఈ లోకానికి శుభ సూచకమన్నారు. ఆకాశంలో తోకచుక్క ఉద్భవించగానే ఈ విశ్వానికి వెలుగుల మన జీవితాలు మార్చడానికి వచ్చిన దేవుడే ఏసుప్రభు అని తెలిపారు. ప్రభువైన యేసు ఈ లోకాన్ని ఎంతగానో ప్రేమించాడని, ఆయన అచార్యకర్త, ఆలోచనకర్త గల దేవుడు అని, ఈ సమాజానికి అధిపతి అని చెప్పారు. లోకంలోని ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలన్నదే ప్రభువు అభిమతమన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి శాంతి, ప్రేమ తత్వాన్ని అలవర్చుకొని నడుచుకోవాలని సూచించారు. ప్రభువుకు మరణం లేదని, ఆయన మాటల్లో జీవముందని చెప్పారు. సమాజ రక్షకుడిగా ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని, ప్రభువు చూపిన మార్గాలను అనుసరించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ వైఎంసీఏ కమిటీ అధ్యక్షులు డాక్టర్ పి.జోనథన్ ధర్మరాజ్, ఉపాధ్యక్షులు జి.ఎం.దీన్ దయాళ్, సీనియర్ సలహాదారులు వినయ్ స్వరూప్, పలువురు పాస్టర్లు, రెవరెండ్, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న స్నేహిత్, అంకిత్, అన్నీ అరుణ, శామ్యూల్, అర్పిత, నవ్య తదితరులు
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అవినీతి పాలన అంతం అయ్యేవరకు రాష్ట్రపతి పాలన పెట్టాలి

సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్
అవినీతి పాలన అంతం అయ్యేవరకు రాష్ట్రపతి పాలన పెట్టాలి. దేశంలో ఓటుకు నోటు అనే సంస్కృతి పోయినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని అఖిల భారత వెనుకబడిన ప్రజల సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్ గౌడ్ అన్నారు. సోమవారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి పంపిణీ జరగవద్దని సామాజిక మాధ్యమాల్లో భారతదేశం, తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్లు ఆదేశించిగా ప్రధాన పార్టీలు మాత్రం వారి అభ్యర్థుల గెలుపుకోసం అందుకు విరుద్ధంగా కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ విపరీతంగా జరిగిందని, ఓట్ల లెక్కింపు జరగ వద్దని తాను భారత రాష్ట్రపతి ద్రౌపది ముద్దుకు లేఖ కూడా రాశానని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా ఇప్పటికి కొద్ది శాతం ఉన్న అగ్రవర్ణాల వారే పాలిస్తున్నారన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎన్ని కైనా నాయకులు అవినీతికి పాల్పడుతూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇలా గెలిచిన నాయకులు అవినీతికి పాల్పడి లక్షల కోట్లు దోచుకొని శ్రీలంక స్థాయికి చేర్చి ఇతర దేశాలకు పారిపోయే ప్రమాదం ఉందన్నారు. దోపిడిని అరికట్టాలంటే ప్రెసిడెంట్ రూల్స్ ఒక్కటే మార్గమన్నారు. నిజమైన ప్రజాస్వామ్యం కావాలంటే స్వచ్ఛందంగా ఓటు వేసే వరకు రాష్ట్రపతి పాలన ఉంటేనే దేశం బాగుపడుతుందన్నారు.

అయ్యప్పస్వామి మహాపడిపూజ



నవ తెలంగాణ-ముషీరాబాద్
రాంనగర్, హరి హరిపత్ర అయ్యప్ప స్వామి సేవ వ్యవస్థాపక అధ్యక్షులు తలారి వినోద్ కుమార్ ముదిరాజ్ 23వ మహా పడిపూజ లలితానగర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిని ఘనంగా సత్కరించారు అయ్యప్పస్వామి నామస్మరణతో లలితానగర్ మారుమోగింది. భక్తులు భక్తిపారవశంలో మునిగిపోయారు. స్వాములకు, భక్తులకు బిర్ల(హరి) తీర్ధ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తలారి వివేక్ ఆనంద్ ముదిరాజ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే అత్యధిక మెజార్టీ

- చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి

నవతెలంగాణ-చేవెళ్ల

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన లక్షా తొమ్మిది వేల మెజార్టీ కంటే ఎక్కువ వస్తుందని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్లలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి రివ్యూ నిర్వ హించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లా డుతూ...'నన్ను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయ మని చెప్పారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ అంటేనే బీఆర్ఎస్. బీఆర్ఎస్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. బీఆర్ఎస్ ఏం చేయలేదని కాంగ్రెస్ చెప్పడం అసత్యం. కాంగ్రెస్ రాష్ట్రంలో 412 హామీలు ఇచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు' అని తెలిపారు.

అనాథ చిన్నారులకు స్వెట్టర్లు పంపిణీ



నవతెలంగాణ-చేవెళ్ల

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి మండల పరిధిలోని డే స్ప్రింగ్ హౌస్ అనాథాశ్రమంలో పేద, అనాథ చిన్నారులకు చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బేగరి వినోద్ కుమార్ స్వెట్టర్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. గత 7 సంవత్సరాల నుంచి డే స్ప్రింగ్ హౌస్ అనాథా శ్రమంలో పేద, అనాథ చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాని, ఇదే స్ఫూర్తితో ముున్ము ందు సేవలు మరింత విస్తృతం చేసి అనాథాశ్రమానికి చేయూతనందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమ నిర్వాహకులు,పాస్టర్ పురుశోత్తం, మల్లేశ్, ప్రేమ్‌కుమార్, చిన్నారులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'కు ఏర్పాట్లను పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్
- ప్రజా పాలన కార్యక్రమంపై సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలో ఈ నెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు జరుగు ప్రతిష్టాత్మక ప్రజా పాలన కార్యక్రమం ఎలాంటి లోటు పాట్లు లేకుండా సమర్థవంతంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు 6 గ్యారంటీ పథకాలు ద్వారా లబ్ధి పొందేందుకు వార్డులో ఏర్పాటు చేసిన కౌంటర్ లకు వచ్చి తమ విన్నపాలను అందించేందుకు షెడ్యూల్డ్ సమాచారాన్ని తప్పని సరిగా చేరేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తో కలిసి జీహెచ్ఎంసి పరిధిలో నియమించిన సర్కిల్ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ ప్రజా పాలన కార్యక్రమం సందర్భంగా జిహెచ్ఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన వివరాలను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. వార్డులో నాలుగు లొకేషన్లలో ఒక్కొక్క లొకేషన్‌లో 3 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు అర్జి దారులు ఎక్కువగా ఉన్న పక్షంలో అదనంగా మరో కొని కౌంటర్లు అవసరమైన మేరకు ఏర్పాట్లు చేయునట్లు మొత్తం జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 600 లోకేషన్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు అందుకు 5 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు మరో 5 వేల మంది వాలంటీర్లను ఏర్పాటు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రజా పాలన కార్యక్రమం డిసెంబర్31, జనవరి 1 ఈ రెండురోజులు మినహా మిగతా రోజులు నిర్వహించ నున్నట్లు ఈ సందర్భంగా కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లతో పాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశట్టి తదితరులు పాల్గొనన్నారు.



ఎన్ కన్వెన్షన్‌లో
"డెస్టినీ" న్యూ ఇయర్ వేడుక



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహిం చేందుకు హైదరాబాద్ నగరం సిద్ధం అవుతోంది. ఈ మేరకు ఈవెంట్ మానేజ్మెంట్ సంస్థలు వినూత్న రీతిలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రెడీ అవుతున్నాయి. ఇలా ఈ రంగంలో 12 ఏండ్లకు పైగా అనుభవం ఉన్న నగరానికి చెందిన యువకులు డెస్టినీ పేరిట న్యూ ఇయర్ పార్టీ వేడుకలను నిర్వహించనుంది. దీనికి సంబంధించిన పోస్టర్ విడుదల కార్యక్రమం మాదాపూర్‌లోని ఐరన్ హిల్ కేఫ్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఐశ్వర్య సాయి, చుండూరి ఫణి, వినీత్ బల్లి, వరుణ్ విహార్ వివరాలను వెల్లడించారు. నిర్వాహకులు చందూరి ఫణి, వరుణ్ విహార్ డెస్టినీ న్యూ ఇయర్ మ్యూజిక్ ఫెస్టివల్ గురించి తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఇది మరపురాని నూతన సంవత్సర అనుభవానికి అంతిమ గమ్యస్థానంగా ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని ఎన్ కన్వెన్ష న్‌లో జరుగుతుందన్నారు. బ్యాండ్ నిరావల్, డిజె పరోమా, కొలిషన్‌తో సహా 8 మంది కళాకారులతో ఆకట్టుకునే లైన ప్‌ను కలిగి ఉంటుందన్నారు. ఇవి 4 స్టేజ్‌లలో ప్రదర్శిం చబడే 4 విభిన్న కళా ప్రక్రియల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. ఈ దశలు తెలుగు లైవ్ బ్యాండ్‌లు, బాలీవుడ్, టెక్నో, హిప్ హాప్‌లను కలిగి ఉంటాయని పేర్కొన్నారు. "డెస్టినీ న్యూ ఇయర్ మ్యూజిక్ ఫెస్టివల్ కేవలం క్లబ్ పార్టీ మాత్రమే కాకుండా హాజరైన వారందరికీ అసాధారణమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఇది పూర్తి స్థాయి సంగీత ఉత్సవం" అని నిర్వాహకులు తెలిపారు. బుక్‌మై షో, పేటీఎం ఇన్‌సైడర్ వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా బుకింగ్ చేయడానికి పాస్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా, ఆసక్తి గల వ్యక్తులు విచా రణలు, బుకింగ్‌ల కోసం thedestinyawaits వద్ద ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమానికి బి.పద్మావతి (మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్, మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ విజేత, చార్మిం గ్), సుధా నాయుడు (మిసెస్ ఇండియా తెలంగాణ కిరీట విజేత, కలర్స్ అకాడమీ మ్యానింగ్ పార్టనర్, సోషలిస్ట్), నున్నా రాజీ తనూజ (మిసెస్ ఎంటర్‌ప్రైజింగ్ తెలం గాణ-2021, తనుస్ లగ్జరీ వ్యవస్థాపకురాలు, సేవా ఎన్జీవోలో సామాజిక కార్యకర్త) ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు.

ఓడారు..గోవాకి వెళ్లారు

- ఆనందోత్సవాలలో మునిగి తేలారు
- ఆయన్ని మెచ్చుకోవాలా ? లేదా నిందించాలా ?



నవతెలంగాణ-ఓయూ

ఎవరైనా ఎన్నికల్లో ఓడితే తమకు ఇష్టమైన కుటుంబ సభ్యుల వద్దకు, లేదా ఆలయాల సందర్శన, లేదా ఆధ్యాత్మికంగా కొన్నాళ్ళు తిరగడం లేదా, నెక్స్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అవకా శాలు వెతుకుంటారు. ఈ ఓటమిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసుకొని లోపాలు లోటుపాట్లను సరిచేసుకొని ముందుకు పోతు రేపటి గెలుపుకు బాటలు వేసుకుంటారు. కానీ ఇక్కడ సికిం ద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. నవ్వి పొదురుగాక నా కేంటి అన్నలా ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక జాతీయ పార్టీకి చెందిన వ్యక్తి పోటీ చేసి ఓటమి పాలైన వ్యక్తి ఇటీవలే ఈ ఎన్నికల్లో తన ప్రచారంలో తన కోసం శ్రమించిన నేతలు, కార్యకర్తలను డివిజన్‌కు 10 మంది చొప్పున కార్యకర్తలను ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి గోవాకు తీసుకెళ్లారు. సదరు గోవాయాత్రలో మొత్తం ఖర్చులు తానే భరించారు. ఇక అక్కడ సదరు నేతల, కార్యకర్తలు ఓటమిని మరిచిపోయే విధంగా ఆడారు..పాడారు...ఉల్లాసంగా ఉత్సహంగా గోవాలో పర్యటించి అక్కడ ఉన్న ప్రముఖ యాత్ర స్థలలు తిలకించారు. అంతటితో ఆగకుండా వారే వారి వారి ఫేస్‌బుక్, ట్విట్టర్, స్టేటస్‌లలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్నారు. ఈ విషయం కాస్త వైరల్ అయి ఆ పార్టీకి సంబంధించిన స్థానిక ఎంపీ, కేంద్రమంత్రి దృష్టికి వెళ్లడంతో వారికి క్లాస్ పీకినట్లు సమాచారం.

ఇది పార్టీ సిద్ధాంతం కాదు..!

అదే పార్టీకి చెందిన కొందరు గోవాకు వెళ్ళని నేతలు అసలు ఇది తమ పార్టీ సిద్ధాంతం ఐడియాలజీలో లేదని, ఇలా వెళ్లడం పార్టీకి నష్టం అని ఆ పార్టీలో కొందరు నేతలు చర్చిం చుకుంటున్నారు. అసలే రానున్న 4లేక6 నెలల్లో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా చేయడం సమంజసం కాదని అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇంకొందరు పార్టీ నేతలు మా త్రం సొంత పార్టీ వాళ్లను కాదని ఇతర పార్టీల నుండి వలస వచ్చిన వారికి పార్టీ పదవులు ఇవ్వడమే ఒక తప్పు అయితే, ఇక ఏకంగా ఎమ్మెల్యే సీటు ఇస్తే ఇలాగే ఉంటుందని అంటున్నారు. ఇంకొందరు సీనియర్ నేతలు అసలు పార్టీ అభ్యర్థికి ఇచ్చిన ఫండ్‌ను పూర్తిస్థాయిలో చేరాల్సిన వారికి చేరలేదని, పంపిణీ సవ్యంగా చేయలేదని అందుకే ఇలా సరిపెట్టుకున్నామని, దీనిపై పార్టీలో చర్చించి క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కొందరు అగ్రనేతల వద్ద డిమాండ్ చేస్తున్నారు. కొందరు అభ్య ర్థులు అయితే ఓడిన తరువాత అప్పులు, చేసిన ఖర్చులు బాగపెట్టిన, అది అమ్మినా, ఇది పోగొ ట్టుకున్న అని సాకులు చెపుతారు. కానీ ఈ అభ్యర్థి మాత్రం ఓడిన కూడా నిరాశ చెందకుండా తన కోసం పనిచేసిన తాను అనుకున్న కార్యకర్తలను గోవా తీసుకు వెళ్లడం అభినందించలా ? లేకా నిందించాలా ? అని కొందరు అంటున్నారు. మరి పార్టీ ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.





నగరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ సందర్భంగా సోమవారం నగరంలో చర్చిలు కళకళలాడాయి. క్రైస్తవులు పెద్ద ఎత్తున చర్చిలకు చేరుకుని పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు.















మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ఆసియా ఖండంలోనే అతిపెద్ద చర్చిగా పేరు పొందిన మెదక్ కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే మెదక్ చర్చి నిర్మించి వచ్చే సంవత్సరానికి వందేండ్లు పూర్తి కావస్తుండడంతో సోమవారం నుంచి సంవత్సరం పాటు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు.



















నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఎర్రగడ్డ డివిజన్‌లో 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. సోమవారం వారి కార్యాల యంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, జావీద్‌భాయ్‌వారి అనుచరులతో మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించి, జూబ్లీ హిల్స్ నియోజక వర్గం ప్రజలందరికి ముందుగా నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు.

పనికి వెళ్లిన యువతి అదృశ్యం

నవతెలంగాణ-జవహర్‌నగర్



పని కోసమని ఇంటి నుంచి బటయకు వెళ్ళిన యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్ కార్పొరేషన్ మార్కెట్‌లో సాధుల తిరుపతమ్మ, భర్త సురేష్, కుమార్తె, కుమారుడితో నివాసముంటున్నారు. కుమార్తె సాధుల తులసి(18) సూపర్ మార్కెట్ పనిచేస్తుంది. ఈనెల 24న పనికోసమని ఇంటి నుంచి బయటకు వెళ్ళిన తులసి ఇంత వరకు తిరి గి రాలేదు. తులసి పనిచేసే చోట వివరాలు అడగ్గా ఆమెగత 3రోజుల నుంచి పనికి రావటంలేదని తెలిపారు. దీంతో ఆమెఆచూకి కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికిన సమచారం లభించలేదు. సోమవారం మధ్యాహ్నం తులసి ఫోన్ చేసి నా కోసం వెతకవద్దని, నేను క్షమంగా ఉన్నానని చెప్పిందన్నారు. మరలా ఆమెకు ఫోన్ చేద్దా మని ప్రయత్నిస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తో ందని తెలిపారు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఫిర్యా దు మేరకు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్ నిర్ణయాలను ప్రశంసిస్తున్న ప్రజలు





- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

సీఎం రేవంత్ నిర్ణయాలపై అన్ని వర్గాల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే రెం డింటినీ అమలు చేశారని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచారన్నారు. త్వరలోనే ప్రతి రేషన్‌కార్డు ఉన్న ఇంటికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడానికి కసరత్తు ప్రారంభించారన్నారు. అలాగే అర్హులైన వారికి బియ్యం రేషన్ కార్డులు ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అన్నారు. ఈ నిర్ణయాలన్నీ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఉపయోగం అని ఆయన అన్నారు. ఓవైపు, మానిఫెస్టోను అమలు చేస్తూనే. మరోవైపు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి గిగ్ వర్కర్లతో సమావేశమై వారి కష్టాలు తెలు సుకుని, ఆ టో, క్యాబ్, రిక్షాడ్రైవర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ఇవ్వనున్నట్లు ప్రక టించారు. అలాగే ఫుడ్ డెలివరీ బాయ్స్‌కి స్విగ్గి, జొమాటో తదితర వర్కర్లకు ఇది వర్తిస్తుందని, దీని వల్ల లక్షలాది కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లు అయిందన్నారు. ప్రజల సమ స్యలను నిత్యం పరిష్కరించడానికి ప్రతి మంగళవా రం, శుక్రవారం ప్రజావాణికి శ్రీకారం చుట్టడం వల్ల ఎంతో మంచి జరుగుతుందని, అలాగే ఓ ఎనిమిది రోజుల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి..వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, 26వ తేదీ నుంచి ప్రజాపాలన పేరుతో పల్లెబాట పట్టిం చను న్నా రని, ఇందుకోసం జిల్లాలకు ఇన్‌చార్జిల మంత్రు లను నియ మించారన్నారు. దాని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్ర జలకు ఎంతోమేలు చేకూరుతుందని అజహరుద్దీన్ అన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా ఓబీసీని నియమించాలి

- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌కు మెయిల్ ద్వారా జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీగా 55శాతం పైగా ఉన్న ఓబీసీలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి రావడానికి ఓబీసీలు ఎంతో కష్టపడ్డారని, కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఒక రెడ్డి, ఓసి సామాజిక వర్గానికి చెందిన వారిని నియ మించారని, డిప్యూటీ సీఎంగా ఒక ఎస్సీ దళితులకు అవకాశాలు ఇచ్చారన్నారు. కాబట్టి మెజారిటీగా 55శాతం పైగా ఉన్న ఓబీసీలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చి సామా జిక న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం తరుపున విజ్ఞప్తి చేసినట్లు లింగంగౌడ్ తెలిపారు.

జీటీఎస్ ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ



- పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, వెంగళ్‌రావునగర్‌లోని జీటీఎస్ దేవాలయంలో అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పూజకు ముక్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదేప్యరావు విజయ్, ఆలయ చైర్మెన్ చిన్న, వేణు, రమేష్, శ్యామ్‌రావు , బాలప్రకాష్, సత్య, ఆలయ కమిటీ సభ్యులులక్ష్మి, వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ చైర్మన్ సత్యనారాయణ ,పవన్ ముధిరాజ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు



బేగంపేట్‌లో

- సికింద్రాబాద్ వెస్లీ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యే తలసాన శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

సాటి వారిపట్ల ప్రేమతో వ్యవహరించాలి..సన్మార్గంలో పయనించాలి అనే ఏసుక్రీస్తు సూక్తులను ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసన సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ లోని వెస్లీ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలలో ఆయన పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం బిషప్ పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆశీర్వచనం చేశారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని చర్చిలను ఎంతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్ధనలతో చర్చిలు ఎంతో సందడిగా మారాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చర్చి పాధర్ లు జేమ్స్, చర్చి కమిటీ సభ్యులు చందన్, సుదీర్, దివాకర్, దేవ సహాయం, కమలాకర్, ఫ్రాన్సిస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెథడిస్ట్ చర్చిలో... సనత్ నగర్ లోని మెథడిస్ట్ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని చర్చి ఫాదర్ ఆశీర్వదించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాధర్ జేమ్స్, నతానియల్, దాస్, వసంత్, రాజ్ గోపాల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శేఖర్, మాజీ అధ్యక్షులు ఖలీల్, నాయకులు జమీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీ సీసీ ప్రధాన కార్యదర్శి పి విజయరెడ్డిహాజరై ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్ వెంకటేశ్వర కాలనీ, జూబ్లీహిల్స్ హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఉన్న చర్చిలను సందర్శించి క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం తరవున అందిస్తున్న క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, అన్ని డివిజన్ కాంగ్రెస్‌అధ్యక్షులు సీనియర్ నాయకులు మోహన్క్రి యాదవ్, ప్రార్థనలో సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్

షరోన్ గాస్పెల్ చర్చలో ప్రార్థనలు ..

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని షరోనా గాస్పెల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పాస్టర్ ప్రభుదాస్ ప్రార్ధనతో ప్రారం భమైన క్రిస్మస్ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పి.విజయ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానంలో భాగస్వాములయ్యారు.

లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీ నాథ్ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం, రహమత్ నగర్ డివిజన్ లోని లూథరన్ చర్చిలో ప్రార్ధనలో పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ బహుమతులును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూక్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని, క్రిస్టియన్ సోదరి సోదరమణులుకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.కె.విద్యాసాగర్, ఎం. రాకేష్ క్రిస్టోఫర్, షాలోమ్‌బాబు, రాజ్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నవీన్ యాదవ్

బోరబండ డివిజన్ బాబాసైలనినగర్‌లో రాక్, షాలోమ్ చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నవీన్ యాదవ్ పాల్గొని చర్చి పాస్టర్ బిషప్‌జోన, తాను బాబా ఆశీర్వాదాలు తీసుకున్నారు.అనంతరం తన వంతు ఆర్థిక సహా యంగా మ్యూజికల్‌కు సంబంధించిన సామాగ్రిని, ఇతర సామాన్లను చర్చికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు యాదయ్య కృష్ణవేణి, టిల్లు, దాస్, కుమార్, నరసింహ తదితరులు నవీన్ యాదవ్‌తో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు.

యూసుఫ్ గూడా డివిజన్‌లో

యూసుఫ్ గూడా డివిజన్‌లో ఎల్ఎన్‌నగర్‌లో గల రాక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నవీన్‌యాదవ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని పాస్టర్ పి.డేవిడ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. నవీన్ యాదవ్‌తో పాటు స్థానికులు గుంటి సాయి యాదవ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో



బంజారాహిల్స్‌లో



జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్



బంజారాహిల్స్‌లో



బంజారాహిల్స్‌లో

ఓయూలో మనుస్మృతి ప్రతుల దహనం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఎఎస్ఎ ఆధ్వర్యంలో సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మనుస్మృతి ప్రతుల దహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. వేల సంవత్సరాలు అణగారిన వర్గాల ప్రజల అణచివేతకు చిహ్నంగా ఉన్న మనుస్మృతి బాబాసాహెబ్ అంబేద్కర్ డిసెంబర్ 25వ తేదీన దహనం చేశారు. దేశ పౌరుడికి సమానమైన హక్కులు కావాలని ఏ కారణం చేత కూడా అణచివేతకు గురి కాకూడదని బాబాసాహెబ్ కోరారు. ఆ స్ఫూర్తితోనే రాజ్యాంగాన్ని రాశారు. అయినప్పటికీ కొన్ని మతతత్వ సంఘాలు మతతత్వ పార్టీలు మనుధర్మ శాస్త్రాన్ని ఈ రోజుకి అమలు చేసే ప్రయ త్నాలు చేస్తున్నాయి. మనధర్మ శాస్త్రాన్ని శాశ్వతంగా నిర్మూ లించే దిశగా అందరం పోరాడాలని ఒక రాజ్యాంగబద్ధమైన పరిపాలనను ఈ దేశానికి అందించిన వ్యక్తుల స్ఫూర్తిని నిల బెట్టాలని అధ్య క్షులు దివాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు శంకర్, పులి కల్పన ఎఎస్ఎ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మనస్మృతి పుస్తకాన్ని నిషేదించాలి : బోరెల్లి సురేష్

నవతెలంగాణ-ఓయూ



ఈ దేశంలో నీచ సంస్కృతి అయిన నిచ్చె నమెట్ల కుల వ్యవస్థ, అంటరానితనాకి నాం ది అయినా మనుస్మృ తినీ ఈ దేశంలో నిషే ధించాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ డిమాండ్ చేశా రు. ఈ సంద ర్భం గా బోరెల్లి సురేష్ మాట్లా డుతూ "కుల వ్యవస్థ కు, మహి ళలకు సమాన హక్కులు లేకుండా ఈ దేశంలో అసమా నులకు, బ్రాహ్మణుల పెత్తనానికి కార ణమైన మనుస్మృతి అత్యంత ప్రమాదకరమైనది అని అన్నా రు. మనుస్మృతి ప్రతులను సోమ వారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. భారత రాజ్యాంగం అమలు కావాలంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్ ఎఫ్ ఓయూ ఇన్చార్జి కల్వకుర్తి శ్రీశైలం, అరెకంటి శ్రీకాంత్, గోవిక్, ఓంకార్, ఓదెల్, సింహాద్రి, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మనస్మృతి ప్రతులు దహనం



ఓయూ హైదరాబాద్ సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమ వారం రాత్రి మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. కొన్ని దశాబ్దాల క్రితమే భారత రాజ్యా ంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనుధర్మ శాస్త్రాన్ని వేలాది మంది సమక్షంలో తగలబెట్టిన రోజును పురస్కరిం చుకొని ఈ దహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. పిడమర్తి వేణు అధ్యక్షతన, ఎస్ఎస్ఎఫ్ నేషనల్ కోఆర్డినేటర్ చార్వాక, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, డీఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్, భారత నాస్తిక సమా జం హైదరా బాద్ నాయకుడు మాదరి యాదగిరిలు దహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కొన్ని సంవత్సరాల క్రితం బ్రాహ్మణీయ వ్యవస్థ మనుధర్మ శాస్త్రాన్ని అడుపెటు కొని సాటి మనుషులను ఊరికి దూరంగా అంటరాని వారీగా, మహి ళలకు ఎటు వంటి హక్కులు కల్పించ కుండా కేవలం పురుషుడి కోసమే స్త్రీ అనే విధంగా చూసారని, శూద్రులు, అతిశూద్రులకు ఎటువంటి హక్కులు లేవని వర్ణ వ్యవస్థలో ఉన్న బ్రాహ్మణ, క్షతి య, వైశ్య వర్ణాలకు సేవ చేయడం కోసమే పుట్టారని ఇటువంటి ఎన్నో అమానవీయ విషయాలు ఉన్నాయన్నారు. ఇటువంటి వాటిని బీఆర్‌అంబేద్కర్ మనుధర్మ శాస్త్రా న్ని దహనం చేశా డని మహనీయుడు ఆదర్శంగా నేడు ఈ మనుధర్మ శాస్త్రాన్ని తగలబెట్టామని అన్నారు. పెరియార్, పూలే, అంబేద్కర్ ఆలో చన విధానంతో తిప్పికొడతామని అన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మూఢ నమ్మకాల నిర్మూలన చట్టా న్ని తీసుకువచ్చి పటిష్ఠంగా అమలు చేసి సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషిచేసి శాస్త్రీయ సమ సమాజ నిర్మాణానికి పాటుపడాలని డిమాండ్ చేశారు.


హైదరాబాద్

నవతెలంగాణ మానవి 13

మంగళవారం

26 డిసెంబర్ 2023

www.navatelangana.com



విరామం తర్వాత ఉద్యోగాల్లోకి తిరిగి వస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలు ఎలా వున్నాయి? ఈ ఏడాది తొలగింపుల వల్ల మహిళలు ఎలా ప్రభావితమయ్యారో? ఉద్యోగాల కోసం వెదుకుతున్నపుడు వారు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారో? జీతాల విషయంలో రాజీ పడాల్సిందేనా? వీటన్నింటిపై ఉద్యోగాలు కోల్పోయిన కొంత మంది మహిళలు ఏమంటున్నారో చూద్దాం...



తొలగింపుల్లో మహిళలే ఎక్కువ

మహిళల కోసం పని చేస్తున్న ప్రముఖ కెరీర్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ అయిన హెర్ కీ ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి వర్క్‌ఫోర్స్‌లోకి తిరిగి ప్రవేశించాలని లక్ష్యంగా పెట్టుకున్న 82% మంది మహిళల్లో, 57% మంది మహిళలు తమ ఉద్యోగాలను విడిచిపెట్టారు లేదా తొలగించబడ్డారు. 45% మంది పూర్తి సమయం ఉపాధిని కోరుతున్నారు. గత వారమే రితికా ఒక ఐటీ సేవల సంస్థలో కంటెంట్ స్ట్రాటజీలో ఉద్యోగం నుండి తొలగించబడింది. రాధిక ఈ ఏడాది ప్రారంభంలో ఓ కంపెనీలో పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా నియమించ బడ్డారు. అయితే తన అవసరం కంపెనీకి ఇక లేదనే కారణంతో కొన్ని నెలల్లోనే తొలగించ బడింది. సర్వేలో భారతదేశం అంతటా అన్ని రంగాలకు చెందిన 2,500 మంది మహిళల అభిప్రాయాలు ఇందులో వున్నాయి. ఈ ఏడాది తొలగించబడిన వారిలో పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారనే వాస్తవాన్ని ఈ సంఖ్య సూచిస్తుంది. ఇది ఆందోళనకరమైన విషయం.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం...

నేహా బగారియాచే స్థాపించబడిన హెర్ కీ సాంకేతిక రంగంలో నిరంతర తొలగింపులకు సాక్ష్యంగా ఉంది. చాలా కంపెనీలు తమ ఖర్చులు తగ్గించుకునేందుకు ఇలా వ్యవహరిస్తున్నాయి. అయితే "ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మహిళల అసమాన తొలగింపులు లింగ అసమానతను ఎత్తి చూపడమే కాకుండా విస్తృత ఆర్థిక సమస్యలను కూడా పెంచుతున్నాయి. బలమైన జాబ్ మార్కెట్‌ను నిర్వహించడానికి, భారతదేశంలో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి ఈ ధోరణిని పరిష్కరించడం, మార్చడం చాలా కీలకం" అని ఆమె వివరిస్తుంది.

నైపుణ్యాలు వున్నా...

కన్సల్టెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిరుపమ ప్రకారం ఐటీ సేవలు, కన్సల్టింగ్ వంటి రంగాలలో మహిళల తొలగింపులు పెరుగుతున్న ధోరణి ఆందోళనకరంగా ఉంది. భారతదేశంలో ఉద్యోగం చేయగల మహిళలు ఎక్కువ భాగం ఉన్నప్పటికీ ఉద్యోగాల కోత వల్ల వారు అసమానంగా ప్రభావితమైనట్లు కనిపిస్తున్నారని స్టాటిస్టా నివేదికను ఆమె ఉటంకించారు. "ఈ ధోరణి ఈ మహిళల తక్షణ జీవనోపాధిని ప్రభావితం చేయడమే కాకుండా కార్యాలయంలో లింగ సమానత్వం వైపు సాధించిన పురోగతిని వెనుకకు నెట్టివేస్తుంది. హెచ్‌ఆర్‌లో నా అనుభవంతో, ఈ అసమానతలను పరిష్కరించడం, మరింత సమానమైన ఉపాధి పద్ధతుల కోసం పని చేయడం చాలా కీలకమని నేను నమ్ముతున్నాను" ఆమె చెప్పింది.

కష్టతరంగా....

పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు తరచుగా వ్యక్తిగత కారణాల వల్ల కెరీర్‌కు విరామం తీసుకోవలసి వస్తుంది. అయితే ఇవి కేవలం గర్భం, ప్రసవం, పిల్లలు, వృద్ధుల సంరక్షణ వంటి వాటికి మాత్రమే పరిమితం కాదు. వారు ఆశించిన కెరీర్ వృద్ధి లేదా అభివృద్ధి లేకపోవడం మరొక కారణం. గత 30 ఏండ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న శారదను ఈ ఏడాది ఉద్యోగం నుంచి తొలగించారు. "మీడియా పరిశ్రమలోనూ ఎంత అనుభవం వున్నా సమస్య తీవ్రంగానే ఉందని నేను భావిస్తున్నాను. అనుభవజ్ఞులైన వ్యక్తులకు చాలా తక్కువ ఉద్యోగాలు ఉన్నాయి. దీనివల్ల కింది స్థానాలకు దరఖాస్తు చేసుకోవలసి వస్తుంది" అని ఆమె చెప్పింది.

విరామాన్ని ఉపయోగించుకుంటున్నా...

రెండు నెలల క్రితం తన టెక్ ఉద్యోగం నుండి తొలగించబడిన రాజశ్రీ ఈ నిర్ణయం పట్ల తాను ఆశ్చర్యం చెందలేదని చెప్పింది. "నా కంపెనీలో తొలగించబడిన అనేక మంది వ్యక్తులలో నేను భాగం. కానీ ఎనిమిదేండ్లకు పైగా అక్కడ పనిచేసినందున 44 ఏండ్ల వయసులో నేను కొత్త ఉద్యోగాన్ని ప్రారంభించడం గురించి ఆందోళన చెందుతున్నాను. అయితే కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి, జాబ్ మార్కెట్‌లో అడిగే ప్రశ్నలకు అనుగుణంగా ఉండటానికి నేను విరామాన్ని ఉపయోగిస్తున్నాను. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఐటీ, ఈకామర్స్ రంగాల్లో ఉద్యోగుల తొలగింపులు ఎక్కువగా జరుగుతు న్నాయని ఆమె చెప్పారు.

సవాళ్లను నావిగేట్ చేయడం...

బగారియా ఇటీవలి హెర్‌కీ సర్వేలో 47% మంది మహిళలు తమ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునే లక్ష్యంతో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వెల్లడించింది. "హెర్‌కీలో నేర్చుకోవడం అనేది ఒక ముఖ్యమైన అంశం. అలాగే మహిళలు తమ కెరీర్‌లో ముందుకు సాగడానికి ఉద్దేశించిన కోర్సులను అందించే 800 మంది భాగస్వాములతో మేము సహకరించాము. హెర్ కీ ఇటీవలే కమ్యూనిటీస్ అనే నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్‌ను పరిచయం చేసింది. ఇక్కడ మహిళలు తమ ప్రయాణాలను నేర్చుకోవడానికి, నిమగ్నమవ్వడానికి, నెట్‌వర్క్ చేయడానికి, హైలైట్ చేయడానికి కనెక్ట్ చేసుకోవచ్చు"అని ఆమె చెప్పింది.





తల్లి ఒత్తిడికి గురైతే..?



మీ పాపకి నిద్ర సరిగ్గా పట్టడం లేదా... కడుపునిండా పాలు తాపినా పడుకోడానికి కష్టపడుతున్నారా... అయితే ఆ తప్పు వారిది కాదు, మీదే! అవును... బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లి డిప్రెషన్‌కి గురైతే ఆ ప్రభావం పుట్టిన పిల్లలపై పడుతుందని అంటున్నారు నిపుణులు. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం స్పష్టమైంది.

గర్భవతి అయిన తర్వాత మూడు నుంచి ఏడు మాసాల కాలం చాలా విలువైనది. ఈ సమయంలో తల్లి మానసిక స్థితి, ఆనందం, ఆమె ఆలోచనలూ పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఈ సమయంలో తల్లి ఎంత ఆనందంగా ఉందనే విషయం బిడ్డ నిద్రపోయే సమయాన్ని నిర్ణయిస్తుందట. ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా ఆనందంగా తల్లి కాబోతున్న విషయాన్ని ఎంజాయ్ చేసే తల్లులకు పుట్టిన పిల్లలు... మిగిలిన వారితో పోలిస్తే సుఖంగా నిద్రపోతున్నారట. అలాకాకుండా అనేక ఆలోచనలతో సతమతమవుతూ మానసికంగా కుంగిపోయి డిప్రెషన్లో కూరుకుపోయే వారి పిల్లలు నిద్రలేమితో బాధపడుతున్నారు.

అయితే తల్లి కాబోతున్నప్పుడు మహిళల్లో అనేక రకాల ఆలోచనలూ, భయాలు మొదలవుతాయి. వీటి నుంచి బయటపడి మాతృత్వాన్ని ఎంజాయ్ చేసేలా చేయాల్సిన బాధ్యత వారి భర్తలు, కుటుంబ సభ్యులపైనే ఉంటుంది. ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని ఆత్మస్థైర్యం పెంచుతూ, ఒత్తిడిని దూరం చేయాల్సి ఉంటుంది. అలాకాకుండా గర్భవతి అని చూడకుండా ఆమెని తిట్టినా, అవమానించినా, చులకన చేసి మాట్లాడిన ఆ ప్రభావం బిడ్డ మానసిక పరిస్థితిపై పడుతుందని ఈ అధ్యయనంలో నిరూపితమైంది.

అంతేకాకుండా గర్భవతిగా ఉన్నప్పుడు ఆరోగ్యం మీద కూడా చాలా శ్రద్ధ చూపించాలని హెచ్చరిస్తున్నారు వైద్యులు. లేకపోతే పుట్టబోయే పిల్లలపై ఆ ప్రభావం చాలారోజుల పాటు ఉంటుంది. అమెరికాలో 833 మంది పిల్లలపై చేసిన సర్వేలో ఈ విషయాలు తేలాయి. వీరంతా ఆరేండ్లలోపు పిల్లలే. పిల్లలు నిద్రపోయే సమయం, వీరు తల్లులు గర్భవతిగా ఉన్నప్పుడు మానసిక స్థితి ఆధారంగా ఓ డేటా తయారు చేశారు. ఇందులో తల్లికి మానసిక స్థితి, బిడ్డ ఆరోగ్యంపై ఏ స్థాయిలో ప్రభావం చూపిస్తుందో స్పష్టంగా నిర్ధారణ అయ్యింది. ఈ సర్వే రిపోర్టును 'స్లీప్ 2018' సమావేశంలో వెల్లడించారు.

ఎంత సేపు ఉండాలి..?



ఈ రోజుల్లో చాలా మంది ఎదుర్కొనే సమస్య డి విటమిన్ లోపం... ఇందుకోసం కొన్ని రకాల టాబ్లెట్స్‌తో పాటు ఎండలో నిలబడాలని శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల డి విటమిన్ వృద్ధి చెందుతుందని సూచనలు చేస్తున్నారు. అయితే ఏ సమయంలో ఎంత సేపు, ఏ సమయంలో ఎండలో ఉండాలనేది చాలా మందికి తలెత్తే సమస్య.. ఆ వివరాలు తెలుసుకుందాం...!

ఎండ మన జీవనానికి ఎంతో అవసరమైంది. సూర్యరశ్మి వల్ల విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది. ఈ విటమిన్ డి శరీరానికి ఎంతో అవసరం. విటమిన్ డి సక్రమంగా అందితే జీర్ణ సమస్యలు అనేవి ఉండవు. అందులోనూ ఉదయం వచ్చే ఎండ చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు కూడా చెబుతూ ఉంటారు.

సూర్యోదయం అయిన తర్వాత రెండు గంటల పాటు.. సూర్యాస్తమయానికి రెండు గంటల ముందు ఎండలో ఉండటానికి అనువైన సమయాలని నిపుణులు చెబుతున్నారు. రోజుకు కనీసం అరగంట సమయం అయినా సూర్య రశ్మిలో ఉండాలి. ఈ సమయంలో అతి నీల లోహిత కిరణాలు.. మనపై నేరుగా పడవు. ఈ సమయం తప్పి.. ఎండలోకి వస్తే ఖచ్చితంగా సన్ స్క్రీన్ లోషన్ రాసుకుని బయటకు వెళ్లాలి.

ఎండలో ఉండటం వల్ల ముఖ్యంగా శరీరానికి విటమిన్ డి అందుతుంది. దీని వల్ల ఎముకలు, దంతాలు స్ట్రాంగ్ గా ఉంటాయి. కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. వెన్నముక, కాళ్లు, కీళ్ల నొప్పులు క్రమంగా తగ్గుతాయి. అంతే కాకుండా రోజు వారీ పనులు చేసుకోవడానికి కూడా వీలుగా ఉంటాయి.

బతుకులను కమ్మేసిన పొగమంచు

(మొదటిపేజి తరువాయి)

దగ్గరికి వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం.. అతివేగం వల్ల ప్రమాదాలు జరిగి ఆరుగురు ప్రాణం కోల్పోయారు.ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. చనిపోయిన ఆ ద్విచక్ర వాహనదారుని కోసం ట్రాలీ ఆటోలో బయలుదేరిన కుటుంబీకులను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే నలుగురు ప్రాణం కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు.

ఈ ఘటనలు నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రానికి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

పెద్దవూర మండలం పుల్యా తండాకు చెందిన రమావత్ నాగరాజు(28) కుటుంబీకులు సోమవారం క్రిస్మస్ సందర్భంగా చర్చికి వెళ్లాలనుకున్నారు. దాంతో ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు నాగరాజు మిర్యాలగూడ నుంచి హాలియా వైపు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తున్నాడు. వెంపాడ్ స్టేజీ వద్ద కిరాణా దుకాణం నడుపుతున్న బలుగూరి సైదులు రోడ్డు దాటుతుండగా నాగరాజు ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో సైదులు(55) అక్కడికక్కడే మృతిచెందాడు. రమావత్ నాగరాజు తలకు తీవ్ర గాయం అవడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.

మృతదేహాన్ని చూసేందుకు వస్తూ... కుటుంబ సభ్యులూ మృతి

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన నాగరాజు కోసం హైదరాబాద్ నుంచి కుటుంబసభ్యులు, బంధువులు హుటాహుటిన టాటా ఏసీ ట్రాలీ వాహనంలో బయల్దేరారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో నిడమనూరు మండల కేంద్రం పరిధిలోని చౌదరి హోటల్‌కి సమీపంలోకి రాగానే.. మిర్యాలగూడ నుంచి హాలియా వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న రమావత్ పాండ్య(40), రమవాత్ గణ్యా(40), రమావత్ బుజ్జి(38), రమవత్ కేశవులు(19) అక్కడికక్కడే మృతిచెందారు.

మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హాలియా సీఐ గంది నాయక్, ఎస్ఐ గోపాల్ రావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. మృతదేహాలను మిర్యాలగూడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండలంలో ఒకే ప్రాంతంలో గంటల వ్యవధిలో ప్రమాదాలు జరిగి ఒకే కుటుంబీకులు ఐదుగురు మృతిచెందడంపై స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పుల్యా తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధం

వాటికన్ సిటీ : ప్రతీ ఏటా క్రిస్మస్ రోజున యావత్తు ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చే పోప్ ఫ్రాన్సిస్ ఈసారి యుద్ధాలకు వ్యతిరేకంగా పిలుపునిచ్చారు. గాజాపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న కనికరం లేని దాడులను 'పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధంగా' విమర్శించారు. యుద్ధాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. వలస వచ్చిన ప్రజల హక్కులను సమర్థించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉక్రెయిన్, సిరియా, యెమెన్, లెబనాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్ వంటి ప్రాంతాల్లో సాగుతున్న రాజకీయ, సామాజిక, సైనిక వివాదాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. గాజాతో సహా వివిధ యుద్ధాల్లో చనిపోతున్న చిన్నారులను 'నేటి బాల ఏసులు'గా పోప్ అభివర్ణించారు. క్రిస్మస్ రోజున వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా సెంట్రల్ బాల్కనీ నుంచి అక్కడ కింద వున్న స్క్వేర్‌లో గుమిగూడ ఉన్న వేలాది మంది ప్రజలను ఉద్దేశించి పోప్ 'ఉర్బి ఎట్ ఓర్బి' (నగరం, ప్రపంచానికి సందేశం) ప్రసంగం చేయడం అనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ప్రసంగంలో ఆయుధ పరిశ్రమలపై కూడా విమర్శలు చేశారు.

యుద్ధాలను ఆయుధ పరిశ్రమ నియంత్రిస్తుందని పేర్కొన్నారు. 'ఆయుధాల ఉత్పత్తి, అమ్మకాలు, వాణిజ్యం వేగంగా పెరుగుతున్నప్పుడు మనం శాంతి గురించి ఎలా మాట్లాడగలం' అని ప్రశ్నించారు. ఆయుధాల వ్యాపారంపై మరింత విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు. 'నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల్లో అనేక మంది అమాయకులు బలిఅవుతున్నారు. మరణించిన చిన్నారులంతా బాలయేసులు' అని పోప్ అన్నారు. 'పాలస్తీనాలో దాడులతో ఆ ప్రజల జీవితాలు నాశమవుతున్నాయి. అక్కడ శాంతి రావాలి' అని తెలిపారు. మా హృదయాలు బెత్లహేంతోనే ఉన్నాయని అన్నారు. అయితే ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులను కూడా పోప్ గుర్తుచేసుకున్నారు. 'అక్టోబర్ 7 నాటి అసహ్యకరమైన దాడులతో నా హృదయం వేడెక్కుతోంది' అని పోప్ అన్నారు.

రోడ్డును ఇరువైపులా సమానంగా విస్తరించాలి

- నోటీసులు ఇవ్వకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం
- చేర్యాల పట్టణ కేంద్రంలో అఖిలపక్షం రాస్తారోకో



నవతెలంగాణ-చేర్యాల

రోడ్డు విస్తరణ పనులను ఇరువైపులా సమానంగా చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై సోమవారం వ్యాపారులతో కలిసి అఖిలపక్ష నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, బీజేపీ జిల్లా కార్యదర్శి బూరు సురేష్ గౌడ్ మాట్లాడారు. పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పట్టణ పరిస్థితులను, బిల్డింగ్ యజమానుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోకుండా, నోటీసులు జారీ చేయకుండా రోడ్డు విస్తరణ పనులు చేయడం సరికాదన్నారు. ఎలాంటి నోటీసులూ జారీ చేయకుండా.. అధికారులు, మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్లు కుమ్మక్కై, ఇష్టారాజ్యంగా రోడ్డుకు ఒక పక్క 38 ఫీట్లు, మరోపక్క 46 ఫీట్లు మార్కింగ్ చేస్తూ తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి కాయకష్టం చేసి ఇండ్లు నిర్మించుకుని దుకాణ సముదాయాల్లో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. రోడ్డు వెడల్పులో నిబంధనలు పాటించి ఇరువైపులా సమానంగా విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరన్న, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి, బీఎస్పీ మండల అధ్యక్షులు బుట్టి బిక్షపతి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణ రెడ్డి, నాయకులు పోతుగంటి రాందాస్, ఈరి భూమయ్య, ముస్త్యాల రాజేష్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, జంగిలి యాదగిరి వైశ్య సంఘం అధ్యక్షులు నీల శివకుమార్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు శేరి బాలనారాయణ, వైశ్య యువజన సంఘం అధ్యక్షులు ఐత సంపత్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య పాల్గొన్నారు.

గ్రూప్-2 నిర్వహణపై సందిగ్ధం!

(మొదటిపేజి తరువాయి)

సమావేశం సమయంలోనే రాతపరీక్షలను రీషెడ్యూల్ చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కానీ ఇంత వరకు గ్రూప్-2 వాయిదాకు సంబంధించి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఆగస్టు 29,30 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేసింది. నవంబర్ రెండు, మూడు తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వల్ల మరోసారి గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. గతంలో ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు వాయిదా పడడం వంటి ఘటనలతో టీఎస్‌పీఎస్సీ అభాసుపాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి బి జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేశారు. అదే బాటలో సభ్యులు కూడా రాజీనామాలను సమర్పించారు. అయితే జనార్ధన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించకపోవడం గమనార్హం. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీకి పాలకమండలి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలకమండలి నియామకంపై కసరత్తు ప్రారంభించినట్టు తెలిసింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడం, పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేయడం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నది. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకే టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకానికి సంబంధించి నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని భావిస్తోంది. ఆచితూచి అడుగులు వేస్తున్నది. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి వచ్చిన తర్వాతే రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షలకు సంబంధించి రీషెడ్యూల్ చేసి కొత్త తేదీలను ప్రకటించనుంది.

డిసెంబర్ వస్తే...దడ

(మొదటిపేజి తరువాయి)

కాస్త ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు నమోదవుతున్న కరోనా కొత్త వేరియంట్ కేసులు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ వేరియంట్‌తో అంతగా ప్రమాదం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చెప్తున్నది. అయినా కూడా కరోనాను తక్కువ అంచనా వేయద్దనీ, ప్రజలంతా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గతంలో ఇలా..

కోవిడ్-19 2020 డిసెంబర్‌లో మూడు పెద్ద మ్యుటేషన్‌లను చూసింది. అవి ఆల్ఫా (బి.1.1.7), బీటా (బి.1.351), గామా (పి.1). అలాగే, ఒక సంవత్సరం తర్వాత, 2021 డిసెంబర్‌లో లాక్‌డౌన్‌లు సడలించడం ప్రారంభించిన కొద్ది నెలలకే ఒమిక్రాన్ వేరియంట్ ప్రపంచాన్ని తిరిగి ఇండ్లకే పరిమితం చేసింది. మరుసటి సంవత్సరం, 2022 డిసెంబర్‌లో, కొత్త మేజర్ వేరియంట్ ఆవిర్భవించి ప్రజలను ఆందోళనకు గురి చేసింది. ఇప్పుడు జేఎన్.1 రూపంలో కరోనా మహమ్మారి మళ్లీ డిసెంబర్ నెలలోనే రావటం గమనార్హం.

నిరంకుశత్వం, దురహంకారాన్ని సమర్థిస్తోంది

(మొదటిపేజి తరువాయి)

మండిపడ్డారు. రాజ్యసభ చైర్మెన్ లేఖ పార్లమెంటు పట్ల మోడీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, దురహంకారాన్ని సమర్థిస్తోందని అన్నారు. ధన్కర్ లేవనెత్తిన పాయింట్లను ప్రస్తావిస్తూ.. తమ ఆందోళనను నిష్పాక్షికంగా మరియు తటస్థంగా పరిశీలించాలని కోరారు. ప్రత్యేకాధికార తీర్మానాలను కూడా ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు ఆయుధంగా వినియోగించిందని, ఇది పార్లమెంట్‌ను అణగదొక్కేందుకు పాలక వర్గం ఉద్దేశపూర్వకంగా రూపొందించిన విధానమని అన్నారు. మోడీ ప్రభుత్వం ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా 146 మంది ఎంపీల ఓటర్ల గొంతుకలను సమర్థవంతంగా మూయించిందని అన్నారు. సభకు సంరక్షకుడిగా, పార్లమెంటులో తమ ప్రభుత్వం జవాబుదారీగా ఉంచే ప్రజల హక్కును చైర్మెన్ కాపాడాలని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

ఫ్రాన్స్‌ను వీడేందుకు 303 భారతీయులకు లభించిన అనుమతి..

పారిస్: మానవ అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో 303 మంది భారతీయులతో నికరాగువా వెళుతున్న విమానాన్ని ఫ్రాన్స్‌లో నిలిపివేసిన సంగతి తెలిసిందే. గత వారం లెజెండ్ ఎయిర్ లైన్స్ విమానం ఫ్రాన్స్‌లో వాట్రీ విమానాశ్రయంలో ఇంధనం నింపుకునేందుకు దిగిన సమయంలో అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా ప్రయాణికులంతా ఫ్రాన్స్ అధికారుల ఆధీనంలో ఉన్నారు. అయితే తాజాగా ఈ విమానం తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు అనుమతి లభించినట్టు సమాచారం. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం.. 303 మంది భారతీయులతో ఉన్న ఈ విమానం ఫ్రాన్స్‌ను వీడేందుకు అనుమతి లభించింది. అయితే, ఈ విమానం ఎటు వెళ్తుందన్న దానిపై స్పష్టత లేదు. షెడ్యూల్ ప్రకారం గమ్యస్థానమైన నికరాగువా వెళ్తుందా..? లేక భారత్‌కు వస్తుందా..? లేదంటే దుబాయ్‌కి తిరిగి వెళ్తుందా..? అన్నది తెలియరాలేదు. కాగా, రొమానియన్ కంపెనీ లెజెండ్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న ఏ340 విమానం 303 మంది భారతీయ ప్రయాణికులతో గురువారం దుబాయ్ నుంచి నికరాగువాకు బయలుదేరింది. ఈ క్రమంలో ప్యారిస్‌కు తూర్పున 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫ్రాన్స్‌లోని వాట్రీ విమానాశ్రయంలో ఇంధనం నింపుకునేందుకు విమానం ల్యాండ్ అయ్యింది. అయితే, 'మానవ అక్రమ రవాణా' జరుగుతోందన్న గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అందిన సమాచారంతో విమానాన్ని ఫ్రాన్స్ అధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో విమానంలోని ప్రయాణికులను రెండు రోజుల పాటు ఎయిర్‌పోర్టులోనే అధికారులు ప్రశ్నించారు. విచారణ అనంతరం తాజాగా విమాన ప్రయాణానికి పూర్తి అనుమతులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించినట్లు వార్తా సంస్థ పీటీఐ నివేదించింది. ప్రయాణికుల్లో 11 మంది చిన్నారులు ఒంటరిగా ప్రయాణిస్తున్నట్టు గుర్తించారు.

అదానీ కోసం...శారదా నదిపై పిఎస్‌పి

- రహస్యంగా మట్టి నమూనాల సేకరణ
- రైవాడ జలాశయానికి దెబ్బ
- ఆందోళనలో ప్రజలు

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్‌ను అదానీ ప్రదేశ్‌గా మార్చేస్తున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశలో మరోసారి ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కడానికి సిద్ధమౌతోంది. అదానీ అక్రమాలకు ఈ సారి రైవాడ జలాశయం బలికానుంది. ఫలితంగా ఆ జలాశయంపై ఆధారపడి బతుకులీడుస్తున్న ప్రజానీకం మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. రైవాడ జలాశయానికి ఎదరయ్యే ముప్పు గురించి సాక్షాత్తు రాష్ట్ర జలవనరులశాఖే సవివరమైన నివేదికను సిద్ధం చేసినా ప్రభుత్వ పెద్దలు మాత్రం అదానీ వైపే మొగ్గుచూపినట్లు తెలిసింది. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ బలిపురం వద్ద మట్టి నమూనాలు తీయడంతో మరో పీఎస్‌పీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైవాడ జలాశయానికి వచ్చే శారద నదిపై పీఎస్‌పీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అదానీ గ్రూపు వివిధ సర్వేలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా బలిపురం వద్ద మట్టి నమూనాలు తీసి, నివేదించే బాధ్యతను కొల్‌కతాకు చెందిన ఓ సంస్థకు అప్పగించినట్టు తెలిసింది. బలిపురం నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం, ఈలుపర్తి పంచాయతీలోని మారికకొండ మధ్య 60 అడుగుల లోతులో 20 చోట్ల మట్టి నమూనాలు తీయనునున్నట్టు తెలిసింది. బలిపురం, మారికకొండ మధ్య శారద నది ఉంది. ఈ నది నీరు రైవాడ జలాశయానికి ప్రధాన నీటి వనరు. దీంతో రైవాడ జలాశయ ఉనికి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే ఏజెన్సీలోని చింతపల్లి మండలం యర్రవరంలో శ్రీ షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, అనంతగిరి మండలం పెదకోట వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పిఎస్‌పిలను అదానీకి అప్పజెప్పేందుకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. యర్రవరం పిఎస్‌పి వల్ల తాండవ, పెదకోట పిఎస్‌పి వల్ల రైవాడ జలాశయానికి వచ్చే నీటి వనరులు దెబ్బ తింటాయని జలవనరుల శాఖ కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. పిఎస్‌పిల ఏర్పాటుపై స్థానిక గిరిజనులు, ఆయకట్టుదారుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అందరిలో ఆందోళన

తాజాగా జరుగుతున్న సర్వేలో నీటి వనరులు, నిర్మాణానికి ఉన్న నాణ్యత, అవకాశాలు, నీటి నిల్వ ప్రదేశాలు, నీటి ప్రవాహ ప్రాంతాలపై వివరాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ అనుకూలంగా ఉంటే ప్రభుత్వానికి పిఎస్‌పి ఏర్పాటుకు దరఖాస్తు చేయనున్నారు. అయితే, ఈ ప్రక్రియ అంతా లాంఛనమేనని, ప్రభుత్వం నుండి ఖచ్చితమైన ఆమోదంతోనే ఇక్కడ సర్వే తంతు జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ ప్రాంతం షెడ్యూల్ ఏరియాలో లేకపోవడం, అదానీ సంస్థ వ్యూహాత్మకంగా ఇక్కడే ఎంపిక చేసుకోవడం వెనుక ఉన్నత స్థాయి ప్రమేయం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆధునిక క్రికెట్‌లో టీమ్ ఇండియా అన్ని విజయాలు సొంతం చేసుకుంది. అసాధ్యం అనుకున్న విదేశీ గడ్డపై టెస్టు సిరీస్ విజయాలను వరుసగా సొంతం చేసుకుంది. కానీ సఫారీ సవాల్ మాత్రం ఇప్పటికీ సవాల్‌గా మిగిలిపోయింది. దక్షిణాఫ్రికా పర్యటనకు ఎన్ని సార్లు వెళ్లినా.. ప్రతిసారీ టెస్టు సిరీస్ వేటలో పరాజయమే పలకరిస్తోంది. 2023 ప్రపంచకప్ ఓటమి బాధలో ఉన్న టీమ్ ఇండియా.. 2024 టీ20 ప్రపంచకప్ వేట ముంగిట ఓ రికార్డుపై కన్నేసింది. సఫారీ కోటను బద్దలు కొట్టి టెస్టు సిరీస్ విజయం సొంతం చేసుకోవాలని తపిస్తోంది. దక్షిణాఫ్రికా కంచుకోట సెంచూరియన్‌లో నేటి నుంచి భారత్, సఫారీ తొలి టెస్టు సమరం షురూ.

చరిత్ర తిరగరాయాలని!

- సఫారీ గడ్డపై టెస్టు సిరీస్ వేటలో రోహిత్‌సేన
- దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు నేటి నుంచి
- కంచుకోట సెంచూరియన్‌లో దీమాగా సఫారీ

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-సెంచూరియన్

బాక్సింగ్ డే సమరానికి రంగం సిద్ధమైంది. ఓ వైపు ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌లు సై అంటుండగా.. మరోవైపు భారత్, దక్షిణాఫ్రికాలు సైతం రెడ్‌బాల్ పరీక్షకు సన్నద్ధం అవుతున్నాయి. 2021 సఫారీ పర్యటనలో తొలి టెస్టులోనే సెంచూరియన్‌లో సంచలన విజయం సాధించిన కోహ్లిసేన.. దక్షిణాఫ్రికా గడ్డపై అద్వితీయ టెస్టు సిరీస్ దిశగా కీలక అడుగు వేసింది. కానీ తర్వాతి రెండు టెస్టుల్లోనూ భారత్‌కు కఠిన ఫలితాలు ఎదురయ్యాయి. దీంతో టెస్టు సిరీస్ విజయం మళ్లీ కలగానే మిగిలిపోయింది. ఇప్పుడు రోహిత్‌సేన సైతం అదే స్వప్నంతో సఫారీ గడ్డపై కాలుమోపింది. సెంచూరియన్ వేదికగా దక్షిణాఫ్రికాను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. వైట్‌బాల్ ఫార్మాట్‌లో స్టార్ ఆటగాళ్లు లేకపోవటంతో ఆ సిరీస్‌లు కాస్త కళ తప్పాయి. టెస్టు సిరీస్‌కు ఇరు జట్లు పూర్తి స్థాయి బృందంతో రంగంలోకి దిగుతున్నాయి. పేసర్లు ఫలితాన్ని శాసించే సెంచూరియన్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా బాక్సింగ్ డే ధమాకా నేటి నుంచి ఆరంభం.

సరికొత్తగా.. భారత్

టీమ్ ఇండియా టెస్టు జట్టు సరికొత్తగా కనిపిస్తోంది. అజింక్య రహానె, చతేశ్వర్ పుజారా లేకుండా భారత్ టెస్టు సిరీస్‌కు సన్నద్ధం అయ్యింది. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్ జట్టులో కీలక బాధ్యతలు అందుకుంటున్నారు. యశస్వి జైస్వాల్ కరీబియన్ పర్యటనలో సత్తా చాటాడు. విధ్వంసక బ్యాటింగ్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. శుభమన్ గిల్ ఆల్ ఫార్మాట్ ప్లేయర్‌గా ఎదుగుతున్నాడు. ఈ ఇద్దరు టాప్ ఆర్డర్‌లో మెరిస్తే భారత్ పరుగుల పండుగ చేసుకోగలదు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు భారత్‌కు కీలకం. వన్డే వరల్డ్‌కప్ బాధలో ఉన్న ఈ ఇద్దరు టెస్టు క్రికెట్ మూడ్‌లోకి రావాల్సిన అవసరం ఉంది. రోహిత్ ఇటీవల ధనాధన్ ఆటతో మెరుస్తున్నాడు యశస్వి జైస్వాల్ తోడుగా రోహిత్ శర్మ దంచికొడితే సఫారీ పేసర్లకు చుక్కలే!. ఇక వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ సరికొత్త పాత్ర పోషించనున్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో వికెట్ కీపింగ్ బాధ్యతల్లో మెప్పించిన రాహుల్.. టెస్టుల్లో తొలిసారి గ్లౌవ్స్ అందుకోనున్నాడు. లోయర్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, వికెట్ల వెనకాల కెఎల్ రాహుల్ ప్రదర్శనపై ఫోకస్ ఉండనుంది. గతంలో ఇక్కడ ఆడిన టెస్టులో కెఎల్ రాహుల్ సెంచరీ సాధించాడు. ఆ ఉత్సాహంతోనే అతడు ఈ టెస్టుకు సిద్ధమవుతున్నాడు. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణలు ప్రధాన పేసర్లుగా ఉండనున్నారు. ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్ తుది జట్టులో నిలిచే అవకాశం ఉంది.



దీమాగా సఫారీలు

భారత జట్టు ప్రతిసారీ బలమైన జట్టుతో సఫారీ గడ్డపై అడుగుపెట్టినా.. అంతే బలంగా టీమ్ ఇండియాను నైరాశ్యంలోకి నెట్టేసిన చరిత్ర దక్షిణాఫ్రికా సొంతం. ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఆ జట్టు కనిపిస్తోంది. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ తెంబ బవుమా.. టెస్టులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాడు. స్టార్ బ్యాటర్ ఎడెన్ మార్క్‌రామ్ సఫారీలకు ఆల్ ఫార్మాట్ స్టార్‌గా కనిపిస్తున్నాడు. ఇటీవల వన్డేలు, టీ20ల్లో సత్తా చాటాడు. టెస్టుల్లో మళ్లీ టాప్ ఆర్డర్‌లో వస్తోన్న మార్క్‌రామ్.. పరుగుల వరద పారించేందుకు ఎదురు చూస్తున్నాడు. డీన్ ఎల్గార్, కీగన్ పీటర్సన్ సైతం అంచనాలను అందుకుంటే సఫారీలకు పెద్దగా సమస్య ఉండదు. మార్కో జాన్సెన్, జెరాల్డ్ కోయేట్జి, కగిసో రబాడ, లుంగిసాని ఎంగిడిలతో కూడిన పేస్ లైనప్ భారత్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమవుతోంది. కేశవ్ మహరాజ్ ఏకైక స్పిన్నర్‌గా తుది జట్టులో నిలువనున్నాడు.

పేసర్ల స్వర్గధామం

సెంచూరియన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్ దక్షిణాఫ్రికాలోని అత్యంత వేగవంతమైన పిచ్‌లలో ఒకటి. తొలి రోజు ఆటతో పాటు టెస్టు మ్యాచ్‌కు వర్షం సూచనలు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు పేసర్లకు మరింత అనుకూలిస్తాయి. దీంతో సెంచూరియన్ పేసర్ల స్వర్గధామం కానుంది. సూపర్‌స్పోర్ట్ పార్క్ సఫారీలకు పెట్టని కోట. ఇక్కడ జరిగిన 28 టెస్టుల్లో ఆతిథ్య జట్టు ఏకంగా 22 టెస్టుల్లో విజయాలు సాధించింది. గత 9 చివరి టెస్టుల్లో 8 విజయాలు నమోదు చేసింది. 2021 పర్యటనలో భారత ఇక్కడ దక్షిణాఫ్రికాపై చారిత్రక విజయం నమోదు చేసింది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్, జశ్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

దక్షిణాఫ్రికా : డీన్ ఎల్గార్, ఎడెన్ మార్క్‌రామ్, టోనీ డీ జార్జి, తెంబ బవుమా (కెప్టెన్), కీగన్ పీటర్సన్, కైల్ వెర్రెన్నె (వికెట్ కీపర్), మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, జెరాల్డ్ కొయేట్జి, కగిసో రబాడ, లుంగిసాని ఎంగిడి.

తొలి రోజు కష్టమే!

భారత్, దక్షిణాఫ్రికా టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆట కష్టమే. సెంచూరియన్‌లో వర్షం కారణంగా సోమవారం ఇరు జట్ల ప్రాక్టీస్ సెషన్లకు దూరమయ్యాయి. ప్రాక్టీస్ సెషన్లు షెడ్యూల్ ప్రకారం సాగలేదు. తొలి రోజు సైతం వరుణ గండం పొంచి ఉంది. దీంతో నేడు ఆట సాధ్యపడేది అనుమానమే. రెండో రోజు సైతం వర్షం సూచనలు కనిపిస్తున్నా.. ఆట సాగుతుందని అంచనా వేస్తున్నారు. వేగవంతమైన పిచ్, వర్షంతో పేసర్లు పంజా విసరటం ఖాయం. ఫలితంగా అశ్విన్ స్థానంలో శార్దుల్ ఠాకూర్ టీమ్ ఇండియా తుది జట్టులో నిలిచే అవకాశం కనిపిస్తోంది.



ఆసీస్‌తో సిరీస్‌కు జట్టు ఎంపిక

ముంబయి : ఆస్ట్రేలియాతో వన్డే, టీ20 సిరీస్‌కు భారత మహిళల క్రికెట్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. దేశవాళీ క్రికెట్‌లో మెరిసిన సైక, శ్రేయాంక, మన్నత్ కశ్యప్, టిటాస్ సదూలు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కించుకున్నారు. రేణుక సింగ్, రిచా ఘోష్ సైతం వన్డే జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చారు. భారత్, ఆసీస్ తొలి వన్డే గురువారం ముంబయి వాంఖడేలో జరుగనుంది.

భారత జట్టు : హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), మంధాన, జెమీమా, షెఫాలీ, దీప్తి, యస్తికా, రిచా, అమన్జోత్, శ్రేయాంక, మన్నత్, సైక, రేణుక, టిటాస్, పూజ, రానా, హర్లీన్.



హాకీ అథ్లెట్లకు సాయం

హైదరాబాద్ : ఇద్దరు యువ హాకీ క్రీడాకారులు అరుణ్, తరుణ్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు తెలంగాణ హాకీ సంఘం అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్. ప్రతిభ కలిగిన కుర్రాళ్లు హాకీ పరికరాలు కొనుగోలు చేసేందుకు ఈ సాయం చేసినట్టు ఆయన తెలిపారు. ఇటీవల హాకీ సంఘం అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్.. తెలంగాణలో హాకీకి పూర్వ వైభవం తీసుకొస్తామని, పాఠశాల స్థాయి నుంచి హాకీ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రూ.100 కోట్లు?

హార్దిక్ కోసం ముంబయి ఇండియన్స్ పెట్టిన డబ్బు

పాండ్య బదిలీ కోసం గుజరాత్ టైటాన్స్‌కు చెల్లింపు

నవతెలంగాణ-ముంబయి



రూ.100 కోట్లు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్ వెచ్చించిన మొత్తం ఇది!. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు సీజన్లు గుజరాత్ టైటాన్స్‌ను ఫైనల్స్‌కు నడిపించిన హార్దిక్ పాండ్య.. 2024 ఐపీఎల్ ముంగిట మాతృ ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్ శిబిరానికి చేరుకున్నాడు. గాయంతో కెరీర్ ప్రమాదంలో పడిన సమయంలో గుజరాత్ టైటాన్స్ హార్దిక్ పాండ్యను రూ.15 కోట్లను ఎంచుకుని, కెప్టెన్సీ బాధ్యతలు సైతం అప్పగించింది. క్రికెట్ కెరీర్‌లో ఎన్నడూ నాయకత్వం వహించని హార్దిక్ పాండ్య.. గుజరాత్ టైటాన్స్‌ను ఐపీఎల్ చాంపియన్‌గా నిలిపి ఏకంగా జాతీయ జట్టు పగ్గాలపై కన్నేశాడు. 2023 ఐపీఎల్ ఫైనల్లోనూ టైటిల్ అందుకునేందుకు ఆఖరు బంతి వరకు పోరాడిన గుజరాత్ టైటాన్స్.. చెన్నై సూపర్‌కింగ్స్‌కు తలొగ్గింది. ఇటు ఆటగాడిగా, అటు నాయకుడిగా కొత్త ఇన్నింగ్స్‌ను అందించిన గుజరాత్ టైటాన్స్‌ను హార్దిక్ పాండ్య వీడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే, హార్దిక్ పాండ్యను తిరిగి తెచ్చుకునేందుకు ముంబయి ఇండియన్స్ ఖర్చు చేసిన మొత్తం చూసి క్రికెట్ వర్గాలతో పాటు, అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీల శైలి పూర్తి భిన్నం. ఐపీఎల్ ఫ్రాంచైజీ కోసం సీవీసీ క్యాపిటల్స్ రూ.5625 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఇప్పటివరకు రెండు సీజన్లలో పోటీపడింది. రెండు సార్లు టైటిల్ పోరుకు చేరుకుని ఎదురులేని ట్రాక్ రికార్డు సాధించింది. మరోవైపు భారత దేశంలోనే అత్యంత సంపన్న కుటుంబం నేరుగా ముంబయి ఇండియన్స్ వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఐపీఎల్ ఆరంభం నుంచి ఉన్న ముంబయి ఇండియన్స్.. గ్లోబల్ టీ20 లీగ్‌ల్లో తమదైన మార్క్ చూపించేందుకు ఎంతవరకైనా వెళ్తుంది. అందుకే, ఆల్‌రౌండర్‌గా, నాయకుడిగా తనేంటో నిరూపించుకున్న హార్దిక్ పాండ్య కోసం కనీవినీ ఎరుగని రీతిలో రూ.100 కోట్లు వెచ్చించింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. హార్దిక్ పాండ్యను వదులుకోవటంతో తొలుత గుజరాత్ టైటాన్స్‌కు వేలంలో రూ.15 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. అతడి వార్షిక వేతనం ముంబయి ఇండియన్స్ ఖాతాలోకి వెళ్లింది. కెప్టెన్‌ను వదులుకున్నందుకు గుజరాత్ టైటాన్స్ రూ.100 కోట్ల ప్లేయర్ ట్రాన్స్‌ఫర్ ఫీజు వసూలు చేసింది. ఇందులో 50 శాతం, అంటే రూ.50 కోట్లు నేరుగా హార్దిక్ పాండ్య అందుకుంటాడు. ఈ ఒప్పందం జరిగిన సమయంలో ఆటగాడి బదిలీ ఫీజు కింద ముంబయి ఇండియన్స్ మరో రూ.15 కోట్ల వరకు చెల్లించిందనే వార్తలు వచ్చాయి. కానీ వాస్తవ లెక్కల ప్రకారం రూ.100 కోట్ల ఒప్పందం అని తెలుస్తోంది. అందుకే, గుజరాత్ టైటాన్స్ తమ సారథిని వదులుకునేందుకు సిద్ధపడగా.. హార్దిక్ సైతం అంబానీ ఫ్రాంచైజీలో కెప్టెన్సీ, డబ్బు వస్తుండటంతో సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో హార్దిక్ పాండ్యను తెచ్చుకున్నా.. ముంబయి ఇండియన్స్‌కు ఏదీ కలిసి రావటం లేదు. జట్టులోని సీనియర్ ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రాలు హార్దిక్‌ను కెప్టెన్‌గా చేయటం పట్ల అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియా ఖాతాల్లో ఆ ఇద్దరు ఆటగాళ్లు మనసులో మాట పరోక్షంగా చెప్పారు. రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించటంతో అతడి అభిమానులు ముంబయి ఇండియన్స్ యాజమాన్యంపై భగ్గుమన్నారు. జెర్సీలు కాల్చుతూ నిరసన తెలపటంతో పాటు సోషల్ మీడియాలో ఆ ఫ్రాంచైజీ ఖాతాలను అన్‌ఫాలో అయ్యారు. భావోద్వేగాలను తక్కువ అంచనా వేసిన ముంబయి ఇండియన్స్..ఆ తర్వాత అభిమానులను బుజ్జగించే పనిలో పడినా అప్పటికే పూడ్చలేని నష్టం జరిగిపోయింది. హార్దిక్ కోసం రూ.100 కోట్లు చెల్లించినట్లు వార్తలు వచ్చినా... గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన ప్లేయర్ ట్రాన్స్‌ఫర్ ఫీజు మొత్తం విలువ కేవలం బీసీసీఐ మాత్రమే తెలుసని ఐపీఎల్ వర్గాలు చెబుతున్నాయి.



బబుల్‌గమ్ సూపర్ హిట్ ఖాయం

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి హీరోయిన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీ బుకింగ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించింది. హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్ నందిని రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ,'రవికాంత్ పేరెపు అద్భుతంగా ఈ సినిమాని తీశారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయి. ఈ చిత్రంలో మనందరికీ ఉండే ఎమోషన్స్ ఉంటాయి. ఈ ఎమోషన్స్‌ని అందరూ ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు. 'మహేశ్వరి మూవీస్ నిర్మాణంలో పని చేయడం, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రజెంట్ చేయడం సంతోషంగా ఉంది. శ్రీచరణ్‌తో కలిసి పని చేయడం ఇది మూడోసారి. రోషన్, మానస నన్ను చాలా బలంగా నమ్మారు. అందరూ థియేటర్స్‌లో సినిమా చూడాలి' అని దర్శకుడు రవికాంత్ పేరేపు అన్నారు.

హీరోయిన్ మానస మాట్లాడుతూ, 'నా తొలి చిత్రానికే ఇంత ప్రాధాన్యత ఉన్న పాత్ర దొరకడం ఆనందంగా వుంది. 'బబుల్‌గమ్'లోని ఆది, జాన్వి అందరికీ కనెక్ట్ అవుతారు' అని తెలిపారు. 'రోషన్‌ని ఏడాది క్రితం కలిశాను. అప్పుడు చాలా అమాయక కుర్రాడిలా కనిపించాడు. కానీ ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌లో తన విశ్వరూపం కనిపించింది. ఎక్స్‌ట్రార్డినరీగా చేశాడు' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు.

ఈ వేడుకలో రచయిత అబ్బూరి రవి, దర్శకులు విమల్ కృష్ణ, శ్రీకాంత్ నాగోతి, జ్ఞానసాగర్ ద్వారాక, ఆదిత్య

నవచిత్రం

సరికొత్త పాయింట్‌తో అగ్లీ స్టోరీ



నందు, అవికాగోర్

లక్కీ మీడియా, రియాజియా సంస్థ సంయుక్తంగా ప్రణవ స్వరూప్ దర్శకత్వంలో నందు, అవికా గోర్ హీరో, హీరోయిన్లుగా నిర్మిస్తున్న సినిమా 'అగ్లీ స్టోరీ'. ఇటీవల రిలీజ్ అయిన గ్లింప్స్ అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రణవ స్వరూప్ మాట్లాడుతూ, 'ఈ మూవీతో 2024లో హిట్టు కొట్టబోతున్నాం. నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, సుభాషిని, కొండా లక్ష్మణ్ నన్ను, నా కథను నమ్మి నిర్మించారు. గతంలో రిలీజ్ అయిన ఫస్ట్‌లుక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు రిలీజ్ అయిన గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. టీజర్ క్లైమాక్స్‌లో నందు చెప్పిన 'ఇమేజినేషన్లో ఉన్న ప్రేమ రియల్ లైఫ్‌లో ఉండదు' అనే డైలాగ్‌కి చాలా మంచి స్పందన లభిస్తోంది. ఈ గ్లింప్స్ ఇచ్చిన రెస్పాన్స్‌తో టీజర్, ట్రైలర్, సినిమాని ఇంకా చాలా కొత్తగా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌కి వెళ్తున్నాం' అని అన్నారు.



అవార్డుల గురించి సీఎంతో చర్చిస్తా

- మంత్రి జూపల్లి కృష్ణారావు

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చే నంది అవార్డుల ప్రదానం ఆగిపోవడం బాధాకరమని, ముఖ్యమంత్రితో చర్చించి తెలంగాణ రాష్టం తరఫున అవార్డులు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ టూరిజం సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో 'ఆకృతి' సంస్థ 'ఆధ్వర్యంలో, సారిపల్లి కొండలరావు సౌజన్యంతో ప్రముఖ సినీ నటి, గాయని, నిర్మాత సి.కృష్ణ వేణి వందవ సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా ఆమె శత వసంత మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కృష్ణవేణిని ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా సత్కరించారు. తెలుగు చలన చిత్ర రంగానికి కృష్ణవేణి చేసిన విస్తృత సేవలను కొనియాడారు. ఎందరో మహా నటుల భవితవ్యాన్ని ఆమె తీర్చిదిద్దారు అంటూ ప్రస్తుతించారు. కృష్ణ వేణి లాంటి ఒక సినీ దిగ్గజ నటిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

మురళీ మోహన్ మాట్లాడుతూ,' ప్రభుత్వం తరపున ఇచ్చే నంది అవార్డులను సినీ నటీనటులందరూ ఎంతో గౌరవంగా భావిస్తాం. గత పదేళ్లుగా ఈ ప్రక్రియ ఆగిపోవడం బాధాకరం. మంత్రి వర్యులు చొరవ తీసుకుని అవార్డులను పున:ప్రారంభం చేయాలని సినీ రంగం తరఫున అభ్యర్థిస్తున్నాను' అని చెప్పారు.

కృష్ణ వేణి కుటుంబంతో తన అనుబంధాన్ని నటి జయసుధ గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమానికి సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించారు. సినీ రోజా రమణి, డా. కృష్ణక్క, నాగ సుశీల, సుప్రియ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, నిర్మాత రామ సత్యనారాయణ, దర్శకులు శివ నాగేశ్వర రావు తదితరులు ఈ వేడుకలో పాల్గొని అలనాటి నటి కృష్ణ వేణి సేవలను కొనియాడారు. ఆకృతి సుధాకర్ ఈ వేడుకకు అద్భుతంగా సమన్వయం చేశారు.

ఆ కన్నుల చూపుల్లోనా..



అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'ముఖ్య గమనిక'. లావణ్య హీరోయిన్.

పలు విజయ వంతమైన చిత్రాలకు సినిమాటో గ్రాఫర్‌గా పనిచేసిన వేణు మురళీధర్.వి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా రాజశేఖర్, సాయి కృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి డైరెక్టర్ బాబీ ముఖ్య అతిథిగా హాజరై ఈ చిత్రంలోని ఫస్ట్ లిరికల్ సాంగ్ 'ఆ కన్నుల చూపుల్లోనా...'ని రిలీజ్ చేశారు. 'నాకు అండగా నిలిచి సపోర్ట్ చేస్తున్న దర్శకుడు బాబీకి కృతజ్ఞతలు' అని హీరో విరాన్ ముత్తంశెట్టి అన్నారు.

దర్శకుడు వేణు మురళీధర్ మాట్లాడుతూ, 'తప్పు చేయాలన్న ఆలోచన వచ్చి, ఆ ఆలోచనని సరిదిద్దుకునే లోపే కొన్ని అనర్థాలు జరుగుతాయి. దాన్ని బేస్ చేసుకుని చేసిన సినిమా ఇది. మూవీ షూటింగ్ కంప్లీట్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఈ సినిమాకి హీరోగా విరాన్ మాకు దొరకడం మా అదృష్టం. ఈ అవకాశం ఇచ్చిన మా నిర్మాతలకి ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని తెలిపారు. నిర్మాత రాజశేఖర్ మాట్లాడుతూ, ' మా బ్యానర్‌లో వస్తోన్న ఫస్ట్ మూవీ. త్వరలో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం. సినిమాలో రెండు పాటలు ఉన్నాయి. రెండు అద్భుతంగా వచ్చాయి' అని చెప్పారు.

బన్నీని ఎప్పుడు కలవడానికి వెళ్లినా ఇన్నో సెంట్‌గా ఒక అబ్బాయి వచ్చి తీసుకెళ్లి కూర్చోబెట్టడం..టీ, కాఫీల గురించి అడుగుతూ ఉండేవాడు. అతను అల్లు అర్జున్‌కి బంధువు అవుతారని నాకు నిజంగా తెలీదు. రీసెంట్‌గా కలిసినప్పుడు అన్నయ్య ఇలా సినిమా తీశా. ఈవెంట్‌కి మీరు రావాలి అని అడిగాడు. అంత పెద్ద ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ పెట్టుకుని వాళ్ల సహాయం తీసుకోకుండా కేవలం వారి ఆశీస్సులు మాత్రమే తీసుకుని ఇండిపెండెంట్‌గా ప్రయత్నిస్తున్నావంటే..ఇదే నీ సక్సెస్‌కి పెద్ద పిల్లర్ అని చెప్పాను. ఇక దర్శకుడు వేణు రాజమౌళి ఎన్నో సినిమాలకి చీఫ్ అసోసియేట్ డీఓపీగా పనిచేశారని తెలిసింది. మీ విజన్ ఖచ్చితంగా ఆ స్థాయిలో ఉంటుందని ఆశిస్తున్నాను. సాంగ్ చూశాను. చాలా బాగుంది. సింగర్ నకాశ్ అజీజ్ బాగా పాడాడు.

- దర్శకుడు బాబీ



టీఎఫ్‌జెఎకు నాట్స్ రూ.5 లక్షల విరాళం

సుమ కనకాల సేవా సంస్థ ఫెస్టివల్స్ ఫర్ జాయ్ చొరవతో తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిఎఫ్‌జెఎ)కు నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ప్రకటించిన రూ.5 లక్షల విరాళాన్ని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వై.జె.రాంబాబు, ట్రెజరర్ నాయుడు సురేంద్ర కుమార్, ఇతర అసోసియేషన్ సభ్యులకు సుమ కనకాల సోమవారం అందజేశారు.

ఈ సందర్భంగా నాట్స్ ఉపాధ్యక్షుడు మదన్ పాములపాటి, నాట్స్ మెంబర్స్ సెహ్మాదాలి, శ్రీధర్ అప్పసాని, అరుణ గంటి, బాపు నూతి, ప్రశాంత్ పిన్నమనేనిలతో పాటు ఫెస్టివల్ ఫర్ జాయ్‌తో కలిసి వర్క్ చేస్తున్న నాట్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రాజ్ అల్లాడకు టీఎఫ్‌జేఏ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు.

ఘనంగా నిర్మాత కాకర్ల కృష్ణ స్వర్ణోత్సవ వేడుక



తెలుగు సినిమా రంగంలో ప్రొడక్షన్ మేనేజర్‌గా ప్రవేశించి, తరువాత నిర్మాతగా మారి కాకర్ల కృష్ణ అంచెలంచెలుగా ఎదిగారని నటుడు మురళి మోహన్ చెప్పారు.

1974లో కె.సత్యం దర్శకత్వంలో కృష్ణ, అంజలీదేవి, చంద్రకళతో కాకర్ల కృష్ణ రూపొందించిన 'ఇంటింటి కథ' సినిమా విడుదలై 50 సంవత్సరాలు. ఈ సందర్భంగా ఆదివారం ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్లో కృష్ణ స్వర్ణోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో కాజా సూర్యనారాయణ, పరుచూరి గోపాల కృష్ణ, కోమటిరెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్మాత కాకర్ల కృష్ణను ఫిలిం నగర్ దైవ సన్నిధానం వేద పండితులు ఆశీర్వదించారు.

మురళీ మోహన్ మాట్లాడుతూ, 'రాజేంద్రప్రసాద్ జగపతి సంస్థలో కృష్ణ ప్రొడక్షన్ మేనేజర్‌గా విజయవంతమైన సినిమాలకు పనిచేశారు. ఆ తరువాత 'ఇంటింటి కథ' సినిమాతో నిర్మాతగా మారారు. 'ఏడంతస్తుల మేడ', 'ఊరంతా సంక్రాంతి', 'రాగ దీపం' తదితర సినిమాల్లో భాగస్వామిగా పని చేశారు. అలాగే ఫిలింనగర్ దైవ సన్నిధానంలో నాతో పాటు కృష్ణ కూడా కమిటీలో ఉండి దేవాలయానికి సేవలందించారు' అని తెలిపారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, 'కృష్ణ మా అందరికీ ఆత్మీయుడు. ఆయన స్వర్ణోత్సవం జరగడం ఎంతో సముచితంగా, సంతోషంగా ఉంది' అని అన్నారు. కృష్ణ మనుమడు త్రికాంత్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నిర్మాత అభిషేక్, రామ సత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్, కెమెరామన్ నవ కాంత్, నిరంజన్, మేకప్ మాధవ రావు, ఛాయాగ్రాహకుడు హరనాథ్, జర్నలిస్టులు భగీరథ, ఉమామహేశ్వర రావు, గోరంట్ల సురేష్, గోపాల రావు, బాలరాజు, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.